ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 14, మే 2025

అక్రమాల డంప్

చీమకుర్తిలో వాగు పోరంబోకు భూములు దర్జాగా కబ్జా

ప్రభుత్వ పరిధిలో ఉన్న వాగుపోరంబోకు భూములను దర్జాగా కబ్జా చేశారు. పైసా చెల్లించకుండా అప్పనంగా గ్రానైట్ డంపులకు ఉపయోగించుకుంటున్నారు. ఏన్నో ఏళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారం ఎట్టకేలకు రట్టయ్యింది. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణదారులకు వాగు భూముల్లో ఎన్‌వోసీలు ఇచ్చిన రెవెన్యూ అధికారుల అవినీతి కంపు సైతం బయటపడింది. ఈ కబ్జా బాగోతం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ విస్తరించిన చీమకుర్తి, ఆర్‌ఎల్‌పురం పంచాయతీల పరిధిలో చోటు చేసుకుంది. రెండు నెలల క్రితం ఈ ఆక్రమణల పర్వాన్ని నిగ్గుతేల్చాలని ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె విచారణకు ఆదేశించడంతో నిజమేనని తేలింది.

- సర్వేలో వెలుగుచూసిన 150 ఎకరాలు
- దాదాపు 90 ఎకరాలు ఆక్రమించి గ్రానైట్ వ్యర్థాల పారబోత
- మిగతా కొన్ని భూములకు ఎన్‌వోసీలు
- బహిర్గతమవుతున్న అధికారుల అవినీతి బాగోతం
- ఆ భూముల్లో గుర్తించిన రాళ్లు మావి కావంటూ తప్పించుకుంటున్న యజమానులు
- ఉన్నతాధికారులకు నివేదించనున్న తహసీల్దార్



ఆర్ఎల్ పురం వద్ద భూముల సర్వేలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

చీమకుర్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్‌కు నెలవైన చీమకుర్తి ప్రాంతంలో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారు. ఎన్నో ఏళ్లుగా వాటిలో వ్యర్థాలను పారబోస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా డంప్‌లను, ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలను ఎగ్గొడుతున్నారు. ఇటీవల చిరంజీవి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ స్పందించారు. రెవెన్యూ, మైన్స్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి వాగుపోరంబోకు భూముల్లో ఏమేరకు ఆక్రమణలు చోటుచేసుకున్నాయే నిగ్గుతేల్చాలని ఆదేశించారు. ఈమేరకు ఇటీవల రెవెన్యూ అధికారులు గ్రానైట్ పరిశ్రమ విస్తరించిన ఆర్ఎల్‌పురం, చీమకుర్తి పరిధిలోని వాగు పోరంబోకు భూముల్లో సర్వే నిర్వహించారు. ఇంకా బూదవాడ పంచాయతీ పరిధిలో సర్వే నిర్వహించాల్సి ఉంది.

అక్రమంగా ఎన్‌వోసీలు

చీమకుర్తి, ఆర్ఎల్ పురం పరిధిలో నిర్వహించిన సర్వేలో రెవెన్యూ అధికారులు సైతం విస్తుపోయే విధంగా ఆక్రమణలు, ఎన్‌వోసీల మంజూరు బహిర్గతమైంది. దాదాపు 150 ఎకరాల వాగు పోరంబోకు భూములు అన్యాక్రాంతమైనట్లు సర్వేలో తేలింది. గ్రానైట్ క్వారీల యజమానుల్లో కొంతమంది సింహభాగం ఆక్రమించుకొని డంపులు, ఇతర

మిగతా 6వ పేజీలో



అక్రమణకు గురైన వాగుపోరంబోకు భూముల్లో గ్రానైట్ డంపులు

రేపు అమ్మనబ్రోలుకు మంత్రి లోకేష్

వీరయ్యచౌదరి కుటుంబానికి పరామర్శ

ఒంగోలు, మే 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు రానున్నారు. ఇటీవల దారుణ హత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించనున్నారు. గతనెల 22వ తేదీ రాత్రి వీరయ్య చౌదరి ఒంగోలులోని తన కార్యాలయంలో హత్యకు గురైన విషయం విదితమే. ఆమరుసటి రోజున స్వగ్రామమైన అమ్మనబ్రోలులో అంత్యక్రియలు జరగ్గా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చి వీరయ్య చౌదరికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈనెల 8న నిర్వహించిన వీరయ్యచౌదరి దశదిన కర్మకు మంత్రి నారా లోకేష్ వస్తారని ప్రచారం జరిగింది. ఆరోజున రాష్ట్రమంత్రి వర్గసమావేశం ఉండటంతో రాలేకపోయారని సమాచారం. ఈనేపథ్యంలో గురువారం ఆయన వీరయ్యచౌదరి కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్నారు. ఆ మేరకు అధికారికంగా ఇటు పార్టీ నేతలకు, అటు అధికార యంత్రాంగానికి సమాచారం అందింది. లోకేష్ గురువారం ఉదయం 8గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 8.45 గంటలకు నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 9 గంటలకు బయల్దేరి 9.20 గంటలకు అమ్మనబ్రోలుకు వెళ్తారు. 9.30 నుంచి 10 గంటల వరకూ వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. తిరిగి 10.50 గంటలకు చదలవాడ హెలిప్యాడ్‌కు చేరుకొని 11 గంటలకు హెలికాప్టర్‌లో అనంతపురం జిల్లా గుత్తికి వెళ్తారు.



జయహో.. గంగమ్మతల్లి!

- ప్రారంభమైన పాలేటి గంగ తిరునాళ్ల
- నేడు గంగాభవానీ అలంకరణ
- రేపు గ్రామోత్సవం
- తరలివస్తున్న భక్తజనం

6





వేడెక్కిన మునిసిపల్ రాజకీయం

- చీరాలలో క్యాంపు పాలిటిక్స్‌కు వైసీపీ శ్రీకారం
- క్లైమాక్స్‌లో ఉత్కంఠ
- మార్కాపురంలో పావులు కదుపుతున్న వైసీపీ
- అక్కడా పాత ఒప్పందాలపై ఆ పార్టీ మల్లగుల్లాలు
- కౌన్సిలర్లకు డబ్బు ఎర

7లో

9 రకాల పాఠశాలలకు ఆమోదం



- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- విద్యాశాఖ ఉత్తర్వులు

ఒంగోలు విద్య, మే 13 (ఆంధ్రజ్యోతి) : పునర్విభజనలో భాగంగా తొమ్మిది రకాల పాఠశాలలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ విధానం అమలులోకి రానుంది. ఈ మేరకు పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం 117 జీవోను విడుదల చేసింది. ఈ విధానంలో హైస్కూళ్లలో 3, 4, 5 తరగతులను విలీనం చేయడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. 117 జీవోను రద్దుచేయాలని ఆందోళనలు కూడా జరిగాయి. ఈక్రమంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 117 జీవోను రద్దుచేసి ప్రత్యామ్నాయంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణకు 19 జీవోను మంగళవారం విడుదల చేసింది. గత ప్రభుత్వంలోని ఆరు రకాల స్థానంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలకు ఊపిరిపోసింది. గత ప్రభుత్వంలో హైస్కూల్‌లో విలీనమైన 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలకు వెనక్కు పంపాలని అందరూ డిమాండ్ చేశారు. దాన్ని పక్కనపెట్టి ప్రస్తుతం హైస్కూళ్లలో 1 నుంచి 10 తరగతుల వరకు నిర్వహణకు ప్రభుత్వం అనుమతించింది. జిల్లాలోని దాదాపు సగం హైస్కూళ్లలో 1 నుంచి 10 తరగతులు నిర్వహించనున్నారు. జిల్లాలో 82 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రభుత్వ మానస పుత్రికగా అమలులోకి వస్తున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెచ్‌ఎం పోస్టులు ఇస్తున్నారు. ఈ పాఠశాలలకు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం(పీఎస్‌హెచ్‌ఎం) పోస్టులు కేటాయిస్తున్నారు. పీఎస్ హెచ్‌ఎం పోస్టులు సరిపోకపోతే ఆ పాఠశాలలకు మిగులు స్కూలు అసిస్టెంట్లను హెచ్‌ఎంలుగా నియమిస్తున్నారు.

ప్రభుత్వం తాజాగా అమలులోకి తెస్తున్న తొమ్మిది రకాల పాఠశాలలు ఇవీ..

శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ : పూర్వ ప్రాథమిక (పీపీ1) పూర్వ ప్రాథమిక-2 (పీపీ2) పాఠశాలలు. వీటిని

మిగతా 6వ పేజీలో

4 వేల మంది టీచర్లకు స్థానచలనం!

ఖాళీలపై కసరత్తు పూర్తి

కమిషనర్ వెబ్‌సైట్‌లో వివరాలు

ఒంగోలు విద్య, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో త్వరలో చేపట్టనున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన కసరత్తు పూర్తయ్యింది. సుమారు 4వేల మందికి స్థానచలనం కలగనుంది. 2017లో జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లిన టీచర్లందరూ ప్రస్తుతం బదిలీ కావాల్సి ఉంది. ఒకేచోట ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్లు పూర్తయిన ఇతర టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారి జాబితాలో ఉన్నారు. పాఠశాలల్లో మిగులుగా తేలిన టీచర్లందరూ బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సిందే. మెరుగైన స్థానాలకు బదిలీ కోరుకొనే జాబితాలో 4వేల మంది ఉన్నారు. బదిలీ అయ్యేవారిలో సింహభాగం సెకండరీ గ్రేడ్ టీచర్లే. జిల్లాలోని మొత్తం ఉపాధ్యాయుల్లో సుమారు మూడోవంతు మందికి స్థానచలనం కలగనుంది. ప్రస్తుతం ఉన్న క్లియర్ వేకెన్సీలు, మే 31 నాటికి ఉద్యోగ విరమణ ద్వారా వచ్చే

మిగతా 6వ పేజీలో

ఐదు రోజులు.. 5,828 దరఖాస్తులు

- రైస్ కార్డుల కోసం భారీగా దాఖలు
- కొత్తవి కోరుతూ వచ్చినవి 1,015
- పేర్ల చేర్పు కోసం 4,087.. ఇతరత్రా మరికొన్ని

7

కూలీల బతుకుల్లో చీకట్లు



రమణారెడ్డి, సుబ్బమ్మ (ఫైల్)



అంకమ్మ, రామాంజి పెళ్లినాటి ఫొటో

రోడ్డు ప్రమాదంలో రెండు కుటుంబాల్లోని భార్యాభర్తలు మృతి

- పల్నాడు జిల్లాలో ఘటన
- గడ్డమీదపల్లిలో విషాదం

ఎర్రగొండపాలెం రూరల్ మే 13 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం కూలి పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగించే కుటుంబాల బతుకులు చీకటయ్యాయి. ఒకే గ్రామంలో రెండు కుటుంబాల్లోని భార్యభర్తలు మృత్యువాతపడ్డారు. దీంతో వారి పిల్లలు అనాథలయ్యారు. ఎర్రగొండపాలెం మండలం గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన పలువురు కూలీలు పనుల కోసం పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలో బొప్పాయి కాయలు కోసేందుకు రెండు వాహనాల్లో మంగళవారం ఉదయం గ్రామం నుంచి బయల్దేరారు. అప్పటి వరకు సరదాగా మాట్లాడుకుంటున్న వారి జీవితాల్లోకి ప్రమాదం మంచుకొచ్చింది. వినుకొండ మండలం శివాపురం సమీపంలో జాతీయ రహదారిపై బొలేరోను ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన పగడాల సుబ్బమ్మ (38), బొట్టు అంకమ్మ (28) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన పగడాల రమణారెడ్డి (45), బొట్టు రామాంజి (34)ను వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. ఒకే గ్రామానికి చెందిన వీరు నలుగురూ భార్యాభర్తలు కావడంతో విషాదచాయలు అలముకున్నాయి.



వినుకొండ వైద్యశాల వద్ద విలపిస్తున్న రమణారెడ్డి కుటుంబసభ్యులు

అనాథలైన పిల్లలు

బొట్టు అంకమ్మది గడ్డమీదపల్లి స్వగ్రామం. కాగా పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం దాపల్లె గ్రామానికి చెందిన రామాంజితో వివాహమైంది. అయితే అక్కడి నుంచి అంకమ్మ స్వగ్రామానికి కుటుంబంతో సహా వచ్చారు. ఇక్కడే ఇద్దరూ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఆరేళ్ల పవన్‌కుమార్, నాలుగు సంవత్సరాల నాగ చైతన్య ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో ఆ చిన్నారులు అనాథలుగా మారారు. వారి మృతదేహాలను వినుకొండ నుంచి స్వగ్రామమైన దాపల్లెకు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. పగడాల రమణారెడ్డి, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దమ్మాయికి వివాహమైంది. కుమారుడు వెంకటరెడ్డి బీఫార్మసీ చదువుతున్నాడు. మరో అమ్మాయి నవిత ఇంటర్ పూర్తి చేసింది. తల్లిదండ్రులు మృత్యువాత పడడంతో వారు పెద్ద దిక్కు లేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. మృతదేహాలను చూసేందుకు గ్రామ ప్రజలు తరలివచ్చారు.

అక్రమాల డంప్

(5వ పేజీ తరువాయి)

క్వారీ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నట్లు బయటపడింది. మిగతా భూముల్లో కొంతమేర ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకొని పట్టాలను సైతం పొందారు. ఇంకా డొంక పోరంబోకు, ఇతర ప్రభుత్వ భూముల్లో సైతం సర్వే నిర్వహిస్తే మరిన్ని ఆక్రమణలు వెలుగుచూసే అవకాశం ఉంది.

ఆక్రమణలు పర్వం ఇలా...

రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వేలో వాగుపోరంబోకు భూములను ఆక్రమించుకొని గ్రానైట్ డంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. సర్వే నంబర్ 162లో 28.87 ఎకరాలు, 163లో 15.93 ఎకరాలు, 130లో 22 ఎకరాలు, 146లో 11.24 ఎకరాలు, 103లో 3.16 ఎకరాలు మేరకు ఆక్రమించుకొని డంపులు నిర్వహిస్తున్నట్లు సర్వేలో గుర్తించారు. వారు ఎవరు అనేది తేల్చలేక అధికారులు సతమతమవుతున్నారు. డంపులు ఎవరివి అని క్వారీ యజమానులను సంప్రదించగా ఎవరికి వారు మావి కాదని తప్పించుకోవాలని చూస్తుండటంతో రెవెన్యూ అధికారులు తలలుపట్టుకుంటున్నారు. మావి అని చెబితే భారీ పెనాల్టీలు కట్టాల్సి వస్తుందేమో అని యజమానులు తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆక్రమణదారుల లెక్కతేల్చే బాధ్యత మైనింగ్ అధికారులకు రెవెన్యూ అధికారులు అప్పజెబుతున్నారు. వీరు రంగంలోకి దిగితే కబ్జాదారుల బాగోతం బయటపడే అవకాశం ఉంది. డంపులకు ఎన్‌వోసీలు ఇచ్చిన అధికారుల అవినీతి వ్యవహారం కూడా వెలుగులోకి రావడం ఖాయం. అప్పుడు ఆక్రమణదారుల నుంచి భారీగా రికవరీ చేసే అవకాశం ఉంటుంది. ఈ కబ్జా బాగోతాన్ని సవివరంగా జిల్లా ఉన్నతాధికారులకు రెవెన్యూ అధికారులు నివేదించనున్నారు. ఆ మేరకు అధికారులు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది

సర్వేలో కబ్జాలను గుర్తించాం

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంయుక్త సర్వే నిర్వహించాం. అందులో దాదాపు 150 ఎకరాల్లో వాగు పోరంబోకు భూములు కబ్జాకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించాం. గ్రానైట్ డంపులను నిర్వహిస్తున్న వారి వివరాలు తేల్చాలని మైన్స్ అధికారులను కోరాం. పూర్తిస్థాయిలో నివేదిక రూపొందించి తగు చర్యల నిమిత్తం కలెక్టర్‌కు నివేదించాం.

- బ్రహ్మయ్య, తహసీల్దార్, చీమకుర్తి

తొమ్మిది రకాల పాఠశాలలకు ఆమోదం

(5వ పేజీ తరువాయి)

అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాలలకు కిలోమీటరు కంటే ఎక్కువ దూరంలో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలు శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లగా పనిచేస్తాయి.

ఫౌండేషన్ స్కూల్ : పీపీ1, పీపీ2లో 1, 2 తరగతులు నిర్వహిస్తారు. ఈ పాఠశాలలకు 1 నుంచి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీ, 31 కంటే ఎక్కువ 60 మంది వరకు ఉంటే రెండు ఎస్జీటీ పోస్టులు కేటాయిస్తారు.

బేసిక్ ప్రైమరీ స్కూల్ : 1 నుంచి 5 తరగతులు. ఈ పాఠశాలలకు 1 నుంచి 20 మందికి ఒక ఎస్జీటీ, 21 నుంచి 60 మందికి రెండు ఎస్జీటీ ఆపైన ప్రతి 30 మందికి ఒక ఎస్జీటీని కేటాయిస్తారు.

మోడల్ ప్రైమరీ స్కూల్ : 1 నుంచి 5 తరగతులు. 59 మంది వరకు ఒక పీఎస్ హెచ్‌ఎం, 3 ఎస్జీటీలు, 60 నుంచి 150 మందికి 1 ఒక పీఎస్ హెచ్‌ఎం/ఎస్‌ఏ, నాలుగు ఎస్జీటీ పోస్టులు, ప్రతి 30 మందికి అదనంగా ఒక ఎస్జీటీని ఇస్తారు.

ప్రాథమికోన్నత పాఠశాలలు : 1 నుంచి 5 తరగతులకు బీపీఎస్/ఎంపీఎస్‌ల తరహాలో విద్యార్థుల సంఖ్యను బట్టి పోస్టులు ఇస్తారు. 6, 7, 8 తరగతులకు 1 నుంచి 10కి ఒక ఎస్ఏ, 11 నుంచి 20 మందికి రెండు ఎస్‌ఏలు, 31 నుంచి 140కి నాలుగు ఎస్‌ఏలు, 141 నుంచి 175కు ఐదు ఎస్‌ఏలను ఇస్తారు. మిగులు ఎస్‌ఏలు లేకపోతే ఎస్జీటీలను ఇస్తారు.

హైస్కూలు (1 నుంచి 10 తరగతులు) : 1నుంచి 5 తరగతులకు 10మందికి రెండు ఎస్జీటీలు, 11 నుంచి 30 వరకు మూడు ఎస్జీటీలు, 31 నుంచి 59 వరకు ఒక పీఎస్ హెచ్‌ఎం/ఎస్ఏ, 3 ఎస్జీటీలు ఇస్తారు. 6 నుంచి 10 తరగతులకు సెక్షన్లను బట్టి ఎస్‌ఏలను ఇస్తారు,

హైస్కూళ్లు 6 నుంచి 10 తరగతుల వరకు : సెక్షన్ల ఆధారంగా పోస్టులు కేటాయిస్తారు.

హైస్కూల్ ప్లస్ 6 నుంచి 12 తరగతులు : సెక్షన్ల ఆధారంగా పోస్టులు, 11, 12 తరగతులకు పీజీ విద్యార్హతలు ఉన్న వారు బోధిస్తారు.

హైస్కూల్ ప్లస్ 1 నుంచి 12 తరగతులు : ప్రాథమిక, ఉన్నత సెక్షన్లకు నిబంధనల ప్రకారం టీచర్లను కేటాయిస్తారు. 11, 12 తరగతులకు పీజీ టీచర్లు బోధిస్తారు.

3,048 పాఠశాలలు

ఉమ్మడి జిల్లాలో 3,048 పాఠశాలలు ఉన్నాయి. హైస్కూళ్లు, హైస్కూలు ప్లస్‌లో 1 నుంచి 5 తరగతులకు ఎస్జీటీలు, 6 నుంచి 12 తరగతులకు స్కూలు అసిస్టెంట్లు బోధిస్తారు.

జిల్లాలో పాఠశాలల రకాలు ఇవే..

పాఠశాల పేరు	సంఖ్య
శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు	02
ఫౌండేషన్ స్కూళ్లు	353
బేసిక్ ప్రైమరీ స్కూళ్లు (బీపీఎస్)	1,394
మోడల్ ప్రైమరీ స్కూళ్లు (ఎంపీఎస్)	670
అప్పర్ ప్రైమరీ స్కూళ్లు	85
హైస్కూళ్లు	318
యూపీ డౌన్‌గ్రేడ్ బీపీఎస్	38
యూపీ డౌన్‌గ్రేడ్ టీఎంపీఎస్	44
హైస్కూలు బీపీఎస్ (1నుంచి10)	47
హైస్కూలు ఎంపీఎస్ (1నుంచి10)	15
అప్‌గ్రేడ్ హెచ్‌ఎం, బీపీఎస్	06
అప్‌గ్రేడ్ హెచ్‌ఎస్, ఎంపీఎస్	76
మొత్తం	3,048

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

● ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్

ఒంగోలు కార్పొరేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్ ఆదేశించారు. మంగళవారం నెల్లూరు నుంచి విజయవాడ వెళుతూ మధ్యలో ఒంగోలు ఆర్టీసీ డిపోను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, అలాగే బస్టాండులో అన్ని ఫ్యాన్‌లు, కూలర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా వేసవి కారణంగా తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. మరుగుదొడ్లు పరిశీలించిన ఆయన నిర్వహణ సక్రమంగా లేదని, ప్రతిరోజు శుభ్రపరిచేలా చూడాలని సిబ్బందికి సూచించారు. డిపోలోని క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించడం తోపాటు, డిపో ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆర్‌ఎం సత్యనారాయణ, డీఎం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

జయహో.. గంగమ్మతల్లి!

● ప్రారంభమైన తిరునాళ్ల ● నేడు గంగాభవానీగా అలంకరణ ● రేపు గ్రామోత్సవం ● తరలివస్తున్న భక్తజనం



పీసీపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాపురం సమీపంలో పాలేటినది ఒడ్డున వెలసిన గంగమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. మంగళవారం నుంచి ప్రారంభమైన గంగమ్మ తిరునాళ్లకు నిర్వాహకులు అంకురార్పణ చేశారు. 14వ తేదీన అమ్మవారిని అలంకరిస్తారు. 15వ తేదీన రామాపురం, గుడేవారిపాలెం, పెదఅలవలపాడు, వెంగళాపురం గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు. 16వ తేదీన గంగాభవానీ ఆలయం ఉన్న వెంగళాపురం సమీపంలోని పాలేటి ఒడ్డున తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ తిరునాళ్లలో బొల్లావులను ఎత్తుకున్న భక్తులు చేసే నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. చివరి రోజైన శనివారం మహిళా భక్తులు పొంగళ్లు పెట్టి గంగాభవానికి నైవేద్యం సమర్పించడంతో తిరునాళ్ల ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

ఆలయ ఇదీ చరిత్ర

పండితులు, భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. 13వ శతాబ్దానికి చెందిన పాలేటి గంగమ్మను యాదవులు కులదైవంగా పూజిస్తారు. కనిగిరి సీమను ఏలే కాటమరాజు తమ ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుడిని పూజించేవారు. కొంతకాలం తరువాత గంగాభవానీని నిర్లక్ష్యం వహించడంతో ఆగ్రహించిన గంగమ్మ కాటమరాజు ప్రేమగా చూసుకునే ఆవును దాచిపెడుతుంది. తన ప్రాణ సమానమైన ఆవు కనిపించకపోవడంతో మానసికంగా కుంగిపోతాడు. కాటమరాజు కలలో కనిపించిన గంగమ్మ తనను పూజించి ఆరాధిస్తే ఆవును ఇస్తానని చెబుతుంది. దీంతో కాటమరాజు గంగమ్మకు కొలువు నిర్వహించగా పాలేటినది గర్భం నుంచి ఆవు బయటకు వస్తుంది. ఆ ప్రదేశంలో రాతిపై గంగాభవానీని ప్రతిష్ఠించి పూజించారు. 1236 ఏడాదిలో పాలేటినది ఒడ్డున గంగమ్మ సన్నిధానంలో పంచలింగాల కొండకు ఉత్తరం వైపున నెల్లూరును పాలించే రాజు మనుమసిద్ధికి కాటమరాజుకు భీకరయుద్ధం జరిగినట్లు చరిత్ర చెప్తుంది. ఈ సంగ్రామంలో మనుమసిద్ధికి మంత్రి ఖడ్గ తిక్కన యోధులుగా చరిత్రలో పేరు నిలిచింది. అప్పటి నుంచి ఆ ప్రాంతాన్ని యర్రగడ్డపాడుగా పిలుస్తారు. అక్కడ ఏ గ్రామం లేకపోయినా నేటికీ రెవెన్యూ రికార్డుల్లో యర్రగడ్డపాడుగా నమోదై ఉంది.

భారీ బందోబస్తు

1975లో పోలీసులకు, భక్తులకు మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు పోలీసులను గుళ్లో సజీవదహనం చేశారు. ఆ క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో 10 మంది భక్తులు చనిపోయారు. అప్పటినుంచి నేటి వరకు ఏటా నిర్వహించే గంగమ్మ జాతరకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది తిరునాళ్లకు కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పర్యవేక్షణలో కనిగిరి సీఐ షేక్.ఖాజావలి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు. ఈ తిరునాళ్ల సందర్భంగా కాకతీయ కమ్మ సేవా సంఘం, యాదవ సంఘం, రెడ్డి సంఘం, వడ్డెర సంఘం ఇలా పలు సేవాసంఘాల ఆధ్వర్యంలో ఉదయం నుంచే ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు. పలు గ్రామాలకు చెందినవారు 9 విద్యుత్ ప్రభలు (టీడీపీ 5, వైసీపీ 3, బీసీవై పార్టీ 1)లను ఏర్పాటుచేసి వాటిపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉపాధి కోసం హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు తాత్కాలికంగా వలస వెళ్లిన వారంతా ఈ తిరునాళ్ల సందర్భంగా వారి సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

పుస్తకానికి పట్టం కడదాం


జాతీయోద్యమ నాయకుల వేషధారణలో చిన్నారులు

● విద్యార్థులలో పుస్తక పఠనం పెరగాలి
● మరో గ్రంథాలయ ఉద్యమ వ్యవస్థాపకుడు మంచికంటి
● అలరించిన విద్యార్థుల వేషధారణలు

ఒంగోలు(కల్చరల్), మే 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సెల్‌ఫోన్ ప్రభావంతో పుస్తక పఠనం చేసే వారి సంఖ్య తగ్గిపోతోందని, అందువల్ల పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచాల్సిన అవసరం ఎంతో ఉందని మరో గ్రంథాలయ ఉద్యమ వ్యవస్థాపకుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేసేలా మరో గ్రంథాలయ ఉద్యమం సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు నగరంలో వినూత్న ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ప్రకాశంభవన్ దగ్గర నుంచి జిల్లా కేంద్ర గ్రంథాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక క్విస్ కళాశాలకు సంబంధించిన విద్యార్థులు అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు, మహాత్మాగాంధీ, ఝాన్సీలక్ష్మీబాయి ఇలా పలువురు జాతీయ నాయకులు, రచయితల వేషధారణలో ఆకర్షణగా నిలువగా ప్రదర్శన మేళతాళాలతో కొనసాగింది. అనంతరం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్ ద్వారా కొంతమేరకు ఉపయోగం ఉన్నప్పటికీ నేటి యువతకు అది ఎంతో చేటు చేస్తుందన్నారు. పుస్తక పఠనం చేయటం ద్వారా విజ్ఞానం పెంపొందటమే కాకుండా భాషా పరిజ్ఞానం కూడా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనలో గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకుని పుస్తకాన్ని చదవటం అలవాటు చేసుకోవాలని కోరారు. రైతు సంఘ నాయకుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ మరుగున పడుతున్న పుస్తక పఠనానికి పూర్వవైభవం తీసుకువచ్చేదిశగా మరో గ్రంథాలయ ఉద్యమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కొర్రపాటి సుధాకర్, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, క్విస్ కళాశాల అధ్యాపకురాలు శిరీష, మొగిలి దేవప్రసాద్, జాలాది మోహన్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, సీప ప్రసాద్, ఒ.అప్పారావు, ఆనంద్ పాల్గొన్నారు.

నేడు కేవీపాలెంలో తిరునాళ్ల

● ముస్తాబైన శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ● రెండు విద్యుత్ ప్రభలు



చీమకుర్తి, మే13(ఆంధ్రజ్యోతి) : భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కూనంనేనివారిపాలెం శ్రీప్రసన్నాంజనేయస్వామి వారి తిరునాళ్ల వైభవంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. దేవాలయ 24వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. పూర్వం నుంచి చుట్టుపక్కల గ్రామాల భక్తులచే పూజలు అందుకుంటున్న శ్రీప్రసన్నాంజనేయునికి పూర్తిస్థాయిలో 1998వ సంవత్సరంలో శంకుస్థాపన చేసి 2001 మే 14న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా మే 14వ తేదీన ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని తిరునాళ్లను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ వస్తున్నారు. గ్రామస్థులు వర్గాలు, పార్టీలకతీతంగా తిరునాళ్లను ప్రతి ఏటా వైభవంగా జరుపుకుంటారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. బుధవారం ఆలయంలో వేకువజామునుంచే విశేషపూజలు, మొక్కుబడి పొంగళ్లు చెల్లిస్తారు. పెద్దఎత్తున అన్నదానాన్ని జరపటానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

సిద్ధమైన రెండు విద్యుత్ ప్రభలు

తిరునాళ్లను పురస్కరించుకొని ఆలయ పరిసర ప్రాంగణంలో తెలుగుదేశం, వైసీపీల నుంచి ఒక్కొక్కటి చొప్పున విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై ఆయా పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు హాజరుకానున్నారు. టీవీ, సినీ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇక సీపీఎం వారితో ఏర్పాటు చేసిన వేదికపై కోలాటం, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, జనసేన పార్టీ ఏర్పాటు చేసిన వేదికపై పాటకచేరిని ఏర్పాటు చేశారు. దీంతో తిరునాళ్లను పురస్కరించుకొని విచ్చేసిన బంధుమిత్రులతో గ్రామంలో సందడి నెలకొంది.

ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలుగా

స్కూలు అసిస్టెంట్లు

ఒంగోలు విద్య, మే 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా స్కూలు అసిస్టెంట్లు నియ మితులు కానున్నారు. వీరి నియామకాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల పునర్నిర్మాణం, టీచర్ల పునర్వ్యవస్థీకరణలో మిగులుగా తేలిన స్కూలు అసిస్టెంట్లను ఆదర్శ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలో 805 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 296 పాఠశాలలకు గతంలో మంజూరైన ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులు సర్దుబాటు చేశారు. మిగిలిన 509 పాఠశాలకు హెచ్‌ఎంలుగా మిగులుగా తేలిన స్కూలు అసిస్టెంట్లను ప్రతిపాదించారు. డీఈవో పంపిన ఈ ప్రతిపాదనలు ఆమోదించిన ప్రభుత్వం 509 మంది స్కూలు అసిస్టెంట్లను ఆదర్శపాఠశాలల హెచ్‌ఎంలుగా నియమించేందుకు పాఠశాలవిద్య కార్యదర్శి ఆమోదముద్ర వేశారు. దీంతో అన్ని ఆదర్శ పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులు కేటాయించినట్లు అయింది. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఈ పోస్టులు భర్తీ కానున్నాయి.

వెబ్‌సైట్‌లో టెన్త్ సప్లిమెంటరీ హాల్‌టిక్కెట్లు

ఒంగోలు విద్య, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ స్కూలు లాగిన్ ద్వారా పరీక్షల బోర్డువెబ్‌సైట్ నుంచి తమ పాఠశాలల విద్యార్థుల హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులందరి హాల్ టిక్కెట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు వ్యక్తిగతంగా తమ పేరు, స్కూలు పేరు, పుట్టిన తేదీ, జిల్లా, సబ్జెక్టు ద్వారా హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. మనమిత్ర యాప్ 9552300009 నెంబర్‌కు హాయ్ అని మేసేజ్ పంపి హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

క్రీడా సామగ్రిని అందజేసిన జేసీ

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులకు అవసరమైన క్రీడా సామగ్రిని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలు వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈ సామగ్రిని అందజేశారు. అర్బన్ ప్రాంతాలతో పాటు రూరల్ ప్రాంతాల్లో 50 సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన క్రీడాకారుల డేటా, స్పోర్ట్ మెటీరియల్ డేటాను క్రీడా యాప్ ద్వారా అన్‌లైన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.రాజరాజేశ్వరి జిల్లాలో సమ్మర్ క్యాంపుల నిర్వహణకు పలువురిని నియమించినట్లు జేసీకి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో చిన ఒబులేషు తదితరులు ఉన్నారు.

హైవేపై అదుపుతప్పి బోల్తాకొట్టిన కోడిగుడ్ల లారీ


ముప్పవరం సమీపంలో తిరగబడిన కోడిగుడ్ల లారీ

పంగులూరు, మే 13(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కోడిగుడ్లతో వెళుతున్న లారీ అదుపుతప్పి తిరగబడింది. మండలంలోని ముప్పవరం టీడీపీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. కోడిగుడ్ల లోడుతో బోయపాలెం నుంచి టంగుటూరు వెళుతూ ముందున్న వాహనాన్ని దాటే ప్రయత్నంలో అదుపు తప్పింది. ఎవరికీ గాయాలు కాలేదు. వాహనంలోని కోడిగుడ్లన్నీ పగిలిపోయి నష్టం వాటిల్లింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా హైవే సిబ్బంది చర్యలు చేపట్టారు.

ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను తొలగించొద్దు

మార్కాపురం వన్‌టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : రేషనలైజేషన్‌లో భా గంగా ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను తొలగించవద్దని కోరుతూ ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ నాయకులు సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు మంగళ వారం వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న రేషనలైజేషన్‌లో జిల్లాలో 42 ఉపాధ్యాయ పోస్టులను సర్‌ప్లస్‌గా చూపించి తొలగించారని, నియమనిబంధనలు లిఖితపూర్వకంగా ఇవ్వాలన్నారు. దశాబ్దాల నుంచి కొనసాగుతున్న ఉర్దూ సెక్షన్ పోస్టులను తొలగించారని మైనర్ మీడియా పోస్టులను తొలగించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. తర్లుపాడు మండలంలో ఉర్దూ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను తొలగించి తెలుగు ఉపాధ్యాయులను నియమించారని తెలిపారు. ఉర్దూ పోస్టులను యథావిధిగా కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వహిద్‌ఖాన్, ఖలీలుల్లా ఖాన్, ఐఎంఎం రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫి పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌కు 90 రోజుల సమయం పెంచాలి

డీఎస్సీ 2025 నోటిఫికేషన్‌లో 90 రోజుల సమయం పెంచాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు చిన్నకోటే నాయక్ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. టెట్ నోటిఫికేషన్ రిలీజ్ చేయాలని, 47 సంవత్సరాలకు వయో పరిమితి పెంచాలని, ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలని, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ఫీజు తగ్గించాలని కోరారు. డీఎస్సీ విడుదల చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నవెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుబ్బయ్య పాల్గొన్నారు.

700 ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు పట్టివేత

ఒంగోలు క్రైం, మే13 (ఆంధ్రజ్యోతి): పశువులకు వినియోగించే అత్యంత ప్రమాదకరమైన ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను విజిలెన్స్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఒంగోలు నగరం గోపాల్‌నగరంలో రావులకొల్లు శేషమ్మ ఇంటిలో 700 సీల్డు బాటిళ్ళు ఆక్సిటోసిన్ ఉన్నట్లు గుర్తించారు. పాడి పశువులకు ఈ ఇంజెక్షన్లు వల్ల ఎక్కువ పాలు ఇస్తాయి. అయితే ఈ పాలు తాగడం ప్రమాదకరం. దీంతో ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ బాటిళ్ళను సీజ్ చేసి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. ఈ దాడులలో విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్ఐ నాగేశ్వరరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంధ్య, వెటర్నరీ ఏడీ సురేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలి

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణకు కళాజాతల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈనెల 24వతేదీ వరకుజరగనున్న ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కళాజాతలను జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ బి.శ్రీవాణితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కళాజాతర వీధి నాటకాల ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తి, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించాలని వారు సూచించారు. ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత, చిన్నచూపు చూడకుండా సమాజంలో వారితో కలిసి జీవించాలని కోరారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్/క్షయ వ్యాధి, సుఖవ్యాధులు, చికిత్సలపై మార్కెట్ ప్రాంతాలు, ప్రజలు రద్దీ ఉన్న ప్రాంతాల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కిరణ్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల విజయం

ఒంగోలు కార్పొరేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి చెస్ పోటీలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. సోమవారం నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన పోటీలలో రాజు చెస్ అకాడమీ క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటినట్లు కోచ్ రాజ్ కుమార్ తెలిపారు. జ్యోష్నిక, సుధీక్ష, మేఘనరెడ్డి, థిర్లోక్, రాకేష్, నీతు, దత్తు, సోయబ్ మన్సూర్, ఆయా వయస్సు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. ఈమేరకు మంగళవారం స్థానిక హైదరీ క్లబ్‌లో కమిటీ ఉపాధ్యక్షులు ఎన్.చంద్రమోహన్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ జి.రాఘవ, కోశాధికారి ఆంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

మద్దిపాడు, మే 13(ఆంధ్రజ్యోతి): సీతారాంపురంలో బుధవారం నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు మణి, భాను తెలిపారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండవ బహుమతి రూ.75వేలు, మూడవ బహుమతి రూ.50వేలు, నాల్గవ బహుమతి రూ.25వేలు ప్రదానం చేస్తామన్నారు. ఎంట్రీ ఫీజుగా రూ.10 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.10వేలు, బెస్ట్ బౌలర్‌కు రూ.5వేలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పోతినేని శ్రీనివాసరావు, వడ్డంపూడి శ్రీనివాసరావు, అడకా స్వాములు, మందపల్లి శ్రీనివాసరావు, గడ్డం రవి, కొణిజేటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. బ

4 వేలమంది టీచర్లకు స్థానచలనం!

(5వ పేజీ తరువాయి)

ఖాళీలు, ఒకే పాఠశాలలో ఐదేళ్లు పూర్తయిన హెచ్‌ఎంలు, 8 సంవత్సరాలు పూర్తయిన టీచర్ల స్థానాలను ఖాళీలుగా చూపించారు. ఒక పాఠశాలలో మిగులుగా తేలిన టీచర్లను అవసరమున్న చోటుకు సర్దుబాటు చేసి ఆస్థానాలను ఖాళీలుగా చూపించారు. స్టడీ లీవ్, పొరుగు సేవలు, అనధికారికంగా గైర్హాజరైన టీచర్ల స్థానాలను ఖాళీలుగా ప్రకటించారు. 1998, 2008 డీఎస్సీ వారు కాంట్రాక్టు విధానంతో మినిమం టైం స్కేలుతో పనిచేస్తున్న టీచర్ల స్థానాలన్నింటినీ ఖాళీలుగా చూపించారు. దివ్యాంగ టీచర్లతోపాటు, ఎగనెస్ట్ పోస్టుల్లో పనిచేస్తున్న వారి స్థానాలను ఖాళీగా చూపించలేదు. ఖాళీల వివరాలను పాఠశాల విద్య కమిషనర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.



ఒంగోలులో నిత్యం రద్దీగా ఉండే చర్చి సెంటర్ నిర్మానుష్యంగా...

సెగభగలు!



చల్లదనం కోసం ఆటోపై నీళ్లు చల్లుతూ..

కిక్కిరిసిపోయి ఉండే గాంధీ రోడ్డు ఇలా..

నీ తెలివి 'చల్ల'గుండా..

వేసవి తీవ్రమవుతోంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు మండిపోతున్నాడు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. ముఖ్యమైన పనులన్నీ మధ్యాహ్నంలోపు పూర్తి చేసుకుంటున్నారు. ఉదయం 11 గంటల తరువాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం నుంచి ఎండతోపాటు సెగ గాలి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇళ్లల్లో ఫ్యాన్ తిరుగుతున్నా వేడిగాలి తగులుతోంది. పిల్లలు, వృద్ధులు తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. సాయంత్రం ఆరు గంటలకు కూడా సెగ తగ్గడం లేదు. సోమ, మంగళవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపించింది. మరోపక్క ఎండ నుంచి ఉపశమనం కోసం ఎవరికి తోచిన పద్ధతిలో వారు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. వేడి తగలకుండా ఉండేందుకు ఆటోలపై నీళ్లు చల్లుకుంటున్నారు. మరికొందరు వాహనాలపై వెళ్లేటప్పుడు ఎండ నుంచి రక్షణగా వినూత్న రీతిలో నీడ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



'వడ' వడిగా..



ఓ ప్రభుత్వ పాఠశాలలో నిల్వ ఉంచిన పొగాకు చెక్కులు

పొగాకు రైతులకు పుట్టెడు కష్టాలు

● నట్టేట ముంచిన కంపెనీలు ● పడిపోయిన ధరతో ఎక్కడ చూసినా పొగాకు నిల్వలు



మండె కట్టి పరదా చుట్టి ఉన్న పొగాకు

ఇంకొల్లు, మే 13 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది పొగాకు సాగు చేసిన రైతులు మంచి లాభాలు గడించారు. ఆ ఆశాభావంతో ఈ ఏడాది బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు నట్టేట మునిగారు. పుట్టెడు కష్టాలలో కూరుకుపోయారు. గత ఏడాదితో పోల్చుకుంటే సాగు ఖర్చులు పెరిగాయి. ధర మాత్రం దారుణంగా పడిపోయింది. దీంతో కొనుగోళ్లకు ఎవరూ ముందుకు రావడం లేదు. వేసవికాలం వచ్చి పొలాలు ఖాళీ అయినా పొగాకు చెక్కులను అమ్ముకోలేక నిల్వలు పేరుకుపోయాయి. కొనే దిక్కు లేకపోవడంతో ఇంకొల్లు మండలంలో ఎటు చూసినా పొగాకు మండెలు కనిపిస్తున్నాయి. కొంతమంది రైతులు గడ్డివాములు మాదిరిగా వేసి జాగ్రత్త చేశారు. ఇళ్లు, బడుల్లో సైతం పొగాకు చెక్కులే కనిపిస్తున్నాయి.

సాగుకు ముందు కంపెనీ ప్రతినిధులు వచ్చి పొగాకు సాగు చేసేందుకు ప్రోత్సహించడంతో రెట్టింపు ఉత్సాహంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు సాగు చేశారు. ఇంకొల్లు మండలంలో సుమారు 10 వేల ఎకరాలకుపైగా పొగాకు సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల అంచనా. అంతర్జాతీయంగా బర్లీ పొగాకు ధర పతనం కావడంతో కొనుగోళ్లకు కంపెనీలు ముఖం చాటేస్తున్నాయి. గత ఏడాది మంచి లాభాలు వచ్చాయని అధిక కౌలుకు తీసుకొని సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఇంకొల్లు మండలంలో కొణికి, దుద్దుకూరు, హనుమోజిపాలెం, గంగవరం, భీమవరం గ్రామాల పరిధిలో ఎక్కువ మంది రైతులు బర్లీ పొగాకు సాగు చేశారు. ఇటీవల దుద్దుకూరుకు చెందిన బిల్లా శ్యాంసన్ గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. కంపెనీ ప్రతినిధి నిర్లక్ష్యవైఖరితో విసిగి పోయినట్లు రైతులు వాపోతున్నారు. శ్యాంసన్‌ను రైతుసంఘం నాయకులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి గాదె మధుసుదనరెడ్డి మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని రైతుసంఘం నాయకులు డిమాండు చేస్తున్నారు.



ఏడాదిన్నరగా సమస్య పరిష్కారం కావడం లేదని అధికారులకు వివరిస్తున్న బాధితురాలు రమాదేవి

విద్యుత్ సమస్యల పరిష్కారానికే అదాలత్

● సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్

పొదిలి, మే 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్య తీర్చేందుకే అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. మంగళవారం స్థానిక మంజునాథ కల్యాణ మండపంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన అదాలత్, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ వాడకంపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను విద్యుత్‌శాఖతో సమన్వయ పరిచి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. సీజీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో వచ్చిన సమస్యలు ఇక్కడ పరిష్కారం కాకపోతే గుణదలలో ఉన్న సీజీఆర్‌ఎఫ్ ప్రత్యేక కోర్టులో చెప్పుకోవచ్చన్నారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుడికి ఉన్న సమస్య తీర్చడానికి ఎప్పుడూ ముందుంటామన్నారు. నెలలో ఏదో ఒకచోట అదాలత్ ద్వారా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దర్శి డీఈ ఎస్.శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సనీత, పొదిలి ఏడీఏ హరిబాబు, పొదిలి, దర్శి దొనకొండ, కురిచేడు, కొనకనమిట్ల, మర్రిపూడి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. విజిలెన్స్ ఏపీటీఎస్ ఒంగోలు సీఐ బీటీ నాయక్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రమాదాలపై తీసుకోవలసిన చర్యలపై హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఏడాదిన్నరగా సమస్య పరిష్కరించ లేదు

పట్టణంలో తన ఇంటి సర్వీసు నెంబరు 12475. అయితే కరెంట్‌బిల్లు నాకు రూ.1500 నుంచి రూ.2వేల వరకు వస్తోంది. ప్రతినెలా చెల్లిస్తున్నాను. సమస్య ఎక్కడ ఉందో తెలీదు కానీ రూ.34,451 పెనాల్టీ వేశారు. దీనిపై ప్రశ్నిస్తే రెండు మీటర్లు ఒకే దానిపై ఉన్నాయనే చెప్తున్నారు. రెండు నెలలు గడిచిన తరువాత పెనాల్టీ కట్టనిదే బిల్లు కట్టించుకోమని చెప్పారు. ఆ తరువాత మీటర్లు పరిశీలించాలని పలుమార్లు ఫిర్యాదు చేశాను. పరిశీలించి ఏమీ చెప్పకుండా వెళ్లిపోయారు. ఆ తరువాత గతంలో ఉన్న ఏడీఏను కలిసి సమస్యను చెప్పాను. ఆయన సూచనల మేరకు పెనాల్టీ అలాగే ఉంచి బిల్లు మాత్రం కట్టించుకుంటున్నారు. ఏడాదిన్నర అయినా పెనాల్టీ సమస్య తీర్చలేదు.

- సోమిశెట్టి రమాదేవి, వినియోగదారు

మున్సిపల్ హీట్!

అవిశ్వాస తీర్మానాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని మార్కాపురం, చీరాల నియోజకవర్గాల్లో రాజకీయం వేడెక్కింది. వైసీపీ చీరాలలో క్యాంపు రాజకీయాలకు, మార్కాపురంలో డబ్బు రాజకీయానికి వైసీపీ తెరదీసింది. చీరాలలో అవిశ్వాస తీర్మానంపై బుధవారం ప్రత్యేక కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా మార్కాపురంలో అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైన విషయం తెలిసిందే. చీరాల రాజకీయం పలు మలుపులు తిరిగి క్లైమాక్సులో ఉత్కంఠ నెలకొంది.

- (ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

- చీరాలలో క్యాంపు రాజకీయాలకు వైసీపీ శ్రీకారం
- క్లైమాక్స్‌లో ఉత్కంఠ
- మార్కాపురంలో పావులు కదుపుతున్న వైసీపీ
- అక్కడా పాత ఒప్పందాలపై మల్లగుల్లాలు
- కౌన్సిలర్లకు డబ్బు ఎర

క్యాంపు రాజకీయం

చీరాలలో వైసీపీ నాయకులు చివరి రోజుల్లో రంగంలోకి వచ్చి అవిశ్వాస తీర్మానం వీగిపోయే విధంగా చేసేందుకు పావులు కదిపారు. తదనుగుణంగా ఆ పార్టీలో ఉన్న కొద్దిమంది కౌన్సిలర్లను ముండ్లమూరు ప్రాంతంలో ఉన్న వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌కు చెందిన అతిథిగృహానికి తరలించినట్లు తెలిసింది. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు చేసిన వైసీపీ కౌన్సిలర్లలో కొందరిని నిలుపు కునేందుకు సామదానబేధ దండోపాయాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన ఒక మహిళా కౌన్సిలర్‌ను వైసీపీ నాయకులు తమ క్యాంపులోకి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో తెలుగుదేశం తరుపున ఎమ్మెల్యే కొండయ్య అప్రమత్తమై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఉన్న కౌన్సిలర్లను కాపాడుకునేందుకు శ్రీకారం చుట్టారు. ముందుగా అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు పెట్టి మద్దతు ప్రకటించిన వారిలో ఎవరైనా ప్రస్తుతం మాటతప్పితే తదనంతరం స్థానికంగా ఎలాంటి సమస్యలు ఎదురవుతాయో గమనించాలంటూ కొండయ్య వర్గీయులు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. బెదిరింపు రాజకీయాలతో పాటు డబ్బు రాజకీయాలకు తెరతీశారు.

రెంటికి చెడ్డ రేవడి

ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారినట్లు కనిపిస్తోంది. వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరి తన పదవిని కాపాడుకునేందుకు ప్రయత్నం చేశారు. టీడీపీలో చేరిన తర్వాత అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఉన్న టీడీపీ, వైసీపీ, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ వర్గీయులైన కౌన్సిలర్ల నుంచి జంజనంపై వ్యతిరేకత బహిర్గతమైంది. మొదటికే మోసం వస్తుందనే భావనతో ఎమ్మెల్యే కొండయ్య ప్రస్తుత చైర్మన్‌కు తాను ఎలాంటి హామీ ఇవ్వలేదని కౌన్సిల్‌లో వైసీపీ పాలనకు తిలోదకాలు ఇవ్వటమే లక్ష్యమని ప్రకటించారు. ఇదే సమయంలో వైసీపీ నుంచి కరణం వెంకటేష్ రంగంలోకి రావటంతో వైసీపీ కౌన్సిలర్లతో పాటు చైర్మన్ జంజనంపై వత్తిడి పెరిగింది. ఇటుచూస్తే టీడీపీ నుంచి తిరిగి చైర్మన్ పదవికి హామీ లభించకపోవటంతో అటు వత్తిడి పెరగటంతో జంజనం ఇరకాటంతో పడిపోయారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కొండయ్య వ్యూహాత్మకంగా కాబోయే చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండా అవిశ్వాస తీర్మానం నెగ్గించుకోవటమేనని ప్రకటించారు. దీంతో చైర్మన్ శ్రీనివాసరావు ఇరకాటంలో పడిపోయారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌తో ఉన్న ఐదుగురు కౌన్సిలర్లు చైర్మన్ శ్రీనివాసరావును పదవి నుంచి తప్పించటమే తమ లక్ష్యమని, అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేస్తామని నిర్ణయం తీసుకున్నారు. దీనికి తోడు ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు కూడా ఉండటంతో అధికార పార్టీ ధీమాగా ఉంది. అయితే వైసీపీ నేతలు ఒక్కసారిగా రంగంలోకి వచ్చి టీడీపీకి మద్దతుగా వచ్చిన కౌన్సిలర్లను తీసుకెళ్లి క్యాంపు రాజకీయాలకు శ్రీకారం పలకటంతో రాజకీయం వేడెక్కింది. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 23 మంది మద్దతు ఉండాలి. ప్రస్తుత చైర్మన్‌కు 13 మంది మద్దతు లభిస్తే అవిశ్వాస తీర్మానం వీగిపోతుంది. ఈ దశలో వైసీపీ నాయకులు బలవంతంగా తీసుకెళ్లిన కౌన్సిలర్‌తో కలిపి కావాల్సిన 13మంది తమ క్యాంపులో ఉన్నారని ప్రకటిస్తుండగా, ఆమంచి వర్గీయుల మద్దతుతో టీడీపీ శ్రేణులు 25 మంది మద్దతు ఉన్నట్లు ప్రకటిస్తున్నారు. అటు బెదిరింపు ఇటు డబ్బు రాజకీయాలు ముమ్మరమైన నేపథ్యంలో బుధవారం జరగబోయే పరిణామాలు ఎలా ఉంటాయోనని ఉత్కంఠ నెలకొంది.

మార్కాపురంలో

మార్కాపురంలో వైసీపీ చైర్మన్‌పై ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. కౌన్సిల్‌లో ఐదుగురు టీడీపీ సభ్యులకు తోడు వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరిన 12 మందితో సంఖ్య 17కు చేరింది. ఆ ప్రకారం చూస్తే వైసీపీ పక్షాన 17 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అయితే ఎమ్మెల్యే ఓటు ఉండటంతో ఒక్క ఓటు ఆధిక్యత టీడీపీకి కనిపిస్తోంది. ఇవి కాకుండా ఇప్పటికీ వైసీపీలో ఉన్న ఆరుగురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా కలెక్టర్‌కు ఇచ్చిన లేఖలో సంతకం పెట్టే విధంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి చేయగలిగారు. అయితే ఇదే సమయంలో వైసీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు వైసీపీ కౌన్సిలర్లకు సమావేశం ఏర్పాటు చేయగా అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు పెట్టిన ఆరుగురిలో ముగ్గురు సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన ముగ్గురు కూడా సంతకాలు పెట్టారే తప్పా కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లలేదని తెలిసింది. ఈ దశలో వైసీపీ హయాంలో చైర్మన్ పదవి కోసం పార్టీకి డబ్బులు ఇచ్చిన డాక్టర్ కనకదుర్గ (4వార్డు కౌన్సిలర్) అంశం తెరపైకి వచ్చినట్లు తెలిసింది. చైర్మన్ పదవి ఆశిస్తూ ఆమె ఎన్నికల సమయంలో ఖర్చుల కోసం అప్పటి వైసీపీ ఎమ్మెల్యేకు డబ్బు సమకూర్చింది. అయితే ఆమెకు పదవి ఇవ్వలేదు. దీంతో డబ్బుల కోసం ఆమె వత్తిడి పెంచింది.

చివరి రెండు సంవత్సరాలు ఆమెకు పదవి ఇచ్చేవిధంగా ఒప్పందం చేశారు. లేదా వైసీపీ చైర్మన్ నుంచి డబ్బులు ఇప్పిస్తామని చెప్పారు. ప్రస్తుతం తాను అర్థంతరంగా దిగితే ఆ డబ్బులు ఇవ్వలేనని ఐదేళ్ల పదవిలో ఉంటేనే ఆ డబ్బులు సమకూర్చుతానని వైసీపీకి చెందిన ప్రస్తుత చైర్మన్ చెప్పినట్లు తెలిసింది. దీంతో వైసీపీ నేతలు డాక్టర్ కనకదుర్గను రంగంలోకి తెచ్చి అవిశ్వాస తీర్మానం ఎదుర్కొనేందుకు వ్యూహం పన్నుతున్నట్లు తెలిసింది. వైసీపీ నుంచి టీడీపీలో చేరినా వైసీపీలోనే ఉంటూ అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికిన వారిలో కొందరిని వెనక్కు తెచ్చుకుంటే బయటపడవచ్చనే వ్యూహంతో డబ్బు రాజకీయంకు తెరలేపినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు వైసీపీకి అండగా ఉంటే ఒకొక్కరికి రూ.5లక్షలు ఇస్తామంటూ ప్రతిపాదనలు పంపినట్లు కూడా తెలుస్తోంది. తదనుగుణంగా కౌన్సిలర్లను క్యాంపులకు తరలించేందుకు కూడా ప్రయత్నిస్తున్నట్ల సమాచారం. ఈ విషయంపై సమాచారం బయటకురావటంతో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మంగళవారం మొత్తం దీనిపై చర్చిస్తూ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

ఐదు రోజులు.. 5,828 దరఖాస్తులు

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : కొత్త రైస్ కార్డులు.. ప్రస్తుతం ఉన్న వాటిలో చేర్పులు, మార్పుల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకూ 5,828 దాఖలయ్యాయి. అర్హులైన వారు ఒంగోలు అర్బన్‌తోపాటు జిల్లాలోని 38 మండలాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. కార్డులో పేరు నమోదు (యాడింగ్) కోసం అత్యధికంగా 4,087 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్త రైస్‌కార్డు కోసం 1,015 వచ్చాయి. కార్డు బదిలీకి 473 అందాయి. ఆధార్ సవరణ కోసం 105, అడ్రసు మార్పు కోరుతూ మరో 27 దాఖలయ్యాయి. అత్యధికంగా మార్కాపురం మండలంలో ఇప్పటి వరకు 350 దరఖాస్తులు వచ్చాయి. ఒంగోలు అర్బన్‌లో 328, ఎర్రగొండపాలెం మండలంలో 321, పుల్లలచెరువులో 314, కనిగిరిలో 240, పొదిలిలో 224, చీమకుర్తిలో 223, సంతనూతలపాడులో 204 దాఖలయ్యాయి. ఇతర అన్ని మండలాల్లో 50 నుంచి 200 మంది వరకూ దరఖాస్తు చేసుకున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

● మున్సిపల్ ఆర్‌డీ ఓబులేసు

మార్కాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ గుంటూరు ఆర్‌డీ ఓబులేసు అన్నారు. మార్కాపురం పురపాలక సంఘంలోని తాగునీటి సరఫరాకు సంబంధించిన అన్ని వ్యవస్థలను, పనులను మంగళవారం మున్సిపల్ ఆర్‌డీ ఓబులేసు, నెల్లూరు ప్రజారోగ్య శాఖ ఎస్‌ఈ టి.మోహన్ పరిశీలించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అన్ని విభాగాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీ ఓబులేసు మాట్లాడుతూ దూపాడు సమ్మర్ స్టోరేజీ వద్ద 1.5 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న డీఐ పైపులైన్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు చూడాలన్నారు. పనులు నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ పనులు పూర్తయిన తర్వాత ప్రజలకు రెండు రోజుల కోసారి సాగర్ నీటిని అందించాలన్నారు. అదే విధంగా పట్టణంలో నీటి సరఫరా విషయంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నీటి నాణ్యత, పైప్‌లైన్ లీకేజీల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పన్నులు, నీటి కొళాయి పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా అన్ని మురికి కాలువలను డీసిల్టేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నెల్లూరు ఎస్‌ఈ టి.మోహన్, ఒంగోలు ఈఈ టి.శ్రీనివాససంజయ్, మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, డీఈ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ ఓబులేసు

కార్యకర్తలకు అండగా టీడీపీ : మంత్రి స్వామి


బీమా మంజూరు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి స్వామి

కొండపి, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జరుగుమల్లి మండలం కామేపల్లి అగ్రహారానికి చెందిన టీడీపీ కార్యకర్త తానికొండ వెంకటరావు భార్యకు కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.5లక్షల మంజూరు పత్రాన్ని ఆయన మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి మాట్లాడారు. టీడీపీ ఓ ఆత్మీయ కుటుంబం అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ సాధికార సారథులను నియమించాలి

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, మే13(ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికార సారథులను త్వరగా నియమించాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, సెక్రటరీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల, గ్రామ నూతన కమిటీలను సైతం త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు నిబద్ధతతో పని చేయాలి

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డెంగ్యూ నివారణకు నిబద్ధతతో పనిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. ఈనెల 16న జరగనున్న జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవంపై మంగళవారం స్థానిక జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సంబంధిత అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డెంగ్యూపై ప్రజలకు అవగాహన పెంపొందించడంతో పాటు నివారణ చర్యలపై దృష్టి పెట్టాలన్నారు. దోమల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, గున్యా, మెదడువాపు, జీకా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఇళ్ళు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ సౌజన్య, లెప్రసీ అధికారి వాణిశ్రీ, డాక్టర్ నబివలి, జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు, సహాయ మలేరియా అధికారి శ్రీనివాసులు, డేటా మేనేజర్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యలపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(రూరల్), మే13(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కారం కోసం ఏకతాటిపై ఉండాలని మహిళా జేఏసీ అమరావతి జిల్లా చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కార్యదర్శి శ్రీదేవి కోరారు. మంగళవారం ఒంగోలులోని రెవెన్యూభవన్‌లో జరిగిన సమావేశంలో వారు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఆర్.పద్మ, కేఎల్.సుకన్య, లావణ్య, బి.జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏపీడీ సుబ్బారావు

మద్దిపాడు, మే13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ సుబ్బారావు కోరారు. మంగళవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాల కోసం 38మంది సభ్యుల టీం కూలీలను కలిసి తమ అభిప్రాయాలను సేకరిస్తారని తెలిపారు. ఉపాధి కూలీలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వేతనం గురించి అడిగి తెలుసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ రాజేష్, టీఈ కిషోర్, వీట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

● ఎమ్మెల్యే దామచర్ల


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, నాగసత్యలత దంపతులు

ఒంగోలు కార్పొరేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించి ఉన్నతంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం చేయూతను అందిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని అన్నవరప్పాడులో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే దామచర్ల, ఆయన సతీమణి నాగసత్యలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా రుణాలు అందించడంతోపాటు, చేతి వృత్తులలో, టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ చింతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

టోల్ ప్లాజా కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు టోల్‌ప్లాజా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట టోల్‌ప్లాజా కార్మికులు చేసిన ధర్నాకు తిరుమలరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, నేషనల్ హాలిడేస్, పెయిడ్ హాలిడేస్, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యానికి అనేక సార్లు వినతపత్రాలు ఇచ్చి చర్చలు జరిపినా ఇంతవరకు సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరు రాము మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. సమస్యలు పరిష్కారం కానందునే ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.కాశీవిశ్వనాథ్, శృతి, మహేష్, నరేంద్ర, కోటేశ్వరరావు, మోజస్, రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవాలి

● జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదకర పరిశ్రమల్లో పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో మంగళవారం భద్రతా చర్యలపై సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అటువంటివి నాలుగు ఫ్యాక్టరీలు ఉన్నాయని నెల్లూరు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.కుమార్ ఈ సందర్భంగా జేసీ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన జేసీ గోపాలకృష్ణ భద్రతా చర్యలకు సంబంధించి కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో మంగళవారం వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజానీకం పలు రకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై జేసీ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను ఆయాశాఖలకు, అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రీ ఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టిసారించాలని గోపాలకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేశు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, కుమార్, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకర్లు పక్కదారి పడితే చర్యలు

● నగర కమిషనర్ హెచ్చరిక

ఒంగోలు కార్పొరేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన ట్యాంకర్లు పక్కదారిపడితే చర్యలు తప్పవని నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం తాగునీటి ట్యాంకర్ డ్రైవర్లతో స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారుకాలనీల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రైవేటు ట్యాంకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ట్యాంకర్లు ప్రైవేటు హోటల్స్, హాస్పిటల్స్, ఇతర ప్రాంతాలకు వెళుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ట్యాంకర్ల ఓనర్లు బాధ్యత వహించాల్సి వస్తుందని, నీటి సరఫరాలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని కమిషనర్ హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, అలాగే ట్యాంకర్‌కు సంబంధించిన బ్రేక్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లు, ఇతర వాహన కాగితాలు కచ్చితంగా ఉండాలని తెలిపారు. కాలం చెల్లిన వాహనాలు, కనీస నిబంధనలు లేని వాహనాలు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేకించి ప్రతి డ్రైవర్ లైసెన్సు కలిగి ఉండాలని కమిషనర్ చెప్పారు. అలాగే మద్యం తాగి ట్యాంకర్లు నడపరాదని ఆయన సూచించారు. ట్యాంకర్లు న్నింటికీ జీపీఎస్ సిస్టం ఉండాలన్నారు. ప్రజల పేరుతో ప్రైవేటు నీటి వ్యాపారం చేస్తే ఉపేక్షించబోమని, అలాగే ట్యాంకర్లకు చెల్లించాల్సిన బిల్లులు కూడా త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు. సమావేశంలో ట్యాంకర్ డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

● కేక్ కట్ చేసిన జనసేన శ్రేణులు


చైర్మన్ రియాజ్‌కు బొకేలను అందజేస్తున్న నాయకులు, రవిశంకర్

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఒంగోలులోని రవిప్రియామాల్‌లో మంగళవారం రాత్రి జనసేన పార్టీ నాయకుడు కంది రవిశంకర్ ఆధ్వర్యంలో రియాజ్ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసిన అనంతరం రియాజ్‌ను కూటమి నాయకులు బొకేలు అందజేయడంతో పాటు శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కామేపల్లి శ్రీనివాసరావు, దేవేళ్ళ భాస్కరరావు, ఎస్.చిరంజీవి, సింగరాజు రాంబాబు, చిట్టెం ప్రసాద్, ముత్యాల కళ్యాణ్, రాయని రమేష్‌బాబు, బి.శ్రీదేవి, రాజేష్, పల్లా ప్రమీల., గోవింద్ కోమలి. దండే అనిల్, దండే సతీష్, ఆరిగ శివ, మనోహర్, జానకిరామ్, ఈదుపల్లి మణి, బొందిల మధు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా నేడు

కనిగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలోని ఎంఎస్‌ఎం డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్‌మేళా జరగనుంది. శ్రీసిటీలోని బ్లూస్టార్ కంపెనీలో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో చేసిన చేసి వారు అర్హులు. వివరాలకు 9703099773, 9494642286, 8008822821 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మేయర్ సుజాత తదితరులు

ఒంగోలు(రూరల్), మే13(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని బాపూజీ కాంప్లెక్స్‌లో గల మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వీరజవాన్ మురళీనాయక్ మృతికి ఎలక్ట్రానిక్ డవలప్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ యుద్ధంలో మృతి చెందిన వీర జవాన్‌లను అందరూ స్మరించుకోవాలన్నారు. సైనికుల త్యాగాలను మనం జీవితాంతం గుర్తు పెట్టుకోవాలని కోరారు. సైనికులను మనం గౌరవించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారావు, కోనంకి చిరంజీవి, సభ్యులు పీవీ.శేషయ్య, జె.రాజు, ఉన్నం హరిబాబు, బోడపాటి శ్రీనివాసరావు, మోద్రన్ వెంకటేశ్వరరావు, రాజు, సుబ్బారావు, అనీల్‌బాబు, బీపీఎల్.బాష పాల్గొన్నారు.

బుద్ధగయ టెంపుల్ యాక్టును రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : బిహార్‌లోని బుద్ధగయలోని మహాబోధి మహావిహార నిర్వహణ కమిటీలో మెజార్టీ సభ్యులు బౌద్ధేతరులు ఉన్నారని, వారికి అవకాశం కల్పించిన బుద్ధగయ టెంపుల్ చట్టం-1949 యాక్టును రద్దు చేసి మహావిహార్‌ను బౌద్ధ సంఘాలకు అప్పగించాలని పలువురు డిమాండ్ చేశారు. బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ బుద్ధిస్ట్ ఉపాసక చుదూరి రంగారావు, కందుకూరు ధమ్మచక్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉపాసక గాండ్ల హరిప్రసాదరావులు మాట్లాడుతూ బుద్ధగయలోని మహాబోధివృక్షం కింద ధ్యానం చేసి గౌతమడు బుద్ధుడు అయ్యారని చెప్పారు. తదనంతరం సామ్రాట్ అశోక్‌చక్రవర్తి బుద్ధగయలో జ్ఞానానికి చిహ్నంగా మహావిహార్‌ను నిర్మించినట్లు పురావస్తు పరిశోధనల్లో నిర్ధారించారని తెలిపారు. డాక్టర్ సీహెచ్.సుధాకర్‌బాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 100కోట్ల మంది బౌద్ధ అనునూయులకు స్ఫూర్తి కేంద్రమైన మహాబోధి మహావివాహర నిర్వహణ కమిటీలో అందరూ బౌద్ధ సంఘ సభ్యులే ఉండే విధంగా కొత్త చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ నాయకులు సీహెచ్.సుధాకర్, పేరయ్య, షేక్ అజీజ్, టి.వెంకటస్వామి, లక్ష్మీనారాయణ, జి.మస్తాన్‌రావు, పేరం సత్యం, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జేసీ గోపాలకృష్ణతో మాట్లాడుతున్న నాయకులు

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు.. ఐదుగురికి గాయాలు



దెబ్బతిన్న బస్సు ముందు భాగం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసు

మద్దిపాడు, మే13(ఆంధ్రజ్యోతి): బస్సు, లారీని ఢీకొట్టిన సంఘటనలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. మహాబలిపురం నుంచి విజయనగరం వెళ్తున్న తేజస్విని ట్రావెల్స్ బస్సు గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ సమీపంలో రాగానే లారీని అధికమించబోయి వెనుకవైపున ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 30మంది ప్రయాణికుల్లో ఐదుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శివరామయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బస్సు ముందు భాగం, లారీ వెనుక భాగం దెబ్బతిన్నాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నేడు మల్లవరంలో శ్రీవేంకటేశ్వరుడి కల్యాణోత్సవం

మద్దిపాడు మే13(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని గుండ్లకమ్మ చెంత వేంచేవున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించటానికి భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. దివి వెంకట శేషాచార్యులు యాజ్ఞీకంలో ఉదయం 10 గంటలకు కల్యాణ క్రతువు మొదలవుతుందని, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా తరంగ కాలక్షేపం నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

సాగునీరు విడుదల చేయాలి

మద్దిపాడు, మే 13(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించాలని ఇనమనమెళ్లూరు ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, దొడ్డవరప్పాడు సర్పంచ్ బెజవాడ శ్రీరామమూర్తి మంగళవారం ఒంగోలులో జిల్లా అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, పూతరాలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు గ్రీవెన్స్‌సెల్‌లో విన్నవించినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీరు విడుదల చేయాలని వారు కోరారు.

దేవ్‌భట్టాచార్య మృతికి సంతాపం

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ మాజీ సభ్యుడు, ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు జాతీయ అధ్యక్షుడు నేపాల్ దేవ్‌భట్టాచార్య మృతి పట్ల పలువురు నివాళులు ఆర్పించారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భట్టాచార్య చిత్రపటానికి జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి తంబి శ్రీనివాసులు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దాసరి రమేష్, తిరుమలయ్య, అల్లడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు భద్రత కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పలు నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రత కోసం చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లాబాషా కోరారు. మంగళవారం ఒంగోలులో కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావును కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. నగర పాలక పారిశుధ్య కార్మికులతో పాటు వీధుల్లో తిరుగుతూ వ్యాపారం చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-శ్రమ్ కార్డులను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో లక్ష్మీప్రసన్నను కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

నేడు చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

ఒంగోలు(రూరల్), మే13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలులో శ్రీచెన్నకేశవస్వామి వారి దేవాలయంలో బుధవారం ఉదయం 10గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి వారి కల్యాణ ప్రారంభమవుతుందని ఈవో కట్టా సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బంకు దగ్ధం

ఒంగోలు క్రైం, మే13(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి బంకు తగలబడింది. ఈ ఘటన ఒంగోలు నగరం సంతపేటలోని సుబ్బరామిరెడ్డి విగ్రహం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. మద్దెల పద్మకు చెందిన బంకు అగ్నికి ఆహుతి కాగా సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం సంఘటన స్థలానికి చేరుకుంది. అదే సమయంలో విద్యుత్ సిబ్బంది వచ్చి కరెంటు సరఫరాను నిలిపివేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే బంకులో ఎలాంటి సామానులు లేవని చెబుతున్నారు.

వేణుగోపాలస్వామికి గజవాహనసేవ


శ్రీవేణుగోపాలస్వామి ఊరేగింపు

నాగులుప్పలపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులో వేంచేసిన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారికి గజవాహన సేవ నిర్వహించారు. ఎదురుకోలు ఉత్సవంలో భాగంగా గ్రామంలోని బొడ్డురాయి సెంటర్ వద్ద వేణుగోపాలస్వామి కల్యాణ విశిష్టతను పూజారి శ్రీధర్‌బాబు వివరించారు. రాత్రి స్వామి వార్లను విద్యుత్ కాంతులతో అలంకరించి గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో రామకృష్ణారావు పర్యవేక్షించారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి): వర్జీనియా, బర్లీ పొగాకు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై తీవ్ర మనోవేదనతో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. మినుము, కంది పంటలు అధిక వర్షాల వల్ల నష్టపోగా అరకొర పంట వచ్చినా ధరలు లేవన్నారు. ఇక వర్జీనియా, బర్లీ పొగాకు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలిపారు. పొగాకు కంపెనీల ప్రతినిధులు రైతులను ప్రోత్సహించి పంట సాగు చేయించి తీరా కొనుగోలు సమయంలో మొఖం చాటేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అప్పుల బాధలు తట్టుకోలేక ఇప్పటికే ఇద్దరు రైతులు మృతిచెందగా, మరో రైతు ఆత్మహత్యయత్నం చేసుకున్నారన్నారు. పొగాకు కొనుగోలు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం గుంటూరులో ఈడీ విశ్వశ్రీ, చైర్మన్ యశ్వంత్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరించనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

కమనీయంగా సీతారాముల కల్యాణం


స్వామివారికి కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింగరాయకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజ చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

నాగులుప్పలపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ సూచించారు. కనపర్తి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వలసలు నివారించి కూలీలకు గ్రామాల్లో పనులు కల్పించేందుకు ఉపాధి పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన కొలతలు, సమయపాలన ప్రకారం కూలీలు పనులు చేయాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

24న క్రికెట్ టోర్నమెంట్

రాచర్ల (గిద్దలూరు), మే 13 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం అచ్చంపల్లి గ్రామంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 24 నుంచి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు అచ్చంపల్లి యూత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ విజేతకు రూ.10,116, ద్వితీయ విజేతకు రూ. 5,116 బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. 23వ తేదీలోగా రూ.500 ఎంట్రీ ఫీజును చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, 9542284730, 9491282835 సంప్రదించాలని కోరారు.

కుంకుమబండి ఉత్సవం

రాచర్ల (గిద్దలూరు), మే 13 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం అనంపల్లి గ్రామంలో దూదేపల్లి నరసింహులు కుటుంబీకులు అల్లూరి పోలేరమ్మ తల్లికి కుంకుమ బండి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ముస్లిం, మైనార్టీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలి

తర్లుపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్హులైన ముస్లిం, మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో బి.చంద్రశేఖర్ తెలిపారు. కలుజువ్వలపాడు పంచాయతీకి 5 యూనిట్లు, తర్లుపాడుకు 7 యూనిట్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన ముస్లింలు 21 ఏళ్ల నుంచి 55 ఏళ్ల లోపు వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ముస్లింమైనార్టీ సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆదాయం ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ట్రాఫిక్ దిగ్బంధనంలో పొదిలి

- ఇబ్బందుల్లో ప్రజలు, ప్రయాణికులు
- మార్జిన్‌లు ఆక్రమించి షాపుల ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు

పొదిలి, మే 13 (ఆంధ్రజ్యోతి) : పొదిలి నగర పంచాయతీగా మారి సుమారుగా నాలుగైదేళ్లు కావస్తుంది. అయినా రోడ్లను వెడల్పు చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒంగోలు - నంద్యాల రహదారి విస్తరణకు నోచుకోకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. పొదిలి నుంచి బేస్తవారిపేట, గిద్దలూరు వరకు రెండు వరుసల రహదారికి గతంలో రెండు సార్లు సర్వేలు నిర్వహించారు. ఒంగోలు నుంచి గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, యర్రగొండపాలెం తదితర ప్రధాన పట్టణాలకు వెళ్లాలంటే పొదిలి మీదుగానే వెళ్లాలి. అయితే రహదారిగుండా ఆక్రమణలు జరగడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఈ ప్రాంతం అన్ని ప్రాంతాలకు నడికూడలిగా ఉన్నప్పటికీ అభివృద్ధి శూన్యం. ఇరుకు రహదారులతో పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. అయినా అధికారులకు ఏమాత్రం పట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రెండు నెలల్లో పొదిలి రూపురేఖలు మారుస్తామని చెప్పే వారు తర్వాత కానరావడంలేదని ప్రజలు నిరుత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. చిన్నబస్టాండ్, పెద్దబస్టాండ్, విశ్వనాథపురం, జూనియర్ కాలేజీ రోడ్డు, తహసీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయాల వీధుల్లో ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ప్రభుత్వ స్థలాల దగ్గర నుంచి వ్యాపారుల షాపుల వరకు ఎవరికి వారు ఆక్రమిస్తుండడంవల్లే ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. రోడ్లను వెడల్పు చేయడంతోపాటు ఆక్రమణలను తొలగిస్తే గాని ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించదని ప్రజలు అంటున్నారు. కాటూరివారిపాలెం నుంచి మార్కాపురం అడ్డరోడ్డు వరకు నేషనల్ హైవే రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ స్థలాన్ని తన సొంత స్థలంలా ఆక్రమించి మట్టిపోయడంతో కుచించుకుపోయి ఎదురెదురు రెండు వాహనాలు వెళ్లాలంటే కష్టంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు. పొదిలి ప్రాంతంలో రహదారులపై ప్రమాద సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రహదారులకు ఇరువైపులా ఉన్న మట్టిని, బంకులను తొలగించి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



జూనియర్ కాలేజీ రోడ్డులో పరిస్థితి ఇలా



ప్రధాన రహదారిలో ఇరుక్కుపోయిన వాహనాలు



మండల పరిషత్ కార్యాలయం వద్ద కుంటను తలపించేలా (ఫైల్)



ఇంగ్లీషు గ్రామర్ బోధిస్తున్న ఉపాధ్యాయులు

ఇంగ్లీష్ గ్రామర్‌పై అవగాహన

గిద్దలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో మంగళవారం ఇంగ్లీష్ గ్రామర్‌పై అవగాహన కల్పించారు. ఫ్యాకల్టీ శివప్రసాద్, రామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినీవిద్యార్థులు గ్రామర్‌ను బోధించారు. గణితంలో సులభతరమైన మెళకువలను తెలియజేశారు. స్ఫూర్తిదాతల జీవిత చరిత్రలను వివరించారు. పుస్తక పఠనం వల్ల ఉపయోగాలు, బొమ్మలను ఎలా తయారు చేస్తారో చూపించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

ఎస్‌వీకేపీలో అడ్మిషన్స్‌పై వినతి

మార్కాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌వీకేపీ డిగ్రీ కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్స్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు మంగళవారం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సోమయ్య మాట్లాడుతూ దశాబ్దాల చరిత్రకలిగి ఎందరో పేద విద్యార్థుల అభివృద్ధికి అండగా నిలిచిన ఎస్‌వీకేపీ కాలేజీని యాజమాన్యం వ్యాపార దృక్పథంతో ప్రైవేటు కాలేజీల వారికి లీజుకు ఇచ్చేందుకు సిద్ధమైందన్నారు. నిబంధనలకు భిన్నంగా యాజమాన్యం తీసుకుంటున్న చర్యలను నిలుపుదల చేయించాలన్నారు. గత ప్రభుత్వం అనాలోచితంగా జీవో నెంబర్ 42 తీసుకువచ్చి ఎయిడెడ్ విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. చరిత్రకలిగిన కాలేజీని పేద విద్యార్థులకు దూరం చేయకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెద్దారవీడు, మే 13(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని బోడిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బోడిరెడ్డిపల్లికి చెందిన గంజి నారాయణమ్మ రోడ్డు పక్కన నిలబడి ఉంది. ఆ సమయంలో అమరావతి - అనంతపురం జాతీయ రహదారిపై వేగంగా మోటర్‌సైకిల్‌పై వస్తున్న వ్యక్తి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి నారాయణమ్మను ఢీకొట్టాడు. దీంతో నారాయణమ్మ రోడ్డుపై పడి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు ఢీ..వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగుంట్ల గ్రామం వద్ద జాతీయ రహదారిపై రెండు బైకులు ఎదురెదుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక బైక్ డ్రైవర్ సప్పవరపు వెంకటేశ్వర్లు (44) మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం మండలం తిప్పాయపాలెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు తన ఇంటి నుంచి పట్టణంలోని ఎనామిల్ పలకల ఫ్యాక్టరీలో పనిచేసేందుకు మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. అదే సమయంలో తర్లుపాడు మండలం కందంపల్లి గ్రామానికి చెందిన యువకుడు మహేష్ మార్కాపురం నుంచి కంభం పట్టణంలో పరీక్ష రాసేందుకు వెళ్తున్నాడు. మార్కాపురం మండలం చింతగుంట్ల గ్రామం వద్ద రెండు బైకులూ ఎదురుపడి ఢీకొన్నాయి. తీవ్రగాయాలైన వెంకటేశ్వర్లును 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. యువకుడు మహేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. వెంకటేశ్వర్లుకు భార్య పద్మావతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రూరల్ ఎస్‌ఐ అంకమ్మరావు తన సిబ్బందితో కలిసి పరిశీలించి వివరాలు నమోదు చేశారు.

గుండెపోటుతో ఆర్మీ ఉద్యోగి మృతి



మనోహర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్మీ అధికారులు

రాచర్ల (గిద్దలూరు), మే 13 (ఆంధ్రజ్యోతి) : రాచర్లకు చెందిన ఆర్మీ ఉద్యోగి గంజికుంట్ల మనోహర్ (40) గుండెపోటుతో మృతిచెందారు. ఆర్మీలో విధి నిర్వహణలో ఉండగా ఆకస్మికంగా గుండెపోటుకు గురై మృతి చెందారు. దాంతో ఆర్మీ అధికారులు ముంబాయిలో నివాసం ఉంటున్న మనోహర్ కుటుంబీకులకు మంగళవారం మనోహర్ మృతి విషయం తెలిపారు. మనోహర్ మృతదేహానికి ఆర్మీ అధికారులు ఘనంగా నివాళులర్పించారు. మృతుడు మనోహర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా వారు ప్రస్తుతం ముంబయిలో నివాసం ఉంటున్నారు. మనోహర్ మృతదేహాన్ని సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు వీలుగా రాచర్లకు తీసుకుని వచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బుధవారం అంత్యక్రియలు జరుగనున్నాయి.

మోసగాళ్లబారిన పడవద్దు

పొదిలి, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లముందకు వివిధ రకాల వేషాలతో వచే వారి బారిన పడవద్దని ప్రకాశం బాలోత్సవం ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం పీఎన్‌ఆర్ కాలనీలో ప్రకాశం బాలోత్సవం ఆధ్వర్యంలో వేసవి వినోద కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంత్రాలు, తంత్రాలు, మహిమలు అని మోసగాళ్లు తిరుగుతుంటారన్నారు. అలాంటి వారిని నమ్మవద్దన్నారు. ఈసందర్భంగా 15 రకాల సైన్స్ మ్యాజిక్ అంశాలను చేసి చూపించారు. కార్యక్రమంలో బాలోత్సవ కల్చరల్ కన్వీనర్ రమణయ్య, పొదిలి డివిజన్ నాయకులు గోనె శ్రీను, సంజీవరావు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దలూరులో కార్డెన్ సెర్చ్

11 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు సీజ్

గిద్దలూరు టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అర్బన్ సీఐ కె.సురేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీఎం పాలెంలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. సరియైన పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను, 2 ఆటోలను ఈసందర్భంగా పోలీసులు సీజ్ చేశారు. ఎస్సైలు శివనాంచారయ్య, ఇమ్మానియేలు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం : పట్టణంలోని శివారు కాలనీల్లో మార్కాపురం పోలీసులు మంగళవారం వేకువజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అన్ని దుకాణాలను తనిఖీ చేశారు. వాటిల్లో నిషేధిత వస్తువులు అమ్ముతున్నారా అని పరిశీలించారు. చిన్నపిల్లలకు అమ్మే వస్తువుల్లో కాలం చెల్లినవి ఉంటే తప్పక వాటిని పారేయాలని సూచించారు. ఆటోలు, ద్విచక్ర వాహనాల పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సై డాక్టర్ ఎమ్.రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్డెన్ సెర్చ్‌లో పట్టుబడిన వాహనాలు



స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా గ్రామోత్సవం

గిద్దలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. చివరి రోజు మంగళవారం తిరునాళ్ల బ్రహ్మోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. గరుడ సేవ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. కోలన్న అందరినీ అలరించింది. భక్తులకు పెద్ద ఎత్తు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి పట్టణంలోని ప్రధాన వీధుల్లో లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవాన్ని ప్రజలు తిలకించి, దారిపొడవునా పూజలు చేశారు.

శోభాయాత్రను జయప్రదం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో ఈనెల 22న జరిగే హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని బీజేపీ నాయకులు కృష్ణారావు అన్నారు. జంకె రామిరెడ్డి కాలనీ, కొండెపల్లి రోడ్డు, వడ్డె బజారు తదితర ప్రాంతాలలో మంగళవారం ఆహ్వాన పత్రాలను అందించారు. కార్యక్రమంలో బచ్చు సుబ్రహ్మణ్యం, రామృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని కల్యాణం



స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఎర్రగొండపాలెం రూరల్ మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిల్లంపల్లి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. బొడ్డుపల్లి పవన్ కుమార్ శర్మ, ఆలయ అర్చకులు అన్నమరాజు రమేష్ బాబు శర్మ కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఉదయం సూర్యవాహనంపై గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి సింహ వాహనంపై భక్తులకు స్వామి వారు దర్శనం ఇచ్చారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

కిశోర బాలికలు జాగ్రత్తలు పాటించాలి



స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికలు జాగ్రత్తలు పాటించాలని సీడీపీవో సుశీలాదేవి అన్నారు. స్థానిక 45వ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో వేసవి శిక్షణ శిబిరం మంగళవారం నిర్వహించారు. బాలబాలికల హక్కులు, శిక్షణ, విద్యాభివృద్ధి తదితర అంశాలు వివిధ సృజనాత్మక కార్యకలాపాలు ఆటపాటలు, నృత్యాలు నేర్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అపహరణ

పుల్లలచెరువు, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐటివరం పంచాయతీలోని కొండారెడ్డి కోస్టల్‌లో ట్రాక్టర్ అపహరణకు గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంపత్ కుమార్ పరిశీలించారు. సోమవారం అర్ధరాత్రి కోస్టంలో పెట్టిన ట్రాక్టరు, రోటావేటరు, ట్రాక్టరు ట్రాలీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో బాధితులు బి శంకరరావు, వి వాగ్యానాయక్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ పరిశీలించి కేసు నమోదు చేశారు.

పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టాలి

ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అత్యంత పారదర్శకంగా ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఏపీవోలు, ఈసీలు, టీఏలు, సీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలన పనిచేసిన వారి వాసనలు ఇంకా చాలామంది అధికారులు, సిబ్బందికి పోలేదన్నారు. తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎప్పటికప్పుడు తాము సమీక్షిస్తుంటామన్నారు. పనితీరు మెరుగుపర్చుకోకుంటే ఉద్వాసన తప్పదన్నారు. ప్రతి కుటుంబానికి తప్పక పని చూపాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో మార్కాపురం నియోజకవర్గం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచేలా పనిచేయాలన్నారు. డ్వామా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిదినాలు కల్పించేలా పనిచేయాలన్నారు. అంతేకాక వారికి వేతనాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకున్నా సహించేదిలేదన్నారు. సామాజిక తనిఖీల్లో ఎలాంటి అవినీతి బయట పడినా రికవరీతోపాటు ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

గుండ్లకమ్మ బ్రిడ్జిపై వెలిగిన లైట్లు

మార్కాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ బ్రిడ్జిపై గత కొన్ని నెలలుగా వెలగని వీధి దీపాలకు ఎట్టకేలకు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. 'చీకటిపడితే బిక్కు బిక్కు!' శీర్షికన ఈ నెల 13వ తేదీన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో వెంటనే స్పందించిన మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు వైరింగ్‌కు మరమ్మతులు చేపట్టారు. అంతేకాక కొన్ని స్థంభాలకు నూతన హైమాక్స్ లైట్లు అమర్చారు. మంగళవారం రాత్రికల్లా అన్ని స్థంభాలకు సంబంధించిన వీధి దీపాలు వెలిగాయి.



మరమ్మతులు చేయడంతో వెలుగుతున్న వీధి దీపాలు

ఉచిత కుట్టు మిషన్ సెంటర్ సందర్శన

ఎర్రగొండపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండల కేంద్రంలో ప్రభుత్వం తరపున నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో రాజ్‌కుమార్ సందర్శించారు. కుట్టు మిషన్ శిక్షణ పొందే మహిళలు శ్రద్ధగా నేర్చుకుంటే రాయితీపై కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పి.రామసుబ్బయ్య ఎంపీడీవో వెంట ఉన్నారు.

ఎంపీడీవోగా విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

పొదిలి, మే 13 (ఆంధ్రజ్యోతి) : నూతన మండలపరిషత్ అధికారిగా ఈదర విజయలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో విజయలక్ష్మిని ఈవోఆర్డీ గుత్తా శోభన్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. సమస్యలను అందరి సమసన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సత్కరించిన వారిలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.



ఎంపీడీవో విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఈవోఆర్డీ శోభన్‌బాబు, సిబ్బంది



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పరామర్శలు

గిద్దలూరు టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం రైల్వేస్టేషన్ రోడ్డులో పఠాన్ ఆదామ్‌ఖాన్ తల్లి సాహెద్‌బీ, అలాగే 9వ వార్డులో ఉపాధ్యాయుడు మహమ్మద్ బాషా మృతి చెందగా, ఆయా నివాసాలకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే ఎంఈవో-2 పోలా నాగభూషన్‌రెడ్డి తల్లి నారాయణమ్మ మృతిచెందగా ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు.

సర్పంచ్ చినరాములు మృతి పార్టీకి లోటు

పొదిలి, మే 13 (ఆంధ్రజ్యోతి) : జువ్వలేరు మాజీ సర్పంచ్ చాగం రెడ్డి చినరాములు సోమవారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంగళవారం సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ మంచి నాయకున్ని కోల్పోయిందన్నారు. టీడీపి గెలుపే లక్ష్యంగా పని చేసిన వ్యక్తి చినరాములని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య టీడీపీ నాయకురాలు సామి ఆదిలక్ష్మమ్మ మృతదేహాన్ని కూడా సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

లబ్ధిదారుల వివరాల పునఃపరిశీలన

ఎర్రగొండపాలెం రూరల్ మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిల్లంపల్లిలోని గృహ నిర్మాణాలు చేపట్టేందుకు గత వైసీపీ హయాంలో ఇచ్చిన స్థలాలకు సంబంధించిన పట్టాల లబ్ధిదారుల వివరాలను బుధవారం నుంచి 26వ తేదీ వరకు పున:పరిశీలన చేయనున్నట్లు తహసీల్దార్ డీ మంజునాథరెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. కావున లబ్ధిదారులు పూర్తి వివరాలతో వీఆర్వో, గ్రామ సర్వేయర్, వీఆర్‌ఏలను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు సహకరించాలని కోరారు.

ఆన్‌లైన్ చేయడం లేదని జేసీకి వినతి

ఎర్రగొండపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : తన భూమిని ఆన్‌లైన్ చేయడం లేదని కాశమ్మ మంగళవారం జేసీకి వినతిపత్రం అందజేశారు. మండలంలోని వై.కొత్తపల్లి గ్రామం, ఎర్రగొండపాలెం రెవెన్యూలో సర్వే నెంబరు 144/11లో 3.75 ఎకరాలలో 3 ఎకరాల భూమి నివేశ స్థలాలకు పట్టా ఇచ్చినట్లు కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి మూడేళ్లుగా ఆన్‌లైన్ చేయడం లేదని కాశమ్మ జేసీ వద్ద మొరపెట్టుకుంది. ఈ విషయంలో తహసీల్దారు ఆఫీస్ ఉద్యోగులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపింది. ఇదే భూమిలో వెంకటరెడ్డికి 2ఎకరాలు ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. ఈ భూమి ఆన్‌లైన్ చేయలేదని 2022 జూలై 29న కర్నూలు లోకాయుక్త కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు. కోర్టు తీర్పు లేకుండానే ఇతరులకు ఎలా ఆన్‌లైన్ చేస్తారని జేసీకి తెలిపారు. విచారిస్తామని జేసీ తెలిపారు.

18న క్రికెట్ టోర్నమెంట్

సీఎస్‌పురం(పామూరు), మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యలూరివారిపల్లిలో ఈ నెల 18న క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ యూత్ ఆధ్వర్యంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పామూరు, సీఎస్‌పురం, సీతారామపురం మండలాల స్థాయిలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.20,116, తృతీయ బహుమతి రూ.10,116 అందజేయనున్నట్టు తెలిపారు. ఈనెల 17లోగా రూ.500 ఎంట్రీ ఫీజులతో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7075906442, 9505085146, 6305534431, 9502959570 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

కనిగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): స్నేహ హస్తం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని డాక్టర్ పెరుగు మురళీకృష్ణ అన్నారు. స్నేహహస్తం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంచార మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నక్రమంలో సంచార మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్నేహహస్తం సంస్థ సభ్యులు సుధీర్‌బాబు, బేబీరాజ్, మోహన్‌కుమార్, అక్బర్‌వలి, భాస్కర్, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీస్ స్టేషన్‌లో ఆవరణలో ఉన్న రేషన్ బియ్యం వాహనం

కురిచేడు, మే 13(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలంలో అక్రమం తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి ఎస్‌ఐ శివ పెద్దవరం వద్ద పట్టుకున్నారు. కేసు నమోదు చేసి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ 6ఎ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని గంగదొనకొండ రేషన్ డీలర్ గాలిబ్ రావుకు అప్పగించారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

తాళ్లూరు, మే13 (ఆంధ్రజ్యోతి): ఏపీ మైనారిటీ కార్పొరేషన్ రుణాలకోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దారా హనుమంతరావు తెలిపారు. బొద్దికూరపాడు, తూర్పుగంగవరం, తాళ్లూరుల్లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌ల పరిధిలో మైనారిటీలకు 14 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అర్హతగల మైనారిటీలు ఈనెల 25లోగా ఓబీఎంఎంఎస్ ద్వారా తమ దరఖాస్తులను రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.

పెద్దమ్మతల్లి తిరునాళ్ల పోస్టర్ ఆవిష్కరణ

సీఎస్‌పురం(పామూరు), మే 13 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం గ్రామంలో వెలసిఉన్న శ్రీరామూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల కరపత్రాలను సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డి దేవస్థాన కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈనెల 31నుంచి వచ్చేనెల 5తేది వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

పామూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్‌జూనియర్స్ బాలబాలికల బాస్కెట్ బాల్ క్రీడాకారులకు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడె వలేటి రవీంద్ర క్రీడాదుస్తులను మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక సెయింట్‌మార్క్స్ హైస్కూల్ కోచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. వీరు చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.జయకుమార్, అసోసియేషన్ కార్యదర్శి టి.సుబ్బారావు, సయ్యద్ జిలానీబాషా పాల్గొన్నారు.

చెక్ పవర్ రద్దు పిటిషన్ తిరస్కరణ కాలేదు

సీఎస్‌పురం(పామూరు), మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్‌బీకి సంబంధించిన చెక్ పవర్ రద్దుపై హైకోర్టులో వేసిన పిటీషన్ తిరస్కరణ కాలేదని సర్పంచ్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ పిటీషన్ కోర్టులో కొట్టి వేయలేదన్నారు. కొందరు గిట్టనివారు ఇలా ప్రచారం చేయడం తగదన్నారు. చెక్ పవర్ ఆర్డర్‌ను డిస్మిస్ చేయలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు.

నేడు ఎంఎస్ఎం కళాశాలలో మెగా జాబ్‌మేళా

కనిగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలోని ఎంఎస్ఎం(జీసీఅండ్‌వైపీఎస్) డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీసిటీలోని బ్లూస్టార్ కంపెనీలో పనిచేసేందుకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ , ఐటీఐ, డిప్లొమో చేసిన యువతీ, యువకులు ఈమేళాకు హాజరు కావాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 9703099773 , 9494642286, 8008822821 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

క్రమబద్ధీకరణకు నోచుకోని భూములు

- అధికారుల తప్పిదాలతో జీరో ఖాతాల్లో చేరిన వైనం
- ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న హక్కుదారులు

దర్శి, మే 13(ఆంధ్రజ్యోతి): అధికారులు చేసిన తప్పిదాలకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పనులు జరగక అల్లాడుతున్నారు. రైతులకు హక్కుకల్గిన పట్టాభూములను గతంలో అధికారులు ఉద్దేశపూర్వకంగా జీరో ఖాతాల్లో చేర్చారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కొంతమంది అధికారులు అడ్డగోలుగా వ్యవహరించి వందలాది ఎకరాల భూములను జీరో ఖాతాల్లో వేశారు. దీంతో ఆ రైతులు తమ భూములపై హక్కు కోల్పోయే పరిస్థితి నెలకొంది. వ్యవసాయ రుణాలు తీసుకోవాలన్నా వీలుపడటం లేదు. కుటుంబ అవసరాల కోసం ఆ భూములు విక్రయించుకునేందుకు కుదరటం లేదు. జీరో ఖాతాల్లో చేరిన భూములను సరిచేసి రైతులు ఖాతాల్లోకి మళ్లించేందుకు హక్కుదారులు అప్పటినుంచి తిరుగుతూనే ఉన్నారు. గత వైసీపీ పాలనలో అధికారులు ఈవిషయం గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో మళ్లీ అధికారుల వద్దకు వచ్చి మొరపెట్టుకుంటున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న రెవెన్యూ అధికారులు రైతుల ఇబ్బందులు గుర్తించి క్రమబద్ధీకరణ కోసం ఫైళ్లు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు.

మండలంలో సుమారు రెండువేల ఎకరాలు సాగు భూమి జీరో ఖాతాల్లో చేరింది. ఉన్నతాధికారులు అనుమతిస్తే జీరో ఖాతాల్లో నుంచి ఆ భూములు తొలగించి రైతులకు హక్కు కల్పించే వీలు కల్గుతుంది. ఈవిషయమై తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా జీరో ఖాతాల్లో చేరిన భూములను క్రమబద్ధీకరించేందుకు అన్ని వివరాలతో ఫైళ్లు ఉన్నతాధికారులకు పంపామన్నారు. త్వరలో ఆ భూములకు మోక్షం కల్గుతుందని, రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

బోర్లు వేశారు.. మోటార్లు మరిచారు!

- పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం
- ప్రజలకు తప్పని నీటి ఇక్కట్లు

దొనకొండ, మే 13(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామ పంచాయతీ నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ శాఖల ఆధ్వర్యంలో దొనకొండ పంచాయతీ పరిధిలో హడావుడిగా బోర్లు వేశారు. దీంతో ప్రజలకు నీటి ఇక్కట్లు తప్పడంలేదు. గతనెల 21 నుంచి గ్రామ పంచాయతీ పరిధిలోని మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో హడావుడిగా బోర్లు వేశారు. వీటిల్లో నీరు సమృద్ధిగా పడటంతో ఇక తమకు దాహార్తి సమస్య ఉండదని ప్రజలు భావించారు. అయితే, బోర్లు వేసి దాదాపు 25 రోజులు గడుస్తున్నా నేటికీ మోటార్లు బిగించకపోవడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. దొనకొండలోని అనేక ప్రాంతాల్లో సాగర్ జలాలు సక్రమంగా సరఫరా కాకపోవటంతో ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందిపడుతుంటారు. ప్రస్తుతం అధికారులు బోర్లువేసి నిర్మించే ట్యాంకులు తమకు ఎంతో ఉపయోగపడతాయని ప్రజలు భావించారు. బోర్లు వేసి దాదాపు నెల రోజులు గడుస్తున్నా అధికారులు తదుపరి చర్యలు చేపట్టకుండా మౌనం వహించటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ శాఖలకు చెందిన అధికారులు స్పందించి వేసవి ముగియకముందే బోర్లకు మోటార్లు బిగించి నీటి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



దొనకొండలోని కనకదుర్గమ్మ దేవాలయం వద్ద వేసిన బోరు

అధ్వానంగా రహదారులు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- అవస్థలు పడుతున్న వాహన చోదకులు

ముండ్లమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఏళ్ళ తరబడి మరమ్మతులకు నోచుకోక పోవటంతో ఆ రహదారులపై ప్రజలు, వాహన చోదకులు ప్రయాణం చేయాలంటే హడలిపోతున్నారు. మండలంలోని అతి ప్రధానమైన రహదారుల్లో పెద ఉల్లగల్లు నుంచి వేముల వెళ్ళే రహదారి, నాయుడుపాలెం నుంచి పెదరావిపాడు వెళ్ళే రహదారి, లక్ష్మీనగర్ నుంచి ఉల్లగల్లు వెళ్ళే ప్రధాన రహదారి, నూజెండ్లపల్లి నుంచి మారెళ్ళ వెళ్ళే రహదారి, ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే రహదారి అధ్వానస్థితిలో ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాలనలో కనీసం ఒక గుంత కూడా పూడ్చలేదు. దీంతో వాహన చోదకుల అవస్థలు అన్నీఇన్నీ కావు.

రహదారులపై మోకాళ్ళ లోతు గుంతలు పడ్డాయి. పెదఉల్లగల్లు నుంచి వేముల వెళ్ళే ప్రధాన రహదారి ఆరు కిలో మీటర్లు ఉండగా అడుగడుగునా గోతుల మయమయ్యాయి. కంకర సైతం లేచి బయటపడి పోయాయి. పెదరావిపాడు నుంచి నాయుడుపాలెం వెళ్ళే రహదారి మూడు కిలో మీటర్లు ఉంది. అడుగడుగునా గుంతలు ఏర్పడి వాహన చోదకులు ముందుకు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది.



అధ్వానస్థితికి చేరిన పెదఉల్లగల్లు - వేముల రహదారి



గోతులమయమైన నాయుడుపాలెం - పెదరావిపాడు రహదారి

ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే రహదారి మరింత దారుణంగా తయారైంది. రహదారికి వాడిన కంకర అంతా లేచి పోయింది. రాళ్ళన్నీ బయట పడటంతో కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి ఏర్పడింది. వాహనాల టైర్లు పగిలి పోవటం నిత్యం జరుగుతున్నాయి. లక్ష్మీ నగర్ నుంచి పెద ఉల్లగల్లు వెళ్లే రహదారి అదేతీరులో ఉంది. నూజెండ్లపల్లి నుంచి మారెళ్ళ వచ్చే రహదారి కూడా పలుచోట్ల గోతులమయమైంది. రాత్రుల సమయాల్లో కొత్తగా వెళ్ళే వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాల అమల్లో నిర్లక్ష్యం చేయొద్దు!

- ఎంపీడీవో సునీత

ముండ్లమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమల్లో నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో పి.సునీత అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పథకాలు, రకరకాల సర్వేలను ప్రజలతో మమేకమై వాటన్నింటినీ సకాలంలో నిర్వహించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా ఏ పంచాయతీలోనూ తాగు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలన్నారు. పంచాయతీలకు వచ్చే ఆదాయ మార్గాలను కూడా అన్వేషించాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ కల్పన పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సునీత

కాగా, ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి.సునీతను టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, నేతలు ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో శంకరాపురం, వేముల సర్పంచ్‌లు కూర పాటి నారాయణస్వామి, గజ్జల సుబ్బారెడ్డి, మాజీ జడ్పీటీసీ కొక్కెర నాగరాజు, మాజీ డీసీ చైర్మన్ గంగినేని శేషగిరిరావు, గోపాలరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు తావివ్వరాదు!

- ఎంపీడీవో ప్రభాకరశర్మ

వీసీపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న వడగాల్పుల తీవ్రత దృష్ట్యా ఉపాధి పనులకు వెళ్లే ప్రజలు ఉదయం వెళ్లాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. మండలంలోని వెంగళాయపల్లి, పెదఅలవలపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఉదయాన్నే వచ్చి పది గంటలకల్లా పని పూర్తిచేసుకుని ఇళ్లకు వెళ్లాలన్నారు. ఉపాధి హామీ టీపీలు ఇచ్చిన కొలతల మేరకు పనిచేస్తే రోజుకు రూ.307 గరిష్ఠ వేతనం పొందవచ్చునని చెప్పారు. జాబ్‌కార్డులో పేరు నమోదైనవారే ఉపాధిహామీ పనులకు రావాలన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు తావులేకుండా పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.



పెదఅలవలపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభాకరశర్మ

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ఆదరణ

తాళ్లూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై మంగళవారం అగాహన కల్గించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు వస్తూ నూతన హైబ్రీడ్ రకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మితిమీరిన రసాయనాలు వాడకంతో దిగుబడులు తగ్గటంతో మార్కెట్‌లో గిరాకీ ఉండటంలేదన్నారు. ప్రకృతి వ్యవసాయంవైపు రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రకృతి సాగువల్ల పెట్టుబడి తగ్గటంతోపాటు మంచి దిగుబడులు, ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందన్నారు. 2025 ఖరీఫ్‌లో ప్రకృతి సాగుచేసేందుకు రైతులను సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ప్రకృతి సాగుపై రైతాంగానికి అవగాహన కల్గిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి సాగు చేస్తున్న పలువురు రైతులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రకృతిసాగు ఇన్‌చార్జ్ పి.నర్సింహులు, ఎంపీఈవో దయాసాగర్, ఐసీఆర్పీలు వాణీ కోటిరత్నం, అనంత లక్ష్మి, మౌనిక, పల్లవి, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి సాగు రైతులను సన్మానిస్తున్న వ్యవసాయాధికారి ప్రసాద్, ప్రకృతి సాగు ఇన్‌చార్జ్ నరసింహులు



నాటుసారా గురించి అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నాటుసారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

సీఎస్‌పురం(పామూరు), మే 13 (ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కనిగిరి ఎక్సైజ్ అధికారులు సూచించారు. సీఎస్‌పురం మండలంలోని మైలుచర్ల గ్రామంలో నాటుసారా బట్టీలను డ్రోన్‌ల సహాయంతో మంగళవారం గుర్తించి గ్రామంలో జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కనిగిరి డీఎస్పీ పర్యవేక్షణలో పామూరు సీఐ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఆర్.సుమన్, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. నాటుసారాతో జరిగే నష్టాల గురించి వివరించారు. ఇకపై గ్రామంలో నాటుసారా కాయవద్దని, కాస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరిస్తూ గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

తహసీల్దార్ కార్యాలయానికి ప్రింటర్ అందజేత



తహసీల్దార్ కార్యాలయానికి ప్రింటర్ అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కాశిరెడ్డి

వెలిగండ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): వెలిగండ్ల తహసీల్దార్ కార్యాలయానికి డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి ప్రింటర్‌ను మంగళవారం అందజేశారు. కార్యాలయంలో ప్రింటర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు సిబ్బంది ఆయన దృష్టికి తీసుకురావడంతో ప్రింటర్‌ను అందచేశారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన తహసీల్దార్ వాసును కాశిరెడ్డి కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. తదనంతరం ఎంపీడీవో మహబూబ్ బాషాను కలిసి వెలిగండ్ల మండలంలోని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్స్ లేకపోవడంతో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, కసునూరి మౌలాలి, లక్ష్మీనారయణ, మహేష్, కామిరెడ్డి, నాగర్జున రెడ్డి, పరమేశ్వర రెడ్డి, గంజి రాజశేకర్ రెడ్డి, చిన్ని, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం

సీఎస్‌పురం(పామూరు), మే 13 (ఆంధ్రజ్యోతి): విత్తోనోత్పత్తి, పంటల సాగుచేసే విధానం, తెగుళ్ల, సస్యరక్షణ చర్యలు, పంటల దిగుబడి ఏవిధంగా సాధించాలి అనే అంశాలపై ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ విస్తరణాధికారి శివనారాయణ అవగాహన కల్పించారు. మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు తమ విద్యాభ్యాసంలో భాగంగా గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం బాపట్ల జిల్లా నల్లమోతువారిపాలెంలో మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా కేంద్రం వద్ద రైతు సదస్సు వ్యవసాయ ప్రదర్శనను కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయాధికారులతో పాటు కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు పామూరు టీడీపీ శ్రేణులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న పామూరు శ్రేణులు

పామూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న పార్టీ సంస్థాగత శిక్షణ తరగతుల్లో పామూరు నుంచి బూత్ కమిటీ ఇన్‌చార్జులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో మొదటి రోజు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, తణుకు ఎమ్మెల్యే అరవిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్సీ వేంపడ చిరంజీవి దిశానిర్ధేశం చేశారని తెలిపారు. పామూరు నుంచి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, జి.శ్రీను, పందిటి హరీష్, చుంచు కొండయ్య, ఇర్రి కోటిరెడ్డి, చిన హజరత్, పత్తు మస్తాన్, ఎస్.నరసింహారావు తదితరులు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు.

కాగా, డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన శ్యామాలా కాశిరెడ్డిని పామూరు టీడీపీ నాయకులు మంగళవారం కనిగిరిలో కలిశారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. కాశిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపినవారిలో తెలుగు యువత మండల అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎన్.సాంబయ్య, బూత్ ఇన్‌చార్జ్‌లు బండ్ల నారాయణ, మెంటా నరసింహారావు ఉన్నారు.

సీఎస్‌పురం ఎంపీడీవోగా వాణి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన వాణి

సీఎస్‌పురం(పామూరు), మే 13 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం ఎంపీడీవోగా కె.వాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలపరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఇప్పటివరకు పామూరు ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య సేవలు అందించారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన కె.వాణికి బ్రహ్మయ్య కార్యాలయ బాధ్యతలు అప్పగించారు.

కాగా సీఎస్‌పురం డిప్యూటీ తహసీల్దార్‌గా సేవలు అందిస్తున్న పి.వెంకటేశ్వర్లును ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ అన్సారియా ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు సీఎస్‌పురం తహసీల్దార్‌గా పనిచేసిన మంజూనాధరెడ్డి యర్రగొండపాలెంకు బదిలీపై వెళ్లారు. మార్కాపురం డీఏవో కర్నాటి రవీంద్రరెడ్డిని సీఎస్‌పురం తహసీల్దార్‌గా నియమించగా ఆయన విధులలో చేరలేదు.

ఈక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న పి.వెంకటేశ్వర్లును తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

లింగ వివక్షతకు గురికాకుండా చూడాలి

వీసీపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు లింగవివక్షతకు గురికాకుండా చూడాలని బాలల రక్షణ అధికారి ఐ.శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న కిశోరి బాలికలను గ్రూపులుగా తయారుచేయాలన్నారు. జూన్ 10వరకు గ్రామస్థాయిలో చేయాల్సిన కార్యక్రమాల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీసులకు ఆమె వివరించారు.

మహిళా పోలీసులు కన్వీనర్‌గా గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, వృత్తినైపుణ్యం లాంటి తదితర అంశాల గురించి వివరించారు. కిశోరి బాలికలకు ఎదురయ్యే పరిస్థితులపై వారికి అవగాహన కల్పించాలన్నారు. కిశోరి బాలికలు పౌష్టికాహారం సరిగా తీసుకోవడం, రక్తహీనతకు గురికాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరశర్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జరీన, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.





ఉష్ణోగ్రత (అంచనా) 14-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	29
తెనాలి	40	28
నరసరావుపేట	39	27
బాపట్ల	39	29
రెంటచింతల	39	27
చీరాల	39	29

మృత్యువేగం



రెండు కుటుంబాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

- శివాపురం వద్ద బొలెరో ట్రక్కు.. లారీ ఢీ
- బొప్పాయి కోత పనికి వస్తుండగా దుర్ఘటన
- మొత్తం నలుగురు మృతి ముగ్గురికి తీవ్రగాయాలు
- బాధితులందరూ యర్రగొండపాలెం మండల వాసులే





మృతిచెందిన రమణారెడ్డి, సుబ్బమ్మ, రామాంజి, అంకమ్మ దంపతులు



వినుకొండటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): సొంత గ్రామంలో పనులు లేవు.. 40 కిలోమీటర్ల దూరంలోని ఓ బొప్పాయి తోటలో కోత పనులు దొరికాయి. వారం నుంచి రోజూ ప్రయాణించి పనులు చేసుకుని తిరిగి ఇళ్లకు వెళ్తున్నారు. అయితే మంగళవారం వారు ఇళ్ల నుంచి పని ప్రాంతానికి బయల్దేరేరే కానీ ఇళ్లకు చేరలేదు. వేగం ఆయా కుటుంబాల్లో విషాదం నింపింది. రెండు కుటుంబాల్లో భార్యా భర్తలు మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని శివాపురం గ్రామసమీపంలో మంగళవారం ఉదయం జరిగిన ఈ దుర్ఘటనలో బాధితులందరూ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం సమీపంలోని గడ్డమీదపల్లెకు చెందిన వారే. ఇందుకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు.. వెల్లలచెరువు సమీపంలోని అడ్డ రోడ్డుకు బొప్పాయి కాయలను కోసేందుకు గడ్డమీదపల్లెకు చెందిన పగడాల రమణారెడ్డి(45), ఆయన భార్య సుబ్బమ్మ (40), జొన్నగిరి రామాంజి(36), ఆయన భార్య అంకమ్మ(28)తో పాటు కన్నెబోయిన నాగమణి, పగడాల శివమ్మ, కదిరి నాగేశ్వరరావు(డ్రైవర్) బొలేరో ట్రక్కులో వస్తున్నారు. అదే సమయంలో కొబ్బరికాయల లోడుతో వినుకొండ నుంచి మార్కాపురం వెళ్తున్న లారీ, కూలీలు ప్రయాణిస్తున్న బొలేరో ట్రక్కు వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. లారీ రోడ్డుపై బోల్తా పడగా.. ట్రక్కులోని కూలీల్లో సుబ్బమ్మ, అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. రమణారెడ్డి, రామాంజి వినుకొండలోని వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందారు. నాగమణి, శివమ్మ, నాగేశ్వరరావులు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

నిరుపేద కుటుంబాలకు చెందిన వారే..

వేసవిలో స్వగ్రామంలో పనులు దొరకక పోవడంతో మృతుల కుటుంబాలు బొప్పా ౦ ౨౨ కాయలు కోసేందుకు వారం నుంచి వెల్లలచెరువు సమీపంలో ఓ బొప్పాయి తోటలో పనులకు వస్తున్నారు. బొలేరో ట్రక్కు నిండా కాయలు కోస్తే రూ.3700 వస్తాయి. దీంతో డ్రైవర్‌తో పాటు మిగిలిన ఆరుగురు కూలీలు ఆ మొత్తాన్ని పంచుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా రోజులానే బయల్దేరగా మార్గమధ్యలో అనుకోని సంఘటనతో వారి కుటుంబాల్లో విషాదం అలుముకుంది. రమణారెడ్డి, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమార్తె అరుణకు వివాహం చేయగా కుమారుడు వెంకటరెడ్డి, మరో కుమార్తె నవిత ఉన్నత చదువులు చదువుతున్నారు. జొన్నగిరి రామాంజి, అంకమ్మ దంపతులకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రుల మృతితో పిల్లల పరిస్థితి ఏమిటని బంధువులు కన్నీటి పర్యంతమవుతు న్నారు. ఒకే ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన దంపతులు మృతితో గడ్డమీదపల్లె నుంచి పెద్దసంఖ్యలో వారి బంధువులు, గ్రామస్థులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని సంఘటనపై విచారం వ్యక్తం చేశారు.



వైద్యశాల వద్ద విలపిస్తున్న రమణారెడ్డి కుటుంబసభ్యులు

బాధితులకు అండగా ఉంటాం : ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

పనుల కోసం వస్తూ నలుగురు మృతి చెందడంపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సంతాపం తెలిపారు. ఘటన విషయం తెలిసిన వెంటనే ఆస్పత్రికి వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయాన్ని అందజేస్తామన్నారు. మంత్రి లోకేశ్ సూచన మేరకు మృతదేహాలను స్వగ్రామాలకు తరలించడంతో పాటు చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఆర్డీవో మధులత, డీఎస్పీ నాగేశ్వరరావు బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు.

మరమ్మతులకు.. మోక్షం



తెనాలి : ఇరువైపులా కట్టలు, గోడలు దెబ్బతినిపోయి గండ్లుపడేలా ఉన్న డెల్టా కాల్వ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖరీఫ్ సమీపిస్తోంది. సాగునీటి కాల్వలు చూస్తే అధ్వానం. వేసవి ముగిసేనాటికి కాల్వల మరమ్మతులు చేపట్టాలి. గత నెలలో జిల్లాల వారీగా మరమ్మతులకు సంబంధించి అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. రోజులు గడుస్తున్నా నిధులపై ప్రభుత్వంలో స్పందన లేదు. ఈ పరిస్థితుల్లో మరమ్మతులు ఇక ఉండవని.. ఈ ఏడు కూడా కడ 'గండ్లు' తప్పవేమోనని ఆందోళనలో ఉన్న రైతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ తీపికబురు చెప్పింది. డెల్టా, నాగార్జునసాగర్ పరిధిలోని కాల్వల మరమ్మతులు సత్వరం చేపట్టాలని.. అవసరమైతే స్వల్పకాల టెండర్లు నిర్వహించి నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఇక సాగునీటి కాల్వలకు మహర్దశ
- డెల్టాకు రూ.50 కోట్లు, సాగర్‌కు రూ.37 కోట్లు
- ఐదేళ్ల తర్వాత అడిగినన్ని నిధులు మంజూరు
- నెలాఖరులోపు పూర్తి చెయ్యాలని మంత్రి నిమ్మల ఆదేశం
- అవసరమైతే స్వల్పకాల టెండర్లు పిలవాలని అధికారులకు సూచన

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి మరమ్మతులకు నిధులు విడుదల చేయ డంతో కృష్ణా డెల్టా, సాగర్ పరిధిలో కాల్వలకు మహర్దశ పట్టనుంది. 'కాల్వల నిర్వహణకు కాసులు కావాలి' అనే శీర్షికన ఈ నెల 6న ప్రచురితమైన కథనంపై ప్రభుత్వం స్పందించింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమా వేశంలో కాల్వలకు నిధులు మంజూరుపై నిర్ణయం తీసుకుంది. దీంతో అడిగినన్ని నిధులు మంజూరు చేసింది. ఈ నెలాఖరులోపు కాల్వల మరమ్మతులన్నీ పూర్తిచెయ్యాలని, అవసరమైతే స్వల్పకాల టెండర్లు పిలవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ అధికారులను కూడా ఆదేశించారు. దీంతో సాగునీటి సంఘాలు కాల్వల మరమ్మతుల కోసం రంగంలోకి దిగాయి. అత్యవసర మరమ్మతుల ప్రాతిపదికన పనులను సాగునీటి సంఘాలు పూర్తిచేస్తాయనే నమ్మకాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా డెల్టా కింద గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో 5.71 లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. పల్నాడు జిల్లా పరిధిలోని సాగర్ కాల్వలకిందా భారీగానే సాగుభూములు ఉన్నాయి. వీటి పరిధిలోని కాల్వల మరమ్మతుల కోసం నీటిపారుదల శాఖ అధికారులు గత నెలలో ఓఅండ్ఎం నిధుల కింద రూ.25 కోట్లు చొప్పున రెండు డెల్టాల పరిధిలో రూ.50 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. అటు సాగర్ ఆయకట్టు పరిధిలోనూ రూ.37 కోట్లు, మైనర్ ఇరిగేషన్ అవసరాల కోసం రూ.55 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు నిధులు పూర్తిగా విడుదల కావడంతో పనులు సత్వరం చేపట్టే అవకాశం అధికారులకు లభించింది. అటు డెల్టా, ఇటు సాగర్ పరిధిలో టెండర్లు పిలవాల్సిన పనులు ఎక్కువగా లేనందున సకాలంలో సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో పూర్తిచేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. తొలుత అత్యవసర పనులు పూర్తిచేస్తామని అధికారులు ప్రకటించారు. ఖరీఫ్‌కు పనులు పూర్తి చేసి చివరి భూములకు సైతం సాగునీటిని అందించగలమన్న ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో కడ'గండ్లు'

వైసీపీ హయాంలో సాగునీటి కాల్వల బాగుకు నిధులు విడుదల

(మిగతా 6వ పేజీలో)

నీటి తీరువాతో సంబంధం లేకుండా..

గత ప్రభుత్వంలో సాగునీటి కాల్వల బాగు గురించి పట్టించుకోలేదు. దీంతో ఈ ఏడాది రైతులు నీటితీరువా సక్రమంగా చెల్లించలేదు. వసూలైన నీటి తీరువాలో 80 శాతం నిధులు కాల్వల నిర్వహణకు కేటాయిస్తారు. అయితే ఈ సంవత్సరం కేవలం 10 నుంచి 25 శాతం వరకే అంటే రూ.32 కోట్లు మాత్రమే వసూలైంది. దీంతో నీటి తీరువా పూర్తిగా వసూలయ్యే వరకు ఆగాలని అధికారులు భావించారు. అప్పటి వరకు అంటే సీజన్ గడువు దాటిపోతుంది. ఈ పరిస్థితుల్లో నీటితీరువాతో సంబంధం లేకుండా కాల్వల అత్యవసర మరమ్మతులకు నిధులను మంజూరు చేయాలని ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. ఈ పరిస్థితుల్లో నీటి తీరువాతో సంబంధం లేకుండా మొత్తం నిధులు మంజూరు చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు రూ.50 కోట్లు, సాగర్ కాల్వలకు రూ.37 కోట్లు మంజూరైనట్లు నీటి పారుదల శాఖ గుంటూరు జిల్లా నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ వెంకటరత్నం తెలిపారు.

జంపని డ్రెయిన్‌లో తూటికాడ





కాల్వల నిర్వహణకు.. కాసులు కావాలి!

కాల్వల నిర్వహణకు నిధులు కావాలంటూ ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

ఓడి.. గెలుస్తారా

- చీరాల మున్సిపల్ చైర్మన్‌పై నేడే అవిశ్వాసం
- క్యాంపు రాజకీయాలకు తెర.. గజిబిజిగా సమీకరణాలు
- రాజీనామా చేసి రమ్మన్న ఎమ్మెల్యే.. ససేమిరా అన్న చైర్మన్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అనేక మలుపులు తిరిగిన చీరాల మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస ఘట్టం క్లైమాక్స్‌కు చేరింది. పదవిని కాపాడుకునేందుకు టీడీపీ బాట పట్టిన చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే కొండయ్య ఊహించని షాకిచ్చిన సంగతి తెలిసిందే. పార్టీలోకి వచ్చినా అవిశ్వాసంపై ఓటింగ్ జరుగుతుందని ఎమ్మెల్యే తేల్చాశారు. దీంతో కంగుతిన్న జంజనం తెరవెనుక ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. గత ఎన్నికలో టీడీపీ తరఫున గెలిచింది ఒక్కరే. చీరాలలో ఎన్నికల అనంతరం 18 మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ కండువా కప్పుకున్నారు. వీరిలో అధిక శాతం మంది చైర్మన్ జంజనం ఒంటెద్దు పోకడలు నచ్చక పార్టీ మారిన వారే. వీరి అవిశ్వాస ప్రయత్నాలకు చెక్‌పెట్టే ఉద్దేశంతోనే జంజనం సైకిలెక్కారు. ప్రస్తుత సమీకరణాలు చూస్తుంటే అవిశ్వాసం నెగ్గి ఆయన మాజీ కావడం ఖాయంగా కనిపిస్తోంది. కౌన్సిలర్లతో ఇప్పటికే రిసార్టు రాజకీయాలకు తెరలేపిన నేతలు తెరవెనక ప్రయత్నాలు కూడా ముమ్మరం చేశారు. దీంతో అవిశ్వాసం ఏ దారి తీసుకుంటుందో అనే చర్చ విస్తృతంగా నడుస్తోంది. 19 మంది కౌన్సిలర్లు గత నెలలో కలెక్టర్ వెంకటమురళిని కలిసి అవిశ్వాసానికి నోటీసులివ్వడంతో ఓటింగ్‌కి కలెక్టర్ ఆదేశాలిచ్చారు. చైర్మనే టీడీపీ కండువాతో ప్రత్యక్షమయ్యారు. ఈ క్రమంలో అవిశ్వాసం జరుగుతుందా లేదా అనే చర్చ జరుగుతుండగానే ముందుగా నిర్ణయించిన ప్రకారమే ఓటింగ్ ఘట్టం జరిగి తీరుతుందని ఎమ్మెల్యే తేల్చేశారు. దీంతో రాజకీయం రసకందాయకంలో పడింది. చైర్మన్ పదవిని నిలుపుకోవడానికి జంజనం టీడీపీ బాట పట్టినా ఇప్పుడు అదే పార్టీ అవిశ్వాసాన్ని నెగ్గించడానికి ప్రయత్నిస్తోంది. దీంతో ప్రస్తుతం టీడీపీలో ఉన్న చైర్మన్ ఓడిపోతేనే టీడీపీ గెలిచినట్లవుతుంది. ఈ క్రమంలో జంజనం కోసం వైసీపీ పెద్దలే తిరిగి రంగప్రవేశం చేసి బేరసారాలకు తెరతీసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం జంజనం హడావిడిగా ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ నేతల ప్రయత్నాలు ఫలించి ఇద్దరు కౌన్సిలర్లు మెత్తబడి చైర్మన్ జంజనంకు అనుకూలంగా మారినట్లు సమాచారం. దీంతో అవిశ్వాసం ఎపిసోడే గజిబిజిగా మారింది. చైర్మన్ జంజనం ప్రస్తుతం టీడీపీలో ఉంటే ఆయన్ను గట్టెక్కించడానికి వైసీపీ పెద్దలు రంగంలోకి దిగడం ఓ విచిత్రమయితే, ఆదరాబాదరాగా చైర్మన్‌కు పార్టీ కండువా కప్పి ఇప్పుడు ఆయన్ను గద్దె దించడానికి టీడీపీ సర్వశక్తులు ఒడ్డడాన్ని పట్టణ ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రకటనపై రాని స్పష్టత

చైర్మన్ పదవికి రాజీనామా చేసే పార్టీలోకి రావాలని జంజనం శ్రీనివాసరావును ఎమ్మెల్యే కొండయ్య కోరినట్లు తెలుస్తోంది. దానిపై స్పష్టత ఇవ్వకుండానే ఆయన సైకిలెక్కారు. తర్వాత కూడా చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని పలుమార్లు జంజనాన్ని ఎమ్మెల్యే కోరడం, ఆయన ససేమిరా అనడం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలోనే తనను కలిసిన కౌన్సిలర్లకు ఎమ్మెల్యే కొండయ్య అవిశ్వాసంపై భరోసా ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవిశ్వాసంపై ఓటింగ్ జరిగి తీరుతుందని ఆ ఫలితం ఎలా ఉంటే దానికి కట్టుబడి ఉండాల్సిందేనని చైర్మన్‌కు కూడా వారం కిందటే తేల్చి చెప్పారు. బుధవారం నాటి అవిశ్వాసం నెగ్గి చైర్మన్ జంజనం పదవీచ్యుతుడు కావడం ఖాయంగానే కనిపిస్తోంది. తర్వాత జరిగే పరిణామాలలో చీరాల మున్సిపాలిటీపై టీడీపీ జెండా ఎగురవేసే విధంగా సర్వం సిద్ధం చేసినట్లు సమాచారం



ఎమ్మెల్యే కొండయ్యతో సమావేశమైన టీడీపీకి మద్దతిచ్చిన కౌన్సిలర్లు (పాత చిత్రం)

చైర్మన్ రేసులో ముగ్గురు

ప్రస్తుతం ఉన్న చైర్మన్ జంజనం బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. అవిశ్వాసం నెగ్గి చైర్మన్ పీఠం ఖాళీ అయితే బీసీ వర్గానికి చెందిన వ్యక్తికే దానిని కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించి ముగ్గురు పేర్లు ఎమ్మెల్యే పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అవిశ్వాసాన్ని నెగ్గించే విషయంలో ఆర్థికంగా బలంగా ఉన్న ఓ కౌన్సిలర్ తెరవెనక బేరసారాలకు సహాయసహకారాలు అందిస్తున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే చీరాల మున్సిపల్ చైర్మన్ గిరి ఆయననే వరించే అవకాశాలున్నాయి.

శింగరకొండలో.. మహా పూజలు

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మహాకుంభాభిషేకం ఈ నెల 19న జరగనున్న నేపథ్యంలో బుధవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. శృంగేరి శారదపీఠం ఉత్తరాధికారి విదుశేఖరభారతీస్వామి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం, జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తిమ్మానాయుడు చెప్పారు. ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ రోజున అద్దంకి నుంచి శింగరకొండ దేవాలయం వరకు జరిగే శోభాయాత్రలో 1500 మంది మహిళలు కలశాలతో గుండ్లకమ్మ నది నుంచి జలం తీసుకుని పాల్గొంటారన్నారు. కర్నాటక నుంచి వచ్చిన ఏనుగు శోభాయాత్ర ముందు నడుస్తుందని చెప్పారు. ఇప్పటికే 5 నదులు, 3 సముద్రాల నుంచి జలం సేకరించి తీసుకొచ్చినట్లు తెలిపారు. మహాకుంభాభిషేకానికి సుమారు 50 వేల మందికి పైగా భక్తులు హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం, మజ్జిగ, మంచినీటి బాటిళ్లు అందజేయనున్నారు.

- శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ రాతి మండపం



ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి

- అభివృద్ధి, సంక్షేమ లక్ష్యంతో విధులు నిర్వహించాలి
- 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ దినకర్‌బాబు

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్‌బాబు తెలిపారు. కేంద్ర పథకాల అమలు, పురోగతి, 20 సూత్రాల కార్యక్రమాల అమలు తీరుపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ లక్ష్యంతో అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించాలని చెప్పారు. వికసిత్‌భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి మోదీ, స్వర్ణాంధ్ర సాధన దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం పనిచేస్తున్నారని, వారి ఆలోచనలకు తగినట్లుగా అధికారులు కలిసి పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా జీడీపీ 11.2 శాతం ఉండగా ఏడాదిలో 15 శాతానికి చేరేలా కృషి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు విస్తీర్ణం పెరిగితే రసాయనాల వినియోగం తగ్గుతుందన్నారు. సూర్యలంక, రామాపురం, మోటుపల్లి బీచ్‌లు అభివృద్ధి చెందితే స్వర్ణాంధ్రలో జిల్లాను భాగస్వామ్యం చేయవచ్చన్నారు. తుంపర సేద్యంలో 3 వేల ఎకరాలు లక్ష్యంగా ముందుకుసాగాలన్నారు. గత ఏడాది 65 లక్షల పనిదినాలతో రూ.195 కోట్లు వినియోగించాలని లక్ష్యం కాగా 182 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఉపాధి లక్ష్యాలు చేరుకోకపోవడం వల్ల నిధులను కోల్పోయామని అసంతృప్తి వ్యక్తం చేశారు. జలవనరులు అందుబాటులో లేకుండా గృహాలకు ట్యాప్ కనెక్షన్లు ఇస్తే ఏమి ప్రయోజనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, యువతకు ఉపాధికల్పన, తాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, సీపీవో కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్‌బాబు, కలెక్టర్

మరమ్మతులకు.. మోక్షం

(5వ పేజీ తరువాయి)

చేయలేదు. రైతుల చెల్లించిన నీటి తీరువా ఆధారంగా విడుదల చేసే ఓఅండ్ఎం నిధులనూ ఇవ్వలేదు. ఓఅండ్ఎం నిధులు ఏటా రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకు అవసరమని ప్రతిపాదనలు పంపితే రూ.7 నుంచి రూ.11 కోట్లు మాత్రమే మంజూరు చేసేది. ఆ నిధులను ఖరీఫ్ సీజన్ మొదలయ్యే తరుణంలో విడుదల చేయడం.. గడువులోపు పూర్తిచేయలేకపోయారంటూ వెనక్కు తీసుకోవడం పరిపాటిగా మారింది. అరకొర పనులతో మమ అనిపించి నిధులను దోచేసిన ఘటనలు కూడా ఉన్నాయి. దీంతో గడచిన ఐదేళ్లు సాగునీటి కష్టాలతో రైతులు అల్లాడిపోయారు. నీరు లేనప్పుడు నీటి కష్టాలు వెంటాడితే, వర్షాలు ఎక్కువగా పడిన సమయంలో నీరు ఎక్కువై కాల్వలకు గండ్లుపడి, పంటలను తుడిచిపెట్టేసిన పరిస్థితులున్నాయి. సజావుగా పంట పండుతుందన్న నమ్మకంలేక పొలాలను ఖాళీగా వదిలేసిన సందర్భాలున్నాయి.

రేపు అమ్మనబ్రోలుకు మంత్రి లోకేష్

వీరయ్యచౌదరి కుటుంబానికి పరామర్శ

ఒంగోలు, మే 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు రానున్నారు. ఇటీవల దారుణ హత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించనున్నారు. గతనెల 22వ తేదీ రాత్రి వీరయ్య చౌదరి ఒంగోలులోని తన కార్యాలయంలో హత్యకు గురైన విషయం విదితమే. ఆమరుసటి రోజున స్వగ్రామమైన అమ్మనబ్రోలులో అంత్యక్రియలు జరగ్గా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చి వీరయ్య చౌదరికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈనెల 8న నిర్వహించిన వీరయ్యచౌదరి దశదిన కర్మకు మంత్రి నారా లోకేష్ వస్తారని ప్రచారం జరిగింది. ఆరోజున రాష్ట్ర మంత్రి వర్గసమావేశం ఉండటంతో రాలేకపోయారని సమాచారం. ఈనేపథ్యంలో గురువారం ఆయన వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్నారు. ఆ మేరకు అధికారికంగా ఇటు పార్టీ నేతలకు, అటు అధికార యంత్రాంగానికి సమాచారం అందింది. లోకేష్ గురువారం ఉదయం 8గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 8.45 గంటలకు నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 9 గంటలకు బయల్దేరి 9.20 గంటలకు అమ్మనబ్రోలుకు వెళ్తారు. 9.30 నుంచి 10 గంటల వరకూ వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. తిరిగి 10.50 గంటలకు చదలవాడ హెలిప్యాడ్‌కు చేరుకొని 11 గంటలకు హెలికాప్టర్‌లో అనంతపురం జిల్లా గుత్తికి వెళ్తారు.

4 వేలమంది టీచర్లకు స్థానచలనం

ఖాళీలపై కసరత్తు పూర్తి

పాఠశాల విద్య కమిషనర్ వెబ్‌సైట్‌లో వివరాలు

ఒంగోలు విద్య, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో త్వరలో చేపట్టనున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన కసరత్తు పూర్తయ్యింది. సుమారు 4వేల మందికి స్థానచలనం కలగనుంది. 2017లో జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లిన టీచర్లందరూ ప్రస్తుత బదిలీ కావాల్సి ఉంది. ఒకేచోట ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్లు పూర్తయిన ఇతర టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారి జాబితాలో ఉన్నారు. పాఠశాలల్లో మిగులుగా తేలిన టీచర్లందరూ బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సిందే. మెరుగైన స్థానాలకు బదిలీ కోరుకొనే జాబితాలో 4వేల మంది ఉన్నారు. బదిలీ అయ్యేవారిలో సింహభాగం సెకండరీ గ్రేడ్ టీచర్లే. జిల్లాలోని మొత్తం టీచర్లలో సుమారు మూడోవంతు మందికి స్థానచలనం కలగనుంది.

ఖాళీలు ఇలా..

ప్రస్తుతం ఉన్న క్లియర్ వేకెన్సీలు, మే 31 నాటికి ఉద్యోగ విరమణ ద్వారా వచ్చే ఖాళీలు, ఒకే పాఠశాలలో ఐదేళ్లు పూర్తయిన హెచ్‌ఎంలు, 8 సంవత్సరాలు పూర్తయిన టీచర్ల స్థానాలను ఖాళీలుగా చూపించారు. ఒక పాఠశాలలో మిగులుగా తేలిన టీచర్లను అవసరమున్న చోటుకు సర్దుబాటు చేసి ఆస్థానాలను ఖాళీలుగా చూపించారు. స్టడీ లీవ్, పొరుగు సేవలు, అనధికారికంగా గైర్హాజరైన టీచర్ల స్థానాలను ఖాళీలుగా ప్రకటించారు. 1998, 2008 డీఎస్సీ వారు కాంట్రాక్టు విధానంతో మినిమం టైం స్కేలుతో పనిచేస్తున్న టీచర్ల స్థానాలన్నింటినీ ఖాళీలుగా చూపించారు. దివ్యాంగ టీచర్లతోపాటు, ఎగనెస్ట్ పోస్టుల్లో పనిచేస్తున్న వారి స్థానాలను ఖాళీగా చూపించలేదు. ఖాళీల వివరాలను పాఠశాల విద్య కమిషనర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.



ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం

పంగులూరులో ముగిసిన సంబరాలు

పంగులూరు, మే 13(ఆంధ్రజ్యోతి): పంగులూరులో శ్రీ పార్వతీ సమేత శ్రీ భీమలింగేశ్వరస్వామి 21వ వార్షికోత్సవ సంబరాలు ముగిశాయి. మంగళవారం బలిహరణ, వసంతసేవ, త్రిశూల స్నానం అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలను బ్రహ్మశ్రీ పేటేటి ఉదయభాస్కరశర్మ, ఆలయ అర్చకులు సునీల్‌శర్మ, సాంబశివరావులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పలువురు దంపతులు పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీసాయి నాట్య కళాభారతి, ఎస్.సరస్వతి శిష్య బృందం ఒంగోలు వారు నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనతో కార్యక్రమాలు ముగిశాయి.

రాతి మండపం నిర్మాణం, మారుతీభవన్ గదుల అభివృద్ధికి విరాళాలు

అద్దంకి, మే13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి మండపం, మారుతీ భవన్‌లో గదుల అభివృద్ధికి పలువురు దాతలు మంగళవారం విరాళాలు అందజేశారు. మారుతీ భవన్‌లో రెండు గదులలో ఏసీ, డబుల్‌కాట్ మంచం, బెడ్,గీజర్‌ల ఏర్పాటుకు అద్దంకి మండలం కొంగపాడుకు చెందిన నర్రా హనుమయ్య, రాధిక దంపతులు, మాజీ సర్పంచ్ కరి వెంకటసుబ్బయ్య, సుబ్బాయమ్మ దంపతులు విరాళాలు అందజేశారు. రాతి మండపం నిర్మాణానికి కొరిశపాడు మండలం రావినూతలకు చెందిన గొట్టిపాటి సురేష్, హేమంత్‌లు 1,00,108 రూపాయలు, నెల్లూరు జిల్లా రామలింగాపురానికి చెందిన పుచ్చలపల్లి పవన్‌కుమార్ దంపతులు 1,11,116 రూపాయలు విరాళం అందజేశారు.

రెండు ఉచిత బస్‌ల ఏర్పాటు

శింగరకొండలో మహాకుంభాభిషేకం కార్యక్రమాలు బుధవారం నుంచి 19వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో దేవాలయం ముందు గుండా రాకపోకలు నిలిపి వేయనున్నట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. భక్తులు రాకపోకలు సాగించేందుకు నామ్ రోడ్డులో 99 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుంచి దేవాలయం వరకు భవిష్య స్కూల్ సహకారంతో రెండు ఉచిత బస్సులు ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు.



విరాళం రసీదు ఈవో నుంచి తీసుకుంటున్న నర్రా హనుమయ్య, రాధిక దంపతులు

నేడు హుండీల కానుకల లెక్కింపు

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలోని హుండీల కానుకలను బుధవారం ఉదయం లెక్కించనున్నట్లు ఈవో చెప్పారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

చినగంజాం, మే 3(ఆంధ్రజ్యోతి) : కడవకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ వారి తిరునాళ్లను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి బ్రహ్మయ్య అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు విశేష పూజలు జరిపి, మెక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం, సాయంత్రం గ్రామంలో మహిళలు పోతురాజు విగ్రహం వద్ద పూజలు నిర్వహించి చద్ది, వడపప్పు, పానకాలను తీసుకుని మేళతాళలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. సాయంత్రం పోలేరమ్మ వారి ప్రభను టైరు బండిపై అలంకరించి, పురవీధుల గుండా బాణసంచా, మేళతాళాలు, కనకతప్పెట్లు, యువకుల నృత్యాల నడుమ ఊరేగింపుగా గుడి వద్దకు చేర్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సత్యహరిశ్చంద్ర నాటకం ఆకట్టుకుంది.అలాగే భారీ విద్యుత్ ప్రభల వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలేరమ్మ వారి 70 అడుగుల కటౌట్ తిరునాళ్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతడీపీవో వెంకటనారాయణ రెడ్డి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జనసైనికులు తిరునాళ్లకు వచ్చే భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. గ్రామ కాపులు నామన లక్ష్మణరావు, నాగిరెడ్డి నాగేశ్వరరావు, బొప్పన పూర్ణచంద్రరావు, గొల్లపూడి సూర్యం, బత్తిన రామస్వామి, గాజుల వెంకటేశ్వర్లు, పొట్టి భాస్కరరావు, సూరగాని రామకృష్ణ, సిద్దాబత్తిన భాస్కర్, తోట శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఆలయప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ



పొంగళ్లతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



ఆలయప్రాంగణంలో అమ్మవారి కటౌట్

కూలీల బతుకుల్లో చీకట్లు

రెండు కుటుంబాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

వారిలో భార్యాభర్తల జంటలు

అనాథలైన పిల్లలు

ఎర్రగొండపాలెం రూరల్ మే 13 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం కూలి పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగించే కుటుంబాల బతుకులు చీకటయ్యాయి. ఒకే గ్రామంలో రెండు కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. దీంతో వారి పిల్లలు అనాథలయ్యారు. ఎర్రగొండపాలెం మండలంలోని గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన పలువురు కూలీలు పనుల కోసం పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలో బొప్పాయి కాయలు కోసేందుకు రెండు వాహనాల్లో మంగళవారం ఉదయం గ్రామం నుంచి బయలుదేరారు. అప్పటి వరకు సరదాగా మాట్లాడుకుంటున్న వారి జీవితాల్లోకి ప్రమాదం మంచుకొచ్చింది. వినుకొండ మండలం శివాపురం సమీపంలో జాతీయ రహదారిలో బొలేరోను వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన పగడాల సుబ్బమ్మ (38), బొట్టు అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన పగడాల రమణారెడ్డి(45)ని బొట్టు రామాంజి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. అయితే ఒకే గ్రామానికి చెందిన వీరు నలుగురిలో రెండేసి జంటలు(భార్యాభర్తలు) కావడంతో విషాదఛాయలు అలముకున్నాయి.



రోదిస్తున్న సుబ్బమ్మ కుటుంబసభ్యులు



పగడాల రమణారెడ్డి, సుబ్బమ్మ (ఫైల్)

అనాథలైన చిన్నారులు

బొట్టు అంకమ్మది గడ్డమీదపల్లి స్వగ్రామం. కాగా పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం దాపల్లె గ్రామానికి చెందిన రామాంజితో వివాహం జరిగింది. అయితే అక్కడి నుంచి అంకమ్మ స్వగ్రామానికి కుటుంబంతో వచ్చారు. ఇక్కడే ఇద్దరు కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు, ఆరేళ్ల పవన్‌కుమార్, నాలుగు సంవత్సరాల నాగచైతన్య ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో ఆ చిన్నారులు అనాథలుగా మారారు. వారి మృతదేహాలను స్వగ్రామం దాపల్లెకు వినుకొండ నుంచి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

పగడాల రమణారెడ్డి, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద అమ్మాయికి వివాహం అయింది. బాబు వెంకటరెడ్డి బీఫార్మసీ చదువుతున్నాడు. మరో అమ్మాయి నవిత ఇంటర్ పూర్తి చేసింది. తల్లిదండ్రులు మృత్యువాత పడడంతో వారు పెద్ద దిక్కు లేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. మృతదేహాలను చూసేందుకు గ్రామ ప్రజలు తరలివచ్చారు.

త్రుటిలో తప్పింది

గ్రామానికి చెందిన 12 మంది కూలీలు రెండు వాహనాల్లో నరసరావుపేటకు బొప్పాయి కాయలు కోసేందుకు బయలు దేరారు. శివాపురం సమీపంలో జాతీయ రహదారిలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను దాటివెళ్లిన మరుక్షణమే పెద్ద శబ్దం వినిపించింది. ఆపి చేసేసరికి వెనుక కూలీలతో వస్తున్న బొలేరోను వ్యాన్ ఢీకొట్టిందని కూలీలు తెలిపారు. నిమిషం వ్యవధిలో ప్రమాదం నుంచి మేము తప్పించుకున్నా వెనుక వస్తున్న మాతోటి కూలీలు మృత్యువాతపడ్డారని వారు విలపిస్తున్నారు.



అనాథలైన అంకమ్మ, రామాంజి పిల్లలు



అంకమ్మ, రామాంజి(ఫైల్)

జీవ ధ్వజస్తంభం నగరోత్సవం

అవీఇవీ



నగరోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో, దాత శంకరారెడ్డి కుటుంబసభ్యులు

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద పునఃప్రతిష్ఠ చేయనున్న జీవ ధ్వజస్తంభం నగరోత్సవం మంగళవారం రాత్రి అద్దంకి పట్టణంలో వైభవంగా సాగింది. ఈ నెల 19వ తేదీ జీవ ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరగనుండగా బుధవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని నంబూరివారిపాలెం నుంచి ప్రారంభమైన నగరోత్సవం కాకానిపాలెం, పాతబస్టాండ్, పాత గాంధీ బొమ్మసెంటర్, భవానీసెంటర్ మీదుగా శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వరకు సాగింది. ఈవో తిమ్మానాయుడు, ధ్వజస్తంభం దాత మేదరమెట్ల శంకరారెడ్డి, కుటుంబసభ్యులు, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, చుండూరి మురళీసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సభ్యత్వానికి జంజనం రాజీనామా

గతనెల 29నే జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం ఇన్‌చార్జికి పంపినట్లు సోషల్ మీడియాలో వైరల్

చీరాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై బుధవారం అవిశ్వాస బల నిరూపణ జరగనుంది. అందుకు సంబంధించి జిల్లా అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. గతనెల 30న జంజనం శ్రీనివాసరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం జరిగిన రాజకీయ సమావేశాల్లో ఎక్కడా కూడా జంజనం వైసీపీకి రాజీనామా చేసినట్లు ప్రస్తావన జరగలేదు. ఆఖరికి ఇటీవల చైర్మన్ ఆయన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సైతం రాజీనామా విషయం ప్రస్తావించనప్పటికీ వెసులుబాటు సమయంలో రాజీనామా చేస్తానని స్పష్టంగా చెప్పారు. మంగళవారం ఆయన అనుయాయులు సోషల్ మాధ్యమాల్లో చైర్మన్ రాజీనామా పత్రం వైరల్ చేయడం, అందులోనే గత నెల 29వ తేదీ ఉండటంపై రాజకీయంలో భాగమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆటపాటలతో కూడిన విద్య అంగన్వాడీలో సాధ్యం



చిన్నారులకు సర్టిఫికెట్‌లను అందిస్తున్న సీడీపీవో ఝాన్సీ

చీరాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు విద్యతో పాటు ఆటలపై మక్కువ పెంచే విధంగా బోధన అందించడం అంగన్వాడీల నుండే సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీ చెప్పారు. మంగళవారం మునిసిపల్ పరిధిలోని శ్రీరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐటీసీ బంగారు భవిష్యత్, ప్రథమ్ ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధత ఉత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్యపూర్తి చేసిన విద్యార్థులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. సమగ్ర అభివృద్ధి స్టాల్ వద్ద చిన్నారుల వ్యక్తిగత నైపుణ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కోటేశ్వరమ్మ

అద్దంకిటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా యు. కోటేశ్వరమ్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సత్తెనపల్లి జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన సుబ్బారావు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అద్దంకిలో జరుగుతున్న ఇంటర్ మీడియట్ సప్లమెంటరీ పరీక్ష కేంద్రాలను ఆర్‌జేడీ జగన్నాథం పద్మ పరిశీలించారు.



కోటేశ్వరమ్మ

రోటరీ ఆధ్వర్యంలో నేత్రదానం

ఇంకొల్లు, మే 12, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నేత్రదానం జరిగింది. కోలలపూడి గ్రామానికి చెందిన కందిమళ్ల సుబ్బారావు(82) మృతి చెందగా కుటుంబసభ్యులు అన్నపూర్ణమ్మ, అనంతలక్ష్మీ, అంజమ్మ, రంగబాబుల సహకారంతో గుంటూరు శంకర కంటి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుడి కుటుంబ సభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, రోటరీ సభ్యులు అభినందించారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సభ్యత్వ కిట్ల పంపిణీ కార్యక్రమంలో జనసేనానులు

పర్చూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ నాయకులు శంకరశెట్టి చిరంజీవి కోరారు. మంగవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు విన్నకోట అజేయ్, మదపాటి కిషోర్, సాగిరి శ్రీనివాస్, సందు శ్రీనివాస్, యద్దనపూడి గినిపిశెట్టి అయ్యప్ప పాల్గొన్నారు.

ఐదు రోజులు.. 5,828 దరఖాస్తులు

రైస్ కార్డుల కోసం భారీగా దాఖలు

కొత్తవి కోరుతూ వచ్చినవి 1,015

పేర్ల చేర్పుల కోసం 4,087..

ఇతరత్రా మరికొన్ని

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : కొత్త రైస్ కార్డులు.. ప్రస్తుతం ఉన్న వాటిలో చేర్పులు, మార్పుల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకూ 5,828 దాఖలయ్యాయి. ఏడాదిన్నరగా రేషన్ కార్డుల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అదేసమయంలో గత వైసీపీ ప్రభుత్వం చేర్పులు, మార్పులకు అవకాశం ఇవ్వకపోవడంతో అనేక మంది ఇబ్బందులు పడ్డారు. దీన్ని గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం కొత్త రైస్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. చేర్పులు, మార్పులకు కూడా అనుమతిచ్చింది. దీంతో అర్హులైన వారు ఒంగోలు అర్బన్‌తోపాటు జిల్లాలోని 38 మండలాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. కార్డులో పేరు నమోదు (యాడింగ్) కోసం అత్యధికంగా 4,087 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్త రైస్ కార్డు కోసం 1,015 వచ్చాయి. కార్డు బదిలీకి 473 అందాయి. ఆధార్ సవవరణ కోసం 105, అడ్రసు మార్పు కోరుతూ మరో 27 దాఖలయ్యాయి. అత్యధికంగా మార్కాపురం మండలంలో ఇప్పటి వరకు 350 దరఖాస్తులు వచ్చాయి. ఒంగోలు అర్బన్‌లో 328, ఎర్రగొండపాలెం మండలంలో 321, పుల్లలచెరువులో 314, కనిగిరిలో 240, పొదిలిలో 224, చీమకుర్తిలో 223, సంతనూతలపాడులో 204 దాఖలయ్యాయి. కొత్తపట్నం మండలంలో 190, కురిచేడులో 185, త్రిపురాంతకంలో 184, మద్దిపాడులో 183, సింగరాయకొండలో 169, దర్శిలో 165 దరఖాస్తులు వచ్చాయి. ఇతర అన్ని మండలాల్లో 50నుంచి 150 మంది వరకూ దరఖాస్తు చేసుకున్నారు.

కొండంత దోపిడీ

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి క్షేత్రంలో పూజాసామగ్రి ధరలు ఇష్టారాజ్యం

అధికారుల పర్యవేక్షణ శూన్యం

బెంబేలెత్తుతున్న భక్తులు


ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ఉన్న దుకాణాలు

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు పూజా సామగ్రి ధరలు విని బెంబేలెత్తి పోతున్నారు. ఇవెక్కడ ధరలరా బాబూ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు అత్యధిక శాతం కొబ్బరికాయ కొడతారు. వ్యాపారులు కొబ్బరికాయ ధరలను ఇష్టానుసారంగా నిర్ణయించి వసూలు చేస్తున్నారు.

వాహన పూజ సామగ్రి మరీ భారం

సాధారణంగా బయట మార్కెట్‌లో కొబ్బరికాయ, అగరబత్తీలు, కర్పూరం కలిపి 40 నుంచి 50 రూపాయలకు లభ్యమవుతుండగా, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద దుకాణాలలో మాత్రం 60 నుంచి 70 రూపాయలు వసూలు చేస్తున్నారు. వాహన పూజ, ఆకు పూజల సామగ్రి ధరలకు ఇక హద్దే లేకుండా పోయిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల వద్ద ధరల పట్టికను దేవాలయం అధికారులు ఏర్పాటు చేసినా అలంకారప్రాయంగా మారింది. కొబ్బరికాయలను సైజుల వారీగా 25 నుంచి 40 రూపాయలకు అమ్మాల్సి ఉండగా చిన్న కొబ్బరికాయలను సైతం 60 రూపాయలకు విక్రయిస్తున్నారు. అంటే రెట్టింపు ధర వసూలు చేస్తున్నారు. పలువురు భక్తులు ప్రశ్నిస్తే ఎదురు దాడి చేసే విధంగా మాట్లాడుతుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు.


దుకాణం వద్ద బోర్డు పై పూజాసామగ్రి ధరలు

ఇప్పటికైనా అధికారులు స్పందించి ధరల పట్టికలోని ధరలకే అమ్మే విధంగా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. మహాకుంభాభిషేకం పూజా కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభం కానుండటంతో ధరలు మరింత పెంచడం ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. 19వ తేదీన జరిగే మహాకుంభాభిషేకానికి వేల సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పూజా సామగ్రి ధరలను కచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ఈవో తిమ్మానాయుడును వివరణ కోరగా దుకాణదారులను విచారించి నిర్దేశించిన ధరలతోనే అమ్మకాలు చేసే విధంగా చర్యలు తీసుకుంటమని చెప్పారు.

అభివృద్ధికి అడ్డంకులు


టీటీడీ కల్యాణ మండపం నుంచి వచ్చే దారికి అడ్డుగా నిర్మాణం చేసేందుకు తోలిన ఇసుక

- శింగరకొండలో దాతల సహకారంతో ఒక వైపు అభివృద్ధి పనులు..
- మరో వైపు దేవస్థానం భూమి కబ్జాకు యత్నాలు

మూడు దశాబ్దాల క్రితం రెవెన్యూ శాఖకు నగదు చెల్లించి 8.54 ఎకరాలు కొనుగోలు చేసిన ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం అధికారులు

రెవెన్యూ అధికారుల ఇళ్ల స్థలాల పట్టాలంటూ ఇబ్బందులు పెడుతున్న కొందరు

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ పుణ్యక్షేత్రంలో ఒకవైపు అభివృద్ధి పరుగులు పెడుతుంటే.. మరోవైపు ఆక్రమణలు కూడా అదే స్థాయిలో వెలుస్తున్నాయి. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రభుత్వంతోపాటు దాతల సహకారంతో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆ సమయంలో కొందరు రాజకీయ అండదండలతో దేవస్థానం భూమిని కబ్జా చేస్తుండడం గమనార్హం.

రికార్డుల్లో దేవదాయ శాఖ భూమిగా ఉన్నా సరే..

శింగరకొండ దేవస్థానం అధికారులు 1995లో సుమారు 8.55 ఎకరాలను రెవెన్యూ శాఖ నుంచి కొనుగోలు చేశారు. అనంతరం పలుసార్లు సర్వే చేసి హద్దులు కూడా తేల్చారు. దేవదాయశాఖ భూమిగా రెవెన్యూ అధికారులు నిర్ధారించినా కొంత మంది నివాస గృహాల, ఖాళీ స్థలాల యజమానులు మాత్రం దేవదాయశాఖ అధికారుల పనులను అడ్డుకుంటున్నారు.

అప్పటికప్పుడు కట్టడాలు

శింగరకొండలో ఇప్పటికే పెద్దఎత్తున మహాకుంభాభిషేకం పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో ఆక్రమణదారుల మరింత రెచ్చిపోయి టీటీడీ కల్యాణ మండపం నుంచి రోడ్డుకు వచ్చేందుకు దారి ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఇప్పటికిప్పుడు అడ్డుగా కట్టడాలు కట్టేందుకు సిద్ధం కావటం గమనార్హం. రెవెన్యూ అధికారులు గతంలో కొంతమందికి నివేశన స్థలాల పట్టాలు ఇవ్వటంతో వాటిని చూపించి అభివృద్ధి పనులు అడ్డుకుంటున్నారు.


టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఉన్న ఇళ్లు

రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి దేవాలయ అభివృద్ధి పనులు, మహాకుంభాభిషేకం పనులకు అడ్డంగా ఉన్న నివాసాలు, స్థలాలను ఖాళీ చేయించాలని భక్తులు కోరుతున్నారు. వారిలో నిజంగా అర్హులుగా ఉంటే వేరే ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కూడా సూచిస్తున్నారు. ఈ విషయమై దేవాలయ అధికారులు కూడా మీనమేషాలు లెక్కిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై ఈవో తిమ్మానాయుడును వివరణ కోరగా రెవెన్యూ, పోలీస్ అధికారుల సహాయంతో ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు.

పుణ్యక్షేత్రానికి గొర్రెల మంద.. ప్రత్యేక పూజలు

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి గొర్రెల కాపరులు తమ గొర్రెల మందలతో వచ్చి పూజలు చేసుకుంటారు. ఈ క్రమంలో మంగళవారం ముండ్లమూరు మండలం వేంపాడుకు చెందిన పలువురు గొర్రెలకాపరులు తమ గొర్రెలతో వచ్చి గులాములు చల్లి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. పొంగళ్లు పెట్టుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం చుట్టూ గొర్రెల మంద బారు తీరి ఉండటం తో పలువురు భక్తులు ఆసక్తిగా గమనించారు.


దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న గొర్రెల మంద

గ్యాస్ సిలిండర్ పేలి దుకాణం దగ్ధం

అవీఇవీ

తప్పిన పెను ప్రమాదం


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన దుకాణం

పర్చూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పర్చూలోని చెంచులకాలనీ సమీపంలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఓ దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలటంతో మంటలు చెలరేగి దుకాణం మొత్తం దగ్ధమైంది. నిత్యం వందల మంది ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారి వెంబడి అగ్ని ప్రమాదం చోటుచేసుకోవటం, దుకాణంలో ఉన్న సిలిండర్ పేలటంతో ఆ శబ్దానికి ప్రజలు ఆందోళనకు గురై ఉరుకులు పరుగులు తీశారు. ప్రమాదంలో దుకాణంపై ఉన్న సిమెంట్ రేకులు ఆకాశంలోకి ఎగిరి రోడ్డుపై పడ్డాయి. కాలనీ వాసులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న చీరాల ఫైర్ సిబ్బంది హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రమాద సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవటం, ఎలాంటి ప్రాణహాని జరగకపోవటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దుకాణంలో ఉన్న పొట్టుపొయ్యిలో మంటలు చెలరేగి గ్యాస్ సిలిండర్‌కు అంటుకోవటం వల్లే ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

హైవేపై అదుపుతప్పి బోల్తాకొట్టిన కోడిగుడ్ల లారీ


ముప్పవరం సమీపంలో తిరగబడిన కోడిగుడ్ల లారీ

పంగులూరు, మే 13(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కోడిగుడ్లతో వెళుతున్న లారీ అదుపుతప్పి తిరగబడింది. మండలంలోని ముప్పవరం టీడీపీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. కోడిగుడ్ల లోడుతో బోయపాలెం నుంచి టంగుటూరు వెళుతూ ముందున్న వాహనాన్ని దాటే ప్రయత్నంలో అదుపు తప్పింది. ఎవరికీ గాయాలు కాలేదు. వాహనంలోని కోడిగుడ్లన్నీ పగిలిపోయి నష్టం వాటిల్లింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా హైవే సిబ్బంది చర్యలు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాకతీయ కమ్మ సత్రం సమీపంలో రోడ్డు పక్కన చెట్టు కింద మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించార. వివరాలు తెలిస్తే 9121102167 నెంబర్ కు సమాచారం అందించాలని సీఐ సుబ్బరాజు తెలిపారు.

కౌలు రైతు కుటుంబానికి పరామర్శ

వీరన్నపాలెం(పర్చూరు), మే 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న మండలంలోని వీరన్నపాలేనికి చెందిన ఉప్పుటూరి సాంబయ్య కుటుంబాన్ని వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, నియోజకవర్గ ఇన్‌చార్జి గాదే మధుసూదన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. రూ.50వేల నగదును మృతిని భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవనం శ్రీనివాస రెడ్డి, ఉప్పలపాటి అనిల్, కోటా శ్రీనివాసరవు, జెట్టి చంద్రం, ముప్పాళ్ల రాఘవయ్య, దాసరి వెంకటరావు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో నిర్మాణం అడ్డుకున్న వారిపై కేసు

చీరాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆటో నగర్‌లో నివాసం ఏర్పాటు చేసుకుంటున్న వారిని బెదిరించిన ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆటోనగర్‌లోని స్వర్ణపాలేనికి చెందిన కొప్పవరపు శ్రీనివాసరావు ఇటీవల నిర్మాణం ఏర్పాటు చేసుకొంటుండగా స్టువర్టుపురానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో బాధితునికి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'ప్రజల నమ్మకానికి ఏడాది పూర్తి'

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : 'నాపై నియోజకవర్గ ప్రజలు నమ్మకముంచి నాకు ఓటు వేసి మంగళవారంతో ఏడాది అయింది. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా'నని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. గత అసెంబ్లీ పోలింగ్ జరిగి ఏడాది కావడంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కొత్తపేట పోలింగ్ కేంద్రం 156లో ఓటు వేసి బయటకు వస్తున్న ఫొటోను సోషల్ మాధ్యమంలో విడుదల చేసి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నాను.. కానీ పార్టీ ఆదరించింది.. ప్రజలు విశ్వసించారు.. త్రికోణ ఉత్కంఠ పోరులో ప్రజానుబంధంతో విజయాన్ని అందుకున్నాను.. ఎక్కడ రాజీ పడను.. ప్రజలకు అండగా ఉంటాను.. టీడీపీ కూటమితో అభివృద్ధికే ముందడుగు వేస్తా'నని ఈసందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య వ్యక్తం చేశారు.


గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని బయటకు వస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు(ఫైల్)

కౌలుదారు కార్డుల ప్రాధాన్యతను గుర్తించండి

పంగులూరు, మే 13(ఆంధ్రజ్యోతి) : ప్రతి కౌలురైతు సీసీఆర్‌సీ కార్డు ప్రాధాన్యతను గుర్తించాలని, ఈ నెల 31వ తేదీవు దానిని పొందాలని తహసీల్దార్ సింగారావు చెప్పారు. మండలంలోని రామకూరు గ్రామంలో మంగళవారం కౌలురైతులకు సీసీఆర్సీ కార్డులపై గ్రామసభ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. పంటరుణం పొందాలన్నా, రైతు భరోసాతో పాటు ఇతర ప్రభుత్వ రాయతీలు కౌలురైతుకు లభించాలన్నా గుర్తింపు కార్డు కలిగిఉండాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్వేత, వీఆర్వో బాబయ్య పాల్గొన్నారు.


కౌలుదారు కార్డుల ప్రాధాన్యతను వివరిస్తున్న తహసీల్దార్ సింగారావు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో డి.సుబ్బారెడ్డి ఆదేశించారు. మండలంలోని రామకూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ నిర్వహించి ఖరీఫ్ ప్రణాళిక తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ సింగారావు, వీపీవో పృథ్వీ, ఎస్ఎఫ్ఎల్- 2 రాజశేఖర్, ఆర్పీలు రమేష్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో గోశాలకు దాణా అందజేత


దాణాను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): రోటరీ మిత్రుల సౌజన్యంతో గోశాలకు ప్రతి నెల తమ వంతుగా సాయం అందించడం జరుగుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీ రయ్య తెలిపారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వి శ్వభారతీ రోడ్డులోని హరిహరగోశాలకు రోటరీ మిత్రుల సౌజన్యంతో 12 బస్తాల దాణాను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాస రావు, జ్యోతి చంద్రమౌళి, శే షారెడ్డి, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, గోశాల నిర్వహకుడు సుబ్బారావు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి లక్ష మల్లెల అర్చన

పర్చూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి సోమవారం రాత్రి లక్ష మల్లెపూలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. వైశాఖ పౌర్ణమినాడు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో మల్లెపూలతో అర్చన కార్యక్రమం చేస్తే సమస్త దోషాలు వీడి సుఖశాంతులు వర్ధిల్లుతాయని ఆలయ అర్చకులు హర్షవర్ధనాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీరాం వెంకట సుబ్బారావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


అమ్మవారికి మల్లెపూల అర్చనలో మహిళా భక్తులు

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విక్రం వెంకటరావు, టీడీపీ నాయకులు

చినగంజాం, మే 13(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విక్రం వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్యలు కోరారు. మండలంలోని గొనసపూడి గ్రామంలో విక్రం నారాయణ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారు పోలేరమ్మ దేవస్థానం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. డాక్టర్లు రామాంజనేయులు, కిరణ్‌జ్యోతిలు 255 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటికి సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండ్రగుంట శ్రీహరి, బత్తుల శ్రీనివాసరావు, దివ్వకోలు రాము, యడ్లపల్లి సురేష్, రామిశెట్టి వెంకటేశ్వర్లు, కనపర్తి వీరాస్వామి, పట్టాభి వెంకటేశ్వర్లు, నార్నె సత్యం, వంకాయలపాటి అంజిబాబు, మందాటి వెంకటరావు పాల్గొన్నారు.

డీడీ తీస్తే విద్యుత్ స్తంభాలను తొలగిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మార్టూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు అంటూ ఈ నెల 11వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించిన కథనానికి మండలంలోని విద్యుత్ అధికారులు స్పందించారు. వలపర్ల గ్రామంలో సిమెంటురోడ్డు నిర్మాణం చేసే సమయంలో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ సిమెంటురోడ్డును నిర్మించారు. మంగళవారం విద్యుత్ ఏఈ కిరణ్ మాట్లాడుతూ ఆ విద్యుత్ స్తంభాలను తొలగించి, మరోచోట ఏర్పాటుచేసేందుకు పంచాయతీ ద్వారా షిఫ్టింగ్ లెటరు, అందుకు సంబంధించిన నామినల్‌గా కొంతఫీజుతో డీడీని తీసి పంపిస్తే తాము తొలగిస్తామన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మోహనరావు

పర్చూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడులతో లాభసాటి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.మోహనరావు చెప్పారు. పర్చూరు మండల పరిధిలోని నూతలపాడు పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల ఆధారంగా చేపట్టే ప్రకృతి వ్యవసాయంతో రసాయన ఎరువుల వాడకం తగ్గి తద్వారా భూమి సారవంతంగా మారుతుందన్నారు. దీంతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని చెప్పారు. ప్రతి రైతు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం ఖరీఫ్ 2025కు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను వివరించారు.

సెయింట్ ఆన్స్ ఫిజికల్ డైరెక్టర్ 'అన్నం'కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ఫిజికల్ డైరెక్టర్ అన్నం శ్రీనివాసరావు

చీరాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సెయింట్ ఆన్స్‌కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అన్నం శ్రీనివాసరావు బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పర్సనల్ అవార్డు అందుకున్నారు. కాకినాడ జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన యూనివర్సిటీ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్‌లో అవార్డు అందుకున్న నేపథ్యంలో మంగళవారం కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. అలాగే స్పోర్ట్స్ డే కళాశాల ఎంటీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సయ్యద్ ఖాజావలి 93 కేజీల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించడంతో వైస్ చాన్స్‌లర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ చేతుల మీదుగా రూ.25 వేల చెక్కును అందజేశారు. వివిధ పోటీల్లో కళాశాల నుంచి పోటీ చేసిన విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి వివిధ శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5

శ్రీపొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

బుధవారం 14 మే 2025



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	40.5	29.8
కావలి	38	29
ఆత్మకూరు	41	29
ఉదయగిరి	40	29
కందుకూరు	40	29




ఫీజు మోత

- టెక్నోల పేర్లతో విద్యా వ్యాపారం
- అందినకాడికి దండుకుంటున్న యాజమాన్యాలు
- ఆపై పుస్తకాలు, యూనిఫాం భారం
- తల్లిదండ్రుల జేబుకు చిల్లు
- వసతుల కల్పన మాత్రం అధ్వానం
- పర్యవేక్షణలో చేతులెత్తేస్తున్న విద్యాశాఖ

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కాన్సెప్ట్, ఐఐటీ, టెక్నో, ఈ-టెక్నో, స్మార్ట్, టాలెంట్, ఒలింపియాడ్, సీబీఎస్ ఇలా ఆకర్షణీయమైన పేర్లతో బోర్డులు పెట్టుకుని ఫీజుల పేరిట దండేస్తున్నారు. ఇది చాలదన్నట్టు బహిరంగ మార్కెట్‌లో రూ.2-3వేలకు లభించే యూనిఫాం, పుస్తకాలను కార్పొరేట్ విద్యాసంస్థల్లో రూ.8-10 వేలు వసూలు చేస్తున్నారు. ఈ ఫీజులను నియంత్రించడంలో మాత్రం విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారు. 'ప్రైవేట్ ఫీజులకు అడ్డుకట్టవేస్తాం.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తాం' అంటూ ప్రభుత్వం తెచ్చిన జీఓ అమలు కావడం లేదు. ఈ ఏడాది ఫీజుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో దీని అమలు ఎలా ఉంటుందన్న దానిపై అందరిలో ఉత్కంఠ నెలకొంది.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్లు చేయించుకుంటున్నాయి. పరిమిత సీట్లు అంటూ బోర్డులు పెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు వారి ఆర్భాటపు ప్రకటనలు నమ్మి ముందుగానే అడ్మిషన్లు పొందుతున్నారు. పేరుకే కార్పొరేట్ పాఠశాలలుగా చెప్పుకుంటున్నా అక్కడ వాస్తవ పరిస్థితుల్లో మాత్రం మౌళిక సదుపాయాలు దారుణంగా ఉంటున్నాయి. చాలా పాఠశాలలను ఇరుకు భవనాల్లో నడుపుతున్నారు. క్రీడామైదానాలు కనిపించవు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు మరుగుదొడ్లు ఉండటం లేదు.

● బలహీనతే వారి బలం


పిల్లల చదువు అనగానే తల్లిదండ్రులు తమ ఆర్థిక స్థోమత మరిచి ఎంత ఖర్చయినా పర్వాలేదు మంచి స్కూల్లో చేర్పించాలని అనుకుంటున్నారు. ఈ బలహీనతే కార్పొరేట్ స్కూళ్లకు వరంగా మారి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. కొంతమంది తల్లిదండ్రులు ఏ పాఠశాలలో ఫీజులు ఎక్కువగా ఉంటాయో, మార్కెట్‌లో దేనికి ఎక్కువ పేరుందో ఆ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించేందుకు తపన పడుతున్నారు. దీంతో స్కూల్‌లో అడుగుపెడితే అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.2వేల నుంచి 10వేల వరకు వసూలు చేస్తున్నారు. దీనికితోడు ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లైబ్రరీ, లేబొరేటరీ, ఫర్నిచర్, కార్పస్ ఫండ్, కాషన్ ఫీజు, స్మార్ట్ క్లాసులు.. ఇలా ఫీజుల చిట్టా విప్పుతూ ఊపిరి పీల్చుకోనివ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకుంటే రెగ్యులర్ ఫీజుతో పాటు అదనపు భారాన్ని మోయాల్సిందే. అతికష్టం మీద ఈ ఫీజులు చెల్లించిన తరువాత పుస్తకాలు, యూనిఫాం, షూలు, అట్లు, ఇలా వాటి జాబితా కూడా చాంతాడంత ఉంటోంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఫస్ట్‌టర్మ్ ఫీజు 60శాతం చెల్లించి బతుకుజీవుడా అనుకుంటూ బయటపడేలోపే రెండో టర్మ్ ఫీజు చెల్లించాలని లేదంటే పరీక్షలు రాయించమని పిల్లల డైరీల్లో రాసి పంపిస్తున్నారు. కనీస సదుపాయాలు లేని పాఠశాలలు సైతం ఫీజుల విషయంలో నిక్కచ్చిగా ఉంటున్నాయి.

● అమలు కాని ప్రతిపాదనలు

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఏఎస్ అధికారులతో గతంలో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించింది. పాఠశాలల్లో మౌళిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజించారు. నూతన జిల్లా ప్రాతిపదికన నెల్లూరు జిల్లాలో స్టార్-2 కింద 102 స్కూళ్లు, స్టార్-3 కింద 328 స్కూళ్లు, స్టార్-4 కింద 80 స్కూళ్లు ఉండగా స్టార్-1, 5లలో మాత్రం ఏ స్కూల్‌కు ర్యాకింగ్ రాలేదు. మొత్తం మీద 510 స్కూళ్లకు ర్యాకింగ్‌లు ఇచ్చారు. స్టార్ రేటింగ్ స్కూల్స్‌కు 1 నుంచి 8వతరగతి వరకు ఫీజులు కూడా నిర్ధారిస్తూ ఈ కమిటీ సిఫారసు చేసింది. అలాగే ఎంత ఫీజు వసూలు చేస్తున్నారు.. ఎంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలకు ఉన్న ప్రత్యేకతలు ఏమిటి? తదితర సౌకర్యాల వివరాలను తల్లిదండ్రులకు కనిపించేలా బోర్డులో ప్రదర్శించాలి. పాఠశాలల్లో వసూలు చేసే ఫీజులన్నిటికీ రసీదులు ఇవ్వాలి. ఇలా పలు రకాల నిబంధనలు కూడా విధించారు. అయితే దీనిపై ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్లు మాత్రం ఈ ఫీజులతో తాము పాఠశాలలు నడపలేమని, న్యాయపోరాటాలు చేస్తామని చెబుతుండడంతో ఇది అమలవుతుందా లేదా అన్నది వేచి చూడాలి.

స్టార్ రేటింగ్ వారీగా ఫీజుల వివరాలు (రూ.లలో)

తరగతి	స్టార్-1	స్టార్-2	స్టార్-3	స్టార్-4	స్టార్-5
1-3 వరకు	6,000	7,500	8,600	10,000	12,500
4-5 వరకు	9,000	9,500	10,500	12,000	15,500
6	9,000	9,500	11,100	12,000	15,500
7-8 వరకు	9,500	10,500	11,100	15,000	18,000



ప్రభుత్వ బడుల లెక్క తేలింది!

నెల్లూరు (విద్య) : ప్రభుత్వ బడుల లెక్క తేలింది. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, ఖాళీ పోస్టుల భర్తీపై చేపట్టిన పరిశీలన పూర్తవడంతో జిల్లాలో అన్ని రకాలు కలిపి 3,221 పాఠశాలలు ఉంటాయని అధికారులు తేల్చి చెప్పారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలకు శాటిలైట్ స్కూల్స్‌గా నామకరణం చేసినా జిల్లాలో ఒక్కటి కూడా లేకుండా అన్నీ మూసివేశారు. భవిష్యత్‌లో అక్కడ విద్యార్థులు చేరే అవకాశం ఉంటే తిరిగి పునరుద్ధరణ చేస్తారని అధికారులు తెలిపారు. అలాగే పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తయిన నేపథ్యంలో బదిలీల షెడ్యూల్ మరో 2 రోజుల్లో విడుదల కానుంది. ఐదేళ్లు ఒకే స్కూల్లో పని చేసిన హెచ్‌ఎంలు తప్పని సరిగా బదిలీ కానున్నారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీ టీలు, ఇతర కేటగిరి ఉపాధ్యాయులు 8 ఏళ్లు ఒకే పాఠశాలలో పని చేస్తే తప్పక బదిలీ అవుతారు. 2017లో భారీగా బదిలీలు జరగగా, 2023లో మాత్రం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో అతి తక్కువమందికి మాత్రమే బదిలీలు జరిగాయి. దీంతో ఈ ఏడాది భారీగానే బదిలీలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో బడుల స్వరూపం

శాటిలైట్ స్కూల్స్	0
ఫౌండేషన్ స్కూల్స్	968
బేసిక్ ప్రైమరీ స్కూల్స్	1187
మోడల్ ప్రైమరీ స్కూల్స్	594
అప్పర్ ప్రైమరీ స్కూల్స్	79
హైస్కూల్స్	288
హైస్కూల్స్ + బీపీఎస్	74
హైస్కూల్స్ + ఎంపీఎస్	31



17న హీట్ ద బీట్ : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 17న హీట్ ద బీట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా భవనాలపై రూఫ్‌టాప్ గార్డెన్ ఏర్పాటు, కూల్ పెయింట్ వేసుకోవాలని, రద్దీ కూడళ్లలో నీడ సౌకర్యం కోసం షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే చలివేంద్రాల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంటల నిర్మాణం వంటి ఉష్ణోగ్రతలు తగ్గించే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వడదెబ్బ బారిన పడిన వారి కోసం వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. పక్షులు, పశువుల కోసం తొట్టెలు, పాత్రల్లో నీరు నింపి అందుబాటులో ఉంచాలని సూచించారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- పనులు జరక్కపోవడంతో వర్కుల రద్దుకు ప్రభుత్వం నిర్ణయం
- మళ్లీ ఎప్పటికి మంజూరయ్యేనో!?

ఎవరో చేసిన పాపాలకు ఇంకెవరో శిక్ష అనుభవిస్తున్నారంటే ఇదే. పనులు చేయాల్సిన కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించిన మూలంగా ఇప్పుడు ఆ ప్రభావాన్ని ప్రజలు అనుభవిస్తున్నారు. ఈపాటికి బాగు పడాల్సిన రోడ్లు అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా రద్దయ్యాయి. వైసీపీ హయాంలో లెక్కకు మించి పనులు మంజూరు చేయడం పైగా టెండర్లు దక్కించుకొన్న కాంట్రాక్టర్లు పనులు చేయకుండా ఉండటంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నెల్లూరు-ముైపాడు, ఎన్‌పీఎస్ రోడ్ల పనులు పునరుద్ధరించాలని ఆయా ఎమ్మెల్యేలు కోరినా ఫలితం దక్కలేదు.

8

పుత్రశోకం!

వారిది రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. అయినా ఉన్నంతలో ఎంతో సంతోషంగా ఉంటున్నారు. కలిగిన ఇద్దరు మగ సంతానాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ చదివిస్తున్నారు. ఎదుగుతున్న పిల్లల్ని చూసి తల్లిదండ్రులు కూడా మురిసిపోయారు. అయితే, వీరిపై మృత్యువుకు కన్ను కుట్టినట్టుంది. వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లిన ఆ అన్నదమ్ములను పొట్టనపెట్టుకుంది. ఈతకని కనిగిరి కాలువలోకి దిగి గల్లంతైన బాలుర మృతదేహాలను మంగళవారం వెలికితీశారు. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డలు జీవచ్ఛవంలా పడి ఉండటాన్ని చూసి కన్నపేగు తల్లడిల్లింది. గుండెలవిసేలా రోదించింది. ఇక తమకు దిక్కెవరంటూ బిడ్డలపై పడి విలపిస్తున్న ఆ తల్లిదండ్రులను చూసి సంగంవాసుల్లోనూ కంటతడి తెప్పించింది.



కుమారుల మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లి శేషమ్మ

7



రథంపై వేదగిరీశుడి వైభోగం

నెల్లూరురూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు ఘట్టానికి చేరుకున్నాయి. ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను వివాహమాడిన లక్ష్మీనరసింహస్వామి మంగళవారం ఉదయం వారితో కలిసి పల్లకీలో ఊరేగింపుగా దేవరపాళెం చేరుకున్నారు. అక్కడ విశేషంగా అలంకరించిన రథంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు భక్తులను కటాక్షిస్తూ పురవీధుల్లో విహరించారు. తరలివచ్చిన భక్తజనం గోవింద నామస్మరణలతో పల్లె మారుమోగిపోయింది. తొలుత ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి, మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డిలు పూజలు చేసి తొలి కొబ్బరికాయకొట్టారు. అనుకున్న సమయానికంటే మూడు గంటలు ఆలస్యంగా రథోత్సవం మొదలవడంతో భక్తులు తీవ్రంగా వేసవి తాపానికి గురయ్యారు. రథానికి ఎదురు బిందెలతో నీళ్లు చల్లుతూ, టెంకాయలు కొడుతూ, కర్పూరం వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు జాగ్రత్తలు తీసుకున్నారు. పలు సేవా సంస్థలు భక్తులకు మంచి నీరు, మజ్జిగలను అందించాయి.



ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు తీసుకుంటున్న కార్తీక్, పక్కన చైర్మన్ కోటంరెడ్డి

నుడా అభివృద్ధికి సమష్టిగా పని చేయండి

● అధికారులతో ఇన్‌చార్జ్ వీసీ కార్తీక్

నెల్లూరు (జడ్పీ), మే 13 (ఆంధ్రజ్యోతి) : నుడా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమష్టిగా పని చేయాలని జాయింట్ కలెక్టర్, నుడా ఇన్‌చార్జి వీసీ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నుడా వీసీగా ఆయన బాధ్యతలు చేపట్టగా, చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అభినందనలు తెలిపారు. అనంతరం అధికారులతో జరిగిన సమీక్షలో ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ నుడా లేఅవుట్ల అనుమతులకు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. అనధికార లేఅవుట్లు ఏర్పాటు చేస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా నుడా అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి పెంచలరెడ్డి, డీపీవో హిమబిందు, డీఈ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెదర్ రంగంలో శిక్షణ, ఉద్యోగావకాశాలు

● డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(హరనాథపురం), మే 13 : డీఆర్‌డీఏ-సీడాప్ ఆధ్వర్యంలో ఎస్సీ యువతీ యువకులకు లెదర్ రంగంలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఆపైన చదివి, 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన ఎస్సీ యువతకు 45 రోజులు ఉచిత శిక్షణ ఇచ్చి, ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ శిక్షణ పేరు లెదర్ స్టిచ్చింగ్, కటింగ్ ఆపరేటర్ అని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి ఉంటుందని, సర్టిఫికెట్ కూడా ఇస్తారని తెలిపారు. అర్హత కలిగిన వారు బయోడేటా, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, విద్యార్హతల జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో డీఆర్‌డీఏ-జాబ్స్ విభాగంలోగానీ, బోగోలు తహసీల్దారు కార్యాలయం దగ్గరున్న వైటీసీ భవనంలో గానీ సంప్రదించాలని కోరారు.

నమో లక్ష్మీనారసింహా!

పెంచలోనకి చక్రతీర్థ స్నానం, తెప్పోత్సవం

వసంతోత్సవంతో శోభిల్లిన కోన

ముగిసిన ఉత్సవాలు, నేడు గోనుపల్లికి శ్రీవారు





దేవేరులతో కలిసి పుష్కరిణిలో విహరిస్తున్న పెంచల నారసింహుడు, పుష్కరిణిలో చక్రస్నానం జరుపుతున్న అర్చకులు

8

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 500



గిరిజనులకు దుస్తుల పంపిణీ

కావలి, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవంలో భాగంగా మంగళవారం చెరువు కట్ట గిరిజన కాలనీలో నివసించే 90 కుటుంబాలకు దుప్పటి, తువాలు, చీర, లుంగీతో కూడిన దుస్తుల కిట్టు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కే. హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధు, వలంటీర్లు పద్మావతి, దీరజ్, భార్గవ, చరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

ఉలవపాడు, మే 13(ఆంధ్రజ్యోతి) : ఉలవపాడులో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వీ.శ్రీనివాస్, దేవాలయం వ్యవస్థాపక ధర్మకర్త సుదీష్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం ఆరుబయట మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితుల పర్యవేక్షణలో జరిగే స్వామివారి కల్యాణంకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన పుష్పక రథంపై తిరువీధుల్లో రథోత్సవం జరుగుతుందని తెలిపారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి):మైనారిటీ రాయితీ రుణాలకు ఈనెల 25లోగా ఓబీఎంఎంఎస్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అనూష ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 55 ఏళ్ల లోపు వయస్సు కలిగిన ముస్లిం వర్గానికి చెందిన బీసీ-బీ, బీసీ-ఈ, ఓసీ ముస్లింలు కూడా అర్హులని తెలిపారు. ఏడాదికి 2లక్షల లోపు ఆదాయం కలిగి తెల్లరేషన్‌కార్డుదారులై ఉండాలని తెలిపారు. ఆధార్‌కార్డు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. రవాణా పథకం కింద దరఖాస్తు చేయదలచిన వారికి డ్రైవింగ్ లైసెన్సు, జనరిక్ మెడికల్ కోసం దరఖాస్తు చేయదలచిన వారికి డీ ఫార్మసీ లేదా బీ. ఫార్మసీ సర్టిఫికెట్లు ఉండాలని తెలిపారు.

విట్స్ వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డికి డాక్టరేట్



కావలిటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : విట్స్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనాథ్‌రెడ్డికి కర్నూల్‌లోని రాయలసీమ యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆప్టిమైజేషన్ బేస్డ్ పవర్ అవేర్ సెక్యూర్ రూటింగ్ ప్రొటోకాల్ ఇన్ మొబైల్ అడ్హాక్ నెట్వర్క్స్ అనే అంశంపై ఎస్కే యూనివర్శిటీ(అనంతపురం) ప్రొఫెసర్ బీ సత్యనారాయణ పర్యవేక్షణలో అధ్యయనం చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

276 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు 361 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 276 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-74, ఆర్‌ఆర్-1, సీఆర్-8, జంపింగ్ లాట్స్-2 కారణాలతో 85 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.248.41గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరణ్‌దత్ తెలిపారు.

నేడు ప్రత్యేక పీజీఆర్‌ఎస్

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమంలో అన్నిశాఖలకు సంబంధించి ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకువస్తే తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయ సిబ్బందికి మెమోల జారీ



హాజరు రిజిస్టరు పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేంద్రదేవ్

వలేటివారిపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్వో నారాయణ, జూనియర్ లైన్‌మెన్ బాలసుబ్రహ్మణ్యంలకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. అయ్యవారిపల్లె సచివాలయంను ఎంపీడీవో మంగళవారం తనిఖీ చేశారు. ఆ సమయంలో వీఆర్వో నారాయణ, జేఎల్‌ఎమ్ బాలసుబ్రహ్మణ్యంలు ఈ నెల 1వ తేదీ నుంచి 13వ తేదీ వరకు హాజరు రిజిస్టరులో సంతకాలు చేయకపోవడంతో మెమోలు జారీ చేసినట్లు తెలిపారు.

‘వెలుగు’ తీరే వేరయా!

- విధి నిర్వహణలో సమయపాలన కరువు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



వెలుగు కార్యాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

వలేటివారిపాలెం, మే 13(ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో వెలుగు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళుతారో తెలియక ప్రజలు ఇబ్బందులకు గురవుతోన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. దీనిపై కనీసం సమాచారం ఇచ్చే నాథుడు కూడా కరువయ్యారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సొంత మండలం వలేటివారిపాలెంలో వెలుగు సిబ్బంది పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. కార్యాలయానికి ఎప్పుడు వస్తారో.. ఏ సమయంలో ఎక్కడ ఉంటారో కూడా అర్థం కాని పరిస్థితి. డ్వాక్రా మహిళలు వివిధ పనులపై కార్యాలయానికి వెళ్తే అధికారులు, సిబ్బంది ఏ ఒక్కరూ కనిపించరు. మంగళవారం ఉదయం 11 గంటలకు వెళ్తే అకౌంటెంట్ మినహా సీసీలు ఎవరూ కార్యాలయంలో లేరు. నిబంధనల ప్రకారం సకాలంలో విధులకు హాజరై అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి మూమెంట్ రిజిస్టరులో ఎక్కడికి వెళ్లేది.. అందుకు కారణం నమోదు చేయాలి. అయితే సీసీలు అందుకు వి రుద్ధంగా వ్యవహరిస్తూ విధులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలో పోకూరు, చుండి, శింగమనేనిపల్లె, వలేటివారిపాలెం క్లస్టర్లు ఉండగా ముగ్గురు సీసీలు ఉండగా ఒక సీసీ పోస్టు ఖాళీగా ఉంది. కందుకూరు ఏపీఎం సురేష్ వలేటివారిపాలెం ఇన్‌చార్జి ఏపీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మండలంలో 31 మంది యానిమేటర్లు ఉన్నారు. 1104 గ్రూపులు ఉన్నాయి. అయితే సంఘాలు బలోపేతంపై సిబ్బంది దృష్టి సారించకపోవడంతో గ్రామ సంఘాలు బలహీనపడుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతోన్నాయి. ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంలో మండల సమైక్య, సీసీలు, ఏపీఎం, పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయంలో గోప్యంగా సమావేశాలు నిర్వహించడంపై అనేక విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. అటు పాలకులు, ఇటు ఉన్నతాధికారుల కళ్లుకప్పి సిబ్బంది విధులను నామమాత్రంగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెలుగు కార్యాలయ సిబ్బందిపై దృష్టి సారించి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మహిళా సంఘం సభ్యులు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

సిబ్బంది తప్పకుండా కార్యాలయానికి వెళ్లి హాజరు రిజిస్టరులో సతకం పెట్టి ఎక్కడికి వెళ్తుంది మూమెంట్ రిజిస్టర్‌లో కారణం నమోదు చేయాలి. సమావేశాలు గోప్యంగా కాకుండా మీడియాకు తెలియజేసేలా చర్యలు చేపడతాం. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు.

- సురేష్, ఇన్‌చార్జి ఏపీఎం, వలేటివారిపాలెం

ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందుంటాం

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
- ఎమ్మెల్యే కాకర్లతో కలిసి శుద్ధి ప్లాంట్ల ప్రారంభం



కొండాపురం : మహిళకు తాగునీరు అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల

కొండాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చేందుకు వీపీఆర్ ఫౌండేషన్ ముందుంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని భీమవరప్పాడు ఎస్సీ కాలనీలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృతధార మంచినీటి ఆర్వో ప్లాంటును ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలసి ఎంపీ వేమిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటు నిర్వహణకు ప్రత్యేకంగా ఒక టీమును ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ ట్రైసైకిళ్లు అందచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు విడవలపాటి శ్రీనివాసులు(గురుదేవ్), జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, టీడీపీ కన్వీనర్ ఎం.ఓంకారం, నాయకులు చాగంటి క్రిష్ణ, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, యారవ కృష్ణయ్య, పీ.చంద్రబాబునాయుడు, గంటా నరసింహులు, పీ.రమేష్, పాల్గొన్నారు.

జలదంకి: మండలంలోని చినక్రాక, బ్రాహ్మణక్రాక, తామిదోమ్మెలులో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నిర్మించిన అమృతధార మంచినీటి శుద్ధి కేంద్రాలను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదప్రజలు అంటురోగాల నుంచి బయటపడే ఉద్దేశంతో వీపీఆర్ అమృతధార మంచినీటి శుద్ధి జలాల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంపై ఎంపీ వేమిరెడ్డికి ప్రత్యేక అభిమానం ఉందన్నారు. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతం కావడంతో అధికంగా నియోజకవర్గంలో అమృతధార ప్లాంట్లు ఏర్పా టు చేస్తుండడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కావలి, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యేలు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబుయాదవ్, ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, బ్రాహ్మణక్రాక సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఇండ్ల సుధాకర్, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, చినక్రాక ఎంపీటీసీ గొర్రెపాటి యలమందారెడ్డి, నాయకులు మధురెడ్డి, జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిశోర్

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మికుల హక్కులను కాపాడుకోవడమే లక్ష్యంగా ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన సదస్సులో ఆయా కార్మికసంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులను, చట్టాలను నీరుగారుస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. లేబర్‌కోడ్‌లను రద్దుచేసి కార్మికుల నడ్డి విరిచేందుకు ప్రయత్నం చేస్తున్నదని, దీనిని పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు అన్నిరంగాలలో పనిచేస్తున్న కార్మికులంతా సంఘీభావం ప్రకటించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిషోర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్, నాయకులు జీ.వెంకటేశ్వర్లు, ఎస్‌ఏ గౌస్, బీ.సురేష్‌బాబు, వై.ఆనంద్‌మోహన్, కె.మురళి, ఎస్కే సల్మా, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి కాలువలో గల్లంతయిన అన్నదమ్ముల మృతదేహాలు లభ్యం

- మిన్నంటిన కన్నవారి రోదనలు
- స్థానికుల కంటతడి



నందు మృతదేహాన్ని నీటిలో నుంచి గట్టుకు తీసుకువస్తున్న ఈతగాళ్లు

సంగం, మే 13 (ఆంధ్రజ్యోతి): కనిగిరి కాలువలో గల్లంతైన అన్నదమ్ముల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. కోవూరు స్టౌబీడీ కాలనీకి చెందిన బందా గోవిందయ్య, శేషమ్మల కుమారులు చందు (14), నందు (11) వేసవి సెలవులకు పది రోజుల కిందట సంగంలోని అమ్మమ్మ, పెద్దమ్మల ఇంటికి వచ్చారు. స్థానిక విద్యార్థులతో కలసి సోమవారం కనిగిరి ప్రధాన కాలువలో ఈతకెళ్లి నీటిలో గల్లంతైన విషయం విదితమే. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులు ఇరిగేషన్ అధికారుల సాయంతో కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో మంగళవారం ఉదయానికి నీటి మట్టం బాగా తగ్గి వారు మునిగిన చోటకు 200 మీటర్ల దూరంలో చందు మృతదేహం లభ్యమయింది. కాలువ క్రాస్ రెగ్యులేటర్లకు దిగువున నందు మృతదేహం లభ్యమయింది. రెండు మృతదేహాలను పోలీసులు ఒడ్డుకు చేర్చారు.

● కొడుకులిద్దరూ ఒకేసారి మృతి

కొడుకులద్దరినీ ఉన్నత చదువులు చదివించాలని ఆ దంపతులు కలలు కన్నారు. ఈ క్రమంలో సెలవులను ఆనందంగా గడపాలని అమ్మమ్మ ఇంటికి వచ్చి మృత్యువాత పడడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. దీంతో ఆ ప్రాంతమంతా ఆర్తనాదాలు మిన్నంటాయి. వాస్తవానికి వీరిద్దరు రెండు, మూడు సంతానం. మొదటి సంతానం కూడా కుమారుడే. ఏడాది తిరక్కముందే మృతి చెందాడు. ఆ తరువాత వీరిద్దరు పుట్టారు. పుట్టిన ముగ్గురు కుమారులు ఇలా మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల కడుపు కోత చెప్పనలివి కాకుండా ఉంది.

● పోస్టు మార్టానికి మృతదేహాల తరలింపు

వెలికితీసిన మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యలకు అప్పగించారు. మృతదేహాలను వారి స్వగ్రామం కోవూరు స్టౌబీడీ కాలనీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పరామర్శ

కోవూరు : సంగం సమీపంలో కనిగిరి కాలువలో ఈతకు వెళ్లి మృతి చెందిన నందు, చందు బాలుర తల్లిదండ్రులను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరామర్శించారు. స్థానిక స్టౌబీడీ కాలనీలో ఉంటున్న బాలుర తల్లిదండ్రులను బందా గోవిందయ్య, శేషమ్మలను ఎమ్మెల్యే ఓదార్చారు. ఆమె వెంట పెన్నాడెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, చెంబేటి పెంచలయ్య, బాలరవి, ముసలి సుధాకర్ తదితరులు ఉన్నారు. అలాగే, సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి మూలం రమేష్, శేషయ్య, సుబ్బారావు తదితరులు బాలుర మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, బాలుర మృతదేహాలను చూసి కాలనీవాసులు కన్నీటి పర్యంతమయ్యారు.

దివ్యాంగుల కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం చంద్రబాబు



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దివ్యాంగులు

కావలి, మే 13(ఆంధ్రజ్యోతి): పారా క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ ఇచ్చి, పింఛన్ 4వేల నుంచి 6 వేలకు పెంచి దివ్యాంగుల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు వెలుగులు నింపారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, జిల్లా అధ్యక్షుడు టీసీ మాల్యాద్రి నాయుడు, సెక్రటరీ యాదగిరి, స్వచ్ఛందసంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషాలు పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో మంగళవారం దివ్యాంగుల హక్కులు, ప్రభుత్వ నిర్ణయాలను తెలియచేసే గోడపత్రికలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు రంగబాబు, చరిత్రకుమార్, రామ్‌తేజ్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

- వైభవంగా వసంతోత్సవం



గ్రామోత్సవంలో వేంకటేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

లింగసముద్రం, మే 13(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలో వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వసంతోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం జరిగింది. భక్తులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కానుకలు సమర్పించారు. అనంతరం రాత్రి స్వామి వార్లకు ఏకాంతసేవ కార్యక్రమం నిర్వహించారు.

మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం



కందుకూరు : మాచవరంలో నిర్వహించిన కిశోరి వికాసంలో మాట్లాడుతున్న సీడీపీవో శర్మిష్ఠ, తదితరులు



లింగసముద్రం : మొగిలిచెర్లలో బాలల హక్కుల గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని సీడీపీఓ శర్మిష్ఠ అన్నారు. మండలంలోని మాచవరంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభావతి, మహిళాపోలీస్ కల్పన, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వరల్డ్‌విజన్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

కిశోరి వికాశంపై అవగాహన

వలేటివారిపాలెం : మండలంలోని కొండసముద్రం, శామీరపాలెం గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత బాలికలకు కిశోరి వికాశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు హిమబిందు, సునీత, శిరోమణి, ఉషారాణి పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

లింగసముద్రం : తల్లిదండ్రులు బాలల హక్కుల గురించి తెలుసుకోవాలని లింగసముద్రం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి చెప్పారు. మంగళవారం మండలంలోని మొగిలిచెర్ల అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, 6 నుంచి 14 ఏళ్ల విద్యార్థులకు నిర్బంధ విద్య, బాలికలను లైంగిక వేధింపుల నుంచి కాపాడే పోక్సో చట్టం, బలవంతంగా వెట్టి చాకిరీ తదితర చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మార్తమ్మ, సులోచన, ప్రసన్న, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థ

కలిగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రహదారి వెంబడి ఉన్న గ్రామాల్లో బస్‌షెల్టర్లను కూల్చివేశారు. దీంతో ఆయా గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి విస్తరణ కాకముందు ప్రతి గ్రామం వద్ద ఉండిన షెల్టర్లు ప్రయాణికులకు వసతిగా ఉండేవి. రెండేళ్ల క్రితం రహదారి పనులు ప్రారంభమైన తరువాత వీటిని తొలగించడంతోపాటు రహదారి వెంబడి ఉండే పెద్ద పెద్ద చెట్లను కూకటి వేళ్లతో సహా తీసేశారు. దీంతో షెల్టర్లు, చెట్లు నీడ లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు, వానకు అవస్థలు పడుతున్నారు. వేసవి కాలంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండ దెబ్బకు బస్సుల కోసం రోడ్లమీద ఉండలేకపోతున్నారు. కనీసం చిన్నపాటి బడ్డీకొట్లు ఉన్నా వాటివద్ద నిలబడి బస్సుల కోసం ఎదురుచూసే అవకాశం ఉండేది. అన్ని గ్రామాల వద్ద నిర్మానుష్యంగా మారిపోయాయి. రహదారి పనులు దాదాపు 80 శాతం మేర పూర్తయినా గ్రామాల వద్ద బస్‌షెల్టర్ల నిర్మాణాలకు కార్యాచరణ కానరాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సిద్ధనకొండూరు తిప్పపై మంటలు



సిద్ధనకొండూరు తిప్పపై పొగలు

కలిగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనకొండూరు తిప్పపై ఉన్న అటవీప్రాంతంలో సోమవారం మంటలు వ్యాపించాయి. స్థానికుల అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. తిప్పపై పచ్చని చెట్ల మధ్య ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయ పరిసరాల వద్దకు వచ్చిల భక్తులతోపాటు స్థానికులు సేద తీరడం పరిపాటి. ఈ క్రమంలో ఎవరో నిప్పు వేయడంతో ఆలయ పరిసరాల్లో చుటూ చిన్నపాటి మంటలు వ్యాపించడంతో గ్రామంలోని యువకులు, స్థానికులు హుటాహుటిన ఆలయ ప్రాంతానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నాలు చేశారు. కావలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తేవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

జూలై 7న ఐసీకేర్ అంతర్జాతీయ సదస్సు

కావలిటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జూలై 7వ తేదీ జరగనున్న ఐసీకేర్-2025 అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ విట్స్ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణలో జరగనున్న ఈ సదస్సులో కంప్యూటర్ సైన్సు ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఐఓటి రంగాల్లో సరికొత్త పరిశోధనలు కొత్త ఆవిష్కరణలపై ఆయా రంగాల ప్రముఖులు ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ సునీల్‌కుమార్, శ్రీనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి పునఃప్రతిష్ఠ మహోత్సవం



కలశాలతో మహిళల ప్రదర్శన

కావలిటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి) : పరివార సమేత వాసవీ కన్యకాపరమేశ్వరి పునఃప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. బుధవారం నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఈ మహోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం పుల్లారెడ్డినగర్ ట్రంకురోడ్డు వద్దనున్న సత్యనారాయణస్వామి ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు మహిళలలు కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ట్రంకురోడ్డును నీళ్లతో శుద్ధి చేసి అడుగడునా ముగ్గులు దిద్ది ఊరేంగింపుకు స్వాగతం పలికారు. ఊరేగింపు ముందు భాగాన చిన్నారులు, మహిళల కోలాటాలు, భజనల్లతో, వేషాధారణలు, పెద్దఎత్తున బాణా సంచా కాల్చుకుంటూ బ్యాండ్ మేళాలు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు అట్టహాసంగా సాగింది. రోడ్డుకిరువైపులా బారులు తీరిన భక్తజనం అడుగడునా ఊరేగింపుకు బ్రహ్మరథం పట్టారు. జై వాసవీ మాత నామస్మరణతో ట్రంకురోడ్డు మార్మోగడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కందుకూరి సత్యనారాయణ, గ్రంధి రమేష్, వోలేటి నాగేశ్వరరావు, కనమర్లపూడి నారాయణ, అమరా వేదగిరి, పీ అలేఖ్య, శ్రీకాంత్, సీవీసీ సత్యం, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం

రాపూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : నరసింహుడికి చక్రతీర్థ స్నానం, స్వామివారి సేవ ముందు నృత్యం, వసంతకేళిలో అధికారులు, భక్తులు వసంతోత్సవ శోభతో పెంచలకోన శోభిల్లింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఉత్స వాంతముగా జరిపే పర్వం చక్రతీర్థ మహోత్సవాన్ని అత్యంత వైభవోపే తంగా నిర్వహించారు. తొలుత పుణ్యాహవాచన పూజలు నిర్వహించిన పూజారులు వసంతకేళి జరిపారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవా యిద్యాల మధ్యచక్రత్ ఆళ్వార్ల స్నాన ఘట్టాలు కొనసాగాయి. మంగళవాయి ద్యాల నడుమ అర్చకులు, భక్తజనులు, దేవస్థాన సిబ్బంది తిరువీధి సేవో త్సవంలో పసుపు, కుంకుమ, గంధం, వివిధ సుగంధాలు వెదజల్లే రంగుల్లో వసంతకేళి నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో శ్రీనివాసులు రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల సతీమణి సింధు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవారిని, ఆంజనేయ స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, రాపూరు, మర్రిపాడు ఎస్ఐలు వెంకట రాజేష్, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

వసంతోత్సవంతో శోభిల్లిన కోన



వసంతోత్సవ కేళిలో చైర్మన్ తిరుపాల్ రెడ్డి, ఈవో, ఎమ్మెల్యే సతీమణి సింధు తదితరులు

- పెంచలోరికి చక్రతీర్థ స్నానం, తెప్పోత్సవం
- ముగిసిన బ్రహ్మోత్సవాలు, నేడు గోనుపల్లికి శ్రీవారు

● నయనానందకరంగా తెప్పోత్సవం

మంగళవారం సాయంత్రం ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పుష్కరిణికి తీసుకొచ్చారు. అనంతరం రాత్రి 8 గంటల ప్రాంతంలో తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత ఆలయంలో ఎగరవేసిన గరుత్మంతుడి చిత్రపటాన్ని దించి ధ్వజారోహణం కార్యక్రమాన్ని జరిపారు. ఇక చివరిరోజు అయిన బుధ వారం రాత్రి గోనుపల్లిలో గ్రామోత్సవం జరగనుంది.

● హుండీ ఆదాయం రూ.25,51,088

బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేసిన హుండీలకు భక్తులు భారీగా కానుకలు సమర్పించినట్టు ఈవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మంగళ వారం హుండీలను లెక్కించగా, రూ.25,51,088 నగదు, 38 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. అమెరికా 10 డాలర్లు, కువైట్ 7.5 దినార్లు, శ్రీలంక 500 రూపాయల నోటు వచ్చినట్లు తెలిపారు.

టెన్త్, ఇంటర్ సీబీఎస్ఈ ఫలితాల విడుదల

నెల్లూరు(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) టెన్త్, ఇంటర్ ఫలితాలు మంగళ వారం విడుదల య్యాయి. జిల్లాలో 98 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితా లను బోర్డు అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచి నట్లు బోర్డు అధికారులు ప్రకటించారు. వీటితోపాటు డిజిలాకర్, పరీక్షాసంగమ్ నుంచి కూడా ఫలితాలను తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ రోల్ నంబర్‌లు, స్కూల్ నంబర్లతో ఫలితాలు పొందవచ్చని పేర్కొన్నారు. సీబీఎస్‌సీ వార్షిక పరీక్షలను ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి దాదాపు నెలరోజులు నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా టెన్త్‌లో 1,370 మంది, ఇంటర్‌లో 412 మంది కలిపి మొత్తం 1,782 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. టెన్త్ విద్యార్థులు 98శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, ఇంటర్ విద్యార్థులు 96శాతం పాసైనట్లు సీబీఎస్ఈ విద్యాసంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 11,781 మంది హాజరు

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 11,781 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 11,654 మంది హాజరు కావాల్సిఉండగా 11,268 మంది హాజరయ్యారు. 386 మంది గైర్హాజరయ్యా రు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 549 మంది హాజరు కావాల్సి ఉండగా 513 మంది హాజరయ్యారు. 36 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐవో టీ వరప్రసాదరావు 14 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 7, ఫ్లయింగ్ స్క్వాడ్ 26 కేంద్రాలను పరిశీలించారు.

కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

● ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



నెల్లూరు ప్రధాన బస్టాండు వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు హెచ్చరించారు. నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ఉన్న డీపీటీ కార్యాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం అయిన తర్వాత కార్మికులకు అప్పటి వరకు ఉన్న సౌలభ్యాలు, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌పీవోటీ రద్దు చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న ఓపీఎస్ సౌకర్యం కల్పించలేదని, ప్రమోషన్లు ఇవ్వలేదని, ఖాళీలు భర్తీ చేయలేదని ఆరోపించారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కారుణ్య నియామకాలు జరపలేదన్నారు. వీటన్నింటిపై ఇప్పటికే అనేక రకాలుగా నిరసన తెలిపినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర నాయకుడు కే రమణరాజు, జోనల్ నాన్ ఆపరేషన్ కార్యదర్శి ఎం ఎల్లయ్య, జోనల్ వర్కింగ్ అధ్యక్షుడు మాధవరావు, జిల్లా నాయకులు ఎం రామారావు, జానా వెంకటేశ్వర్లు, సీహెచ్ చెంచయ్య, ఆర్ సుబ్బయ్య, టీ మురళీమోహన్ పాల్గొన్నారు.

రైల్లో గంజాయి స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), మే 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైళ్లలో రైల్వే పోలీసులు తనిఖీ చేస్తుండగా బ్యాగుల్లో గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల వివరాలను రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకర్లకు వెల్లడించారు. గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాలతో మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికి వరుసగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. రైల్వే సీఐ ఏ సుధాకర్ తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి నెల్లూరు, కావలి, గూడూరు రైల్వే స్టేషన్లలో రైళ్లలో తనిఖీలు చేశారన్నారు. నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో పూరి-తిరుపతి పూరి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేస్తుండగా గంజాయిని అక్రమంగా తరలిస్తున్న కేరళ రాష్ట్రం మళప్పురం జిల్లాకు చెందిన మహమ్మద్ ఉబయ్ ఎస్‌పీపీ, అదే రాష్ట్రం ఎర్నాకుళంకు చెందిన సాధిక్యూ పీఏలను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారి నుంచి రూ.60 వేల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారన్నారు. ఒడిశా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసి తమ ప్రాంతంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు నిందితులు విచారణలో తెలిపారన్నారు. సీఐ సుధాకర్, ఎస్ఐ ఎన్ హరిచందన, సిబ్బంది రవి, వెంకటేశ్వర్లు, మణికంఠను డీఎస్పీ అభినందించారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- మైపాడు, ఎన్‌పీఎస్ రోడ్ల పనులు రద్దు
- వర్కులు జరక్కపోవడంతో ప్రభుత్వం నిర్ణయం
- ఫలించని ఆయా ఎమ్మెల్యేల ప్రయత్నాలు
- మళ్లీ ఎప్పటికి మంజూరయ్యేనో!?

నెల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : గతేడాది అక్టోబరులో ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని రూ.120 కోట్ల విలువైన రోడ్ల పనులను ప్రభుత్వం రద్దు చేసింది. నెల్లూరు-మైపాడు రోడ్డు, నెల్లూరు-పొదలకూరు-సైదాపురం (ఎన్‌పీఎస్) రోడ్డు, కలిగిరి-ఓబులేటివారిపాలెం, గూడూరు-తురిమెర్ల రోడ్లు ఈ రద్దు జాబితాలో ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం తర్వాత నెల్లూరు-మైపాడు రోడ్డు, ఎన్‌పీఎస్ రోడ్ల రద్దు నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని, ఆ పనులను పునరుద్ధరించాలని ఆయా ఎమ్మెల్యేలు తీవ్రంగా యత్నించారు. అయితే వీరి విన్నపాన్ని ప్రభుత్వం తిరస్కరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకటే పాలసీ తీసుకున్నందున ఈ రోడ్లను రద్దు జాబితా నుంచి మినహాయించలేమని ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ సెక్రటరీ కాంతీలాల్ దండే ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 12 రోడ్లను పునరుద్ధరించాలంటూ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) పంపిన లేఖను పరిగణలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. దీంతో నెల్లూరు-మైపాడు రోడ్డు, ఎన్‌పీఎస్ రోడ్డు పనులు జరుగుతాయన్న ఆశలు ఆవిరయ్యాయి.

● నెల్లూరు-మైపాడు రోడ్డు

నెల్లూరు-మైపాడు రోడ్డు అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సీఆర్ఎఫ్ కింద రూ.48 కోట్లను మంజూరు చేసింది. 2023, డిసెంబరులో ఈ రోడ్డుకు టెండర్ పిలిచారు. నాడు ఐదుగురు కాంట్రాక్టర్లు టెండర్లు వేసి అంతా రింగ్ అయ్యి ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అందరూ తలా కొద్ది వర్కు చేసేలా అనధికార ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు నాటి వైసీపీ నేతలు మధ్యవర్తిత్వం చేశారు. ఆ తర్వాత కాంట్రాక్టర్ల మధ్య సఖ్యత కుదరకపోవడంతో రోడ్డు పనులు మొదలుపెట్టలేదు. ఇక కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ రోడ్డుకు గ్రహణం వీడలేదు. ఓ కాంట్రాక్టర్ ఈ రోడ్డు వర్కు మొత్తాన్ని దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేయడంతో గతేడాది అక్టోబరు వరకు పనులు మొదలుకాలేదు. ప్రభుత్వం రద్దు ఉత్తర్వులు ఇచ్చాక హడావిడిగా పనులు మొదలుపెట్టి 25 శాతం పనులు చేశారు. బాగున్న రోడ్డు మీద సగం, సగం పనులు చేసి ఆపేయడంతో ప్రజలకు అసౌకర్యంగా మారింది.



అర్ధంతరంగా ఆగిపోయిన నెల్లూరు-మైపాడు రోడ్డు పనులు

● దారుణంగా సైదాపురం

ఎన్‌పీఎస్ రోడ్డు పొదలకూరు నుంచి సైదాపురం వెళ్లే మార్గం చాలా దారుణంగా ఉంది. ఈ రోడ్డును 35/6 కి.మీ నుంచి 54/4 కి.మీ వరకూ అభివృద్ధి చేసేందుకు సీఆర్ఎఫ్ కింద రూ.45 కోట్లు మంజూరయ్యాయి. ఈ వర్కుకు కూడా దాదాపు రెండేళ్ల క్రితం టెండర్లు జరగ్గా కాంట్రాక్టర్ నెమ్మదిగా పనులు చేశారు. గతేడాది ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చే నాటికి ఈ రోడ్డు పనులు 25 శాతం పూర్తికాకపోవడంతో ప్రభుత్వం రద్దు చేసింది. ఈ రెండు రోడ్డు వర్కులకూ కేంద్రం నిధులు సమకూర్చుతున్నా కాంట్రాక్టర్లు పనులు చేయలేదు. వైసీపీ ప్రభుత్వంలో బిల్లుల సమస్యతో పనులు జరగలేదు. అయితే ఆ తర్వాత ప్రభుత్వం మారినా పనులు జరగకపోవడం గమనార్హం. నిర్దేశిత సమయంలో పనులు చేయని కారణంగా ఈ రెండు ముఖ్యమైన రోడ్డు పనులు ఇప్పుడు రద్దవడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ రెండు రోడ్లకు ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా వాటిని పునరుద్ధరించాలంటూ కోవూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ ఆర్‌అండ్‌బీ మంత్రికి లేఖలు రాశారు.

కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 11వ తరగతికి ఈనెల 14 నుంచి 24వతేదీ వరకు అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే శంకరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 37 సీట్లు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు నిర్దేశిత తేదీల్లో ఉద యం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు విద్యాలయం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలే కాకుండా ఇతరులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

దేశ రక్షణ నిధికి టిడ్కో చైర్మన్ రూ.లక్ష విరాళం

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణ నిధికి మే నెల జీతం నుంచి రూ.లక్ష విరాళంగా ఇస్తున్నట్లు జనసేన పార్టీ నెల్లూరు జిల్లా ఇన్ చార్జి, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశం కోసం బిడ్డను పోగొట్టు కున్న తల్లిదండ్రులకు ఏమి ఇచ్చినా రుణం తీర్చుకోలే మన్నారు. జనసేనాని పవన్ కల్యాణ్ సొంత నిధులు రూ.25 లక్షలు ఇచ్చి, ఆ కుటుంబానికి ఆర్థిక ఊరట కలిగిస్తాయని చెప్పిన మాటలతో స్ఫూర్తి పొంది రూ.1లక్ష విరాళం ఇస్తున్నట్లు తెలిపారు.

నేడు నృసింహుడి కల్యాణం

వింజమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్లలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఎల్వీ కొండారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొనాలని ఆయన కోరారు. భక్తులకు అన్నప్రసాదం, మజ్జిగ అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కల్యాణోత్సవానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రానున్నారని తెలిపారు.



ఉదయగిరి : మహిళలకు నీళ్ల బిందెలు అందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల తదితరులు

అమృతధారకు పునాది ఉదయగిరే!

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి

ఉదయగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): తనకు ఉదయగిరి అంటే ఎనలేని అభిమానమని, అందుకే తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ అమృత ధార పథకాన్ని ఇక్కడ నుంచే ప్రారంభించినట్లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉదయగిరి, జలదంకి, కొండాపురం మండలాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి శుద్ధిజల కేంద్రాలను ఎంపీ వేమిరెడ్డి ప్రారంభించారు. ఉదయగిరి మండలం వెంకట్రావుపల్లిలో ఎంపీ మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో ఇప్పటివరకు 170 శుద్ధిజల కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఒక్క ఉదయగిరిలోనే 36 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రధానంగా ఫ్లోరిన్ పీడిత ప్రాంతాల్లో శుద్ధిజల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ అడిగిందే తడవుగా నియోజకవర్గంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుద్ధిజల కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు, టీడీపీ నాయకులు మన్నేటి వెంకటరెడ్డి, బయ్యన్న, రియాజ్, బొజ్జా నరసింహులు,సర్పంచి సత్తెనపల్లి వరలక్ష్మి, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేక.. పెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోక !

- భవిష్యత్తులో నష్టపోనున్న కొత్త జంటలు
- విదేశీయానం సందర్భంలో ఇబ్బందులు
- విడాకులు, ఆస్తి వివాదాల్లోనూ ఇక్కట్లే..!

ఆత్మకూరు, మే 13 ఆంధ్రజ్యోతి): నెల్లూరుకి చెందిన ఓ జంట ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. కానీ ఆ పెళ్లిని వారు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. ఇటీవల వారు విదేశాల్లో ఉద్యోగానికి వెళ్లాల్సి వచ్చింది. అందుకు వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి అని చెప్పడంతో హడావిడిగా ఎక్కువ నగదు ఖర్చు పెట్టి వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందారు. ఇలా ఎంతోమంది తెలియక వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోతున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. తాజా పరిస్థితుల్లో పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ ఎంతో అవసరం. కొత్తగా ఒక్కటయ్యేవారంతా తప్పనిసరిగా వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాల్సిన అవసరం ఉంది.

● ప్రక్రియ ఎలాగంటే...

వివాహం రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే దరఖాస్తుతో పాటు పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తె శుభలేఖలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పాటు పెళ్లి కుమారుడు తాళి కడుతున్న ఫొటో, తలంబ్రాలు పోస్తున్న ఫొటో,



ఇద్దరు వివాహ సమయంలో పూలదండలు మార్చుకునే ఫొటో, ఆధార్ కార్డులు, బర్త్ డే సర్టిఫికేట్ జెరాక్సులు అధికారులకు అందజేయాలి. పదోతరగతి చదివిఉంటే మార్కుల జాబితా నకలు జత చేయాలి. నవ దంపతులు తరుపున ఇద్దరేసి సాక్షి సంతకాలు చేయాల్సి ఉంటుంది.వీటిని ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇస్తే వారు పరిశీలించి మున్సిపాలిటీ కార్యాలయానికి లేదా పంచాయతీ కార్యాలయానికి పంపుతారు. ఆ తరువాత రూ. 530లు చెల్లించి వివాహ రిజిస్ట్రేషన్ పత్రం పొందవచ్చు. అంతేకాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుక్ చేసుకుని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంది.

● ప్రయోజనాలు ఇవి...

ఉద్యోగులు తమ భార్య లేక భర్త నామినీగా నమోదు చేయాలనుకున్నా, పలు పథకాల్లో లబ్ధి పొందాలనుకున్నా, విదేశాలకు వెళ్లే సమయంలో దంపతులు పాస్‌పోర్ట్‌కు సంబంధించి వీసా, వర్క్ పర్మిట్, బీమా వంటివి పొందాలనుకున్నా వివాహ ధ్రువపత్రం తప్పనిసరి. అనివార్యకారణాల వల్ల దంపతుల మధ్య వివాదాలు తలెత్తినా పోలీసు కేసులు, కోర్టులో సాక్ష్యంగా చూపేందుకు వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం అవసరం అవుతుంది.

జోరుగా పెళ్లిళ్లు

ప్రస్తుతం జిల్లాలో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు పెళ్లిళ్లు, బంధు మిత్రులతో కళకళలాడుతున్నాయి. ఈనెలతో నెలతోపాటు జూన్ మొదటివారం వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్‌తో వధూవరులు సందడి చేస్తున్నారు. అంతా బాగానే ఉన్నా.. నిబంధనల ప్రకారం కల్యాణ క్రతువును రిజిస్ట్రేషన్ చేసుకునే విషయంలో మాత్రం పలువురు శ్రద్ధ చూపడం లేదు.

● 45 శాతం మంది మాత్రమే నమోదు

జిల్లాలో ప్రతిఏటా వేలాది వివాహాలు జరుగుతు న్నాయి. కల్యాణ మండపాలు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, ఇళ్ల దగ్గర వివాహాలు జరుగుతుంటాయి. వీటిలో రిజిస్ట్రేషన్లు మాత్రం 45 శాతం మాత్రమే అవుతున్నాయి. చాలామందికి అవగాహన లేకపోవడంతో నమోదు చేసుకోవడం లేదు. అవసరం వచ్చినప్పుడు హడావిడిగా కార్యాలయాల చుట్టూ తిరగడం, రూ. 530 ఖర్చుతో అయ్యేదానికి మధ్యవర్తుల ప్రమేయంతో నాలుగైదు వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. ముందుగానే అప్రమత్తమై రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఎంతో మంచిది.

శాంతియుతంగా మెలగాలి

- దప్పళంపాడు గ్రామస్థులకు సబ్‌కలెక్టర్ శ్రీపూజ సూచన
- 12 మందిని బైండోవర్ చేసుకున్న పోలీసులు



దప్పళంపాడు గ్రామస్థులతో మాట్లాడుతున్న కందుకూరు సబ్‌కలెక్టర్

గుడ్లూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతియుత వాతావరణంలో నడుచుకోవాలని మండలంలోని దప్పళంపాడు గ్రామస్థులకు కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ సూచించారు. దప్పళంపాడులో మూడు రోజుల క్రితం నుంచి ఇరు సామాజిక వర్గాల నడుమ జరుగుతున్న వివాదాల నేపథ్యంలో బాధితులు సోమవారం కందుకూరు సబ్‌కలెక్టర్‌ను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలంటూ సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనలపై స్పందించిన సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ మంగళవారం దప్పళంపాడుకు చేరుకొని ఇరువర్గాల ప్రజలతో చర్చించారు. వివాదాలకు కారణ ఏమిటని విచారించారు. గత శుక్రవారం రాత్రి గ్రామంలోని ఓ వీధిలో కొందరు యువకులు ద్విచక్ర వాహనాలపై వెళుతూ పెద్దపెద్దగా ఈలలు వేశారని, ఆ ఈలలు వేసింది ఎస్సీ కాలనీకి చెందిన జడ చక్రి, చెరుకూరి కార్తిక్‌లేనని భావించిన పెత్తందార్లు, మరుసటిరోజు ఇద్దరు ఎస్సీలను కొట్టడమే ఈ వివాదానికి కారణమని గ్రామస్థులు తెలిపారు. అయితే కొందరు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఈ విషయాన్ని కక్షపూ రితంగా భావించి రెండు మూడు రోజుల నుంచి దళితవాడకు మంచినీరు అందచకుండా, దళితుల పాలు పాలకేంద్రాలకు పోయించుకోకుండా, ఉపాధి పనుల నుంచి వెనక్కి పంపిస్తున్నారని దళితవాడకు చెందిన మహిళలు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, శాంతియుత వాతావరణంలో ఉండాలన్నారు. వివాదాలకు పాల్పడే వ్యక్తులను పోలీసులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని తెలిపారు. కాగా దళితులపై దాడికి పాల్పడిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన 12 మందిని బైండోవర్ చేసుకు న్నామని గుడ్లూరు ఎస్ఐ వెంక ట్రావు తెలిపారు. ఈ విషయం తెలి సుకున్న బీజేపీ నాయకులు దప్పళంపాడుకు చేరుకొని వివాదం జరిగిన తీరుపై విచా రణ చేపట్టారు. అన్యాయం జరుగుతున్న దళితులకు బీజేపీ అండగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి బైరి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుడ్లూరు మండల అధ్యక్షుడు ఇన్నమూరి ప్రమీల సుధాకర్ పాల్గొన్నారు.

సోమశిలలో 48.744 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 48.744 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 5,880, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసె క్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

బత్తిన సాయికుమార్ రెడ్డి హఠాన్మరణం



సాయికుమార్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం/ వైద్యం), మే 13 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద భావ ప్రచార సమితి అధ్యక్షుడు, ప్రముఖ ప్రవచకుడు బత్తిన సాయికుమార్ రెడ్డి(54) సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు మంగళ వారం అభిమానులు, శిష్యులు, రాజకీయవేత్తలు, మేధావులు, విద్యార్థులు, బంధుమిత్రుల కన్నీటి వీడ్కోలుతో జరిగాయి. పలువురు ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. కాగా, సాయకుమార్‌రెడ్డి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. రెడ్‌క్రాస్ ఫౌండర్ సభ్యుడు వాకాటి రవీంద్ర సహకారంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ మంగళ వారం నేత్రాలను సేకరించారు.

అంగన్‌వాడీల్లో పాఠశాల సంసిద్ధత ఉత్సవాలు



చిన్నారులతో సీడీపీవో లక్ష్మీదేవి

నెల్లూరు (హరనాథ పురం), మే 13(ఆంధ్రజ్యోతి) : విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే చిన్నారుల్లో ఆసక్తి, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన పాఠశాల సంసిద్ధత ఉత్సవాలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. మంగళవారం నెల్లూరులో బాలాజీనగర్ సెక్టార్‌లోని అంగన్ వాడీ కేంద్రాల్లో ఈ ఉత్సవాలను అర్బన్ సీడీపీవో కరణం లక్ష్మీదేవి ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు కార్యకర్తలు ఆటపాటలతో కూడిన విద్యను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ తమలపాకుల అశోక్‌కుమారి, ఎఫ్ఎల్ఎన్‌డీసీ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.